www.visalaandhra.com
స్థాపితం : 1952
Dwaraka
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం
సంపుటి : 66 సంచిక : 205 | సోమవారం 15-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | పేజీలు : 12+ టాబ్లాయిడ్ వెల: రూ.3.00 | విజయవాడ ప్రచురణ



మంచు పల్లకి

భారత్‌లో వ్యాపారం
- 10 క్రిప్టో కరెన్సీ మార్పిడి కంపెనీలు
- నెలకు రూ.10 వేల కోట్ల మార్పిడి
- 50 లక్షల మంది వినియోగదారులు
- బదిలీ చార్జీలు 0.5 నుంచి 2 శాతం వరకు
- పెరుగుదల 10 శాతం/సంవత్సరం
- ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజు రూ.లక్ష కోట్ల మార్పిడి

- ఏపీ,తెలంగాణల్లో బిట్‌కాయిన్ మేనియా
- కొద్ది పెట్టుబడితో కోటీశ్వరులవుతారట
- రహస్యంగా నడుస్తున్న ట్యుటోరియల్స్
- పుట్టగొడుగుల్లా క్రిప్టో దుకాణాలు



విశాలాంధ్ర బిజినెస్ డెస్క్:
లక్షో.. రెండు లక్షలో.. మీవి కాదనుకోండి. ప్రపంచానికి కనిపించని నాణేలను కొనెయ్యండి. మీకు కాస్త కంప్యూటర్ గురించి తెలిసి ఉంటే చాలు, స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ లావాదేవీలు చేసే పరిజ్ఞానం ఉంటే కోటీశ్వరులను చేసే పూచీమాది. భవిష్యత్తంతా భౌతికంగా కనిపించని ఈ కరెన్సీదే. ఈ నాణేలను ఎప్పుడు అమ్మాలో మేం చెప్తాం. ఈజీమనీ భ్రమ కాదు. నిజంఅని ఓ చిన్నగదిలో ప్రొజెక్టర్, స్క్రీన్‌పై ఓ వ్యక్తి ఇస్తున్న పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వింటున్న 30 మందిని మాయా ప్రపంచంలోకి తీసుకెళ్తున్నది. ఈవిధంగా చేసే తాను లక్షలు సంపాదించానని చెప్తున్నాడు. దాదాపు గంటా నలభై అయిదు నిమిషాలపాటు అతని ప్రసంగం విన్నవాళ్లెవరైనా ఆ పెట్టుబడులకు ఆకర్షితులవవడం ఖాయం. అప్పు చేసైనా అదృశ్య కరెన్సీని కొనెయ్యాలని తహతహలాడుతారు. దీనిపేరు క్రిప్టో కరెన్సీ. ప్రపంచవ్యాప్తంగా ఏకరూప కరెన్సీ చలామణి కానున్నదన్న పేరుతో బిట్‌కాయిన్ల రూపంలో క్రిప్టో కరెన్సీ వ్యవస్థ వేళ్లూనుకొన్నది. ప్రపంచంలోని అన్ని దేశాలూ డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఏ దేశానికీ చెందని బిట్‌కాయిన్ వ్యవస్థ ప్రపంచ దేశాలన్నింటినీ తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది.

ఈ పరిస్థితిని సొమ్ము చేసుకొనేందుకు కొందరు బిట్‌కాయిన్ ట్యూటర్లుగా అవతరించారు. ఈ ట్యూటర్లు అనుయాయులు, నమ్మకస్తులు, బంధువులకే రహస్య అవగాహన కల్పిస్తున్నారు. బిట్‌కాయిన్ల కొనుగోలు, బదిలీ, అమ్మకంపై

- మిగతా 2 లో

రోజూ యోగాతో
మెదడు వయసుకు కళ్లెం
డిపాస్ అధ్యయనం వెల్లడి



న్యూఢిల్లీ:
ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా మెదడు వయసుకు కళ్లెం వేయవచ్చని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజియాలజీ అండ్ అలైడ్ సైన్సెస్ (డిపాస్) నిర్వహించిన అధ్యయనం వెల్లడిస్తోంది. డిపాస్ పరిశోధకులు

- మిగతా 2 లో

బరితెగించారు..!

- డింకీ మాటున కత్తులు కట్టారు
- చేతులు మారిన రూ.300 కోట్లు
- కృష్ణా, పశ్చిమలో పోటాపోటీ
- సీసలిలో రూ.5 లక్షల పందేలు
- విజయవాడలోనూ పందేల జోరు
- తోటల్లోనే మద్యం, జూద కేంద్రాలు
- తనిఖీలకే పరిమితమైన పోలీసులు
- చిత్తూరులో ఆగని జల్లికట్టు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి
కోడి పందేల నిర్వాహకులు 'బరి'తెగించారు. డింకీ మాటున కోళ్లకు కత్తులు కట్టి మరీ కోడి పందేలు నిర్వహించారు. ఈ సంక్రాంతికి కోడి పందేలు అడ్డుకునేందుకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా, చివరకు వెనుకంజ వేయక తప్పలేదు. కోస్తా జిల్లాల్లో పలు చోట్ల ఆదివారం భారీగా కోడి పందాలు ప్రారంభమయ్యాయి. కృష్ణాజిల్లాలో పండక్కి ఒక్క రోజు ముందుగానే కోడి పందేలు వేయగా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, గుంటూరు జిల్లాల్లో ఆదివారం పందేలు ప్రారంభమయ్యాయి. ఆయా జిల్లాల ఎస్పీలు, విజయవాడ పోలీసు కమిషనర్ పందేలు జరగకుండా చేసేందుకు చేపట్టిన ప్రయత్నాలు ఫలించలేదు. హైకోర్టు ఉత్తర్వులు, పోలీసుల ఆంక్షలు కోడి పందేల బరుల్లోకి పందెపురాయుళ్లను వెళ్లనీయకుండా అడ్డుకోలేకపోయాయి. ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లతో పందేలకు అనుమతించక తప్పలేదు. దీంతో ఆదివారం మధ్యాహ్నం వరకు బరుల వద్దే గస్తీ ఉన్న పోలీసులు ఆ తర్వాత ఒక్కసారిగా మాయమయ్యారు. కోస్తా జిల్లాల్లో తొలి రోజున రూ.300



కోట్లపైనే చేతులు మారినట్లు సమాచారం. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని సీసలిలో అత్యధికంగా ఒక్కో పందెం రూ.5 లక్షలకు, దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు సొంత నియోజకవర్గం తాడేపల్లిగూడెంలో రూ.లక్షకు పందేలు జరిగాయి. ఉండిలో బీజేపీ నేత రఘురామకృష్ణంరాజు, ఉండి ఎమ్మెల్యే శివరామరాజు డింకీ పందేలను ప్రారంభించారు. ఆ తర్వాత నుంచి

- మిగతా 2 లో

పండుగ పూట పస్తులే..

విశాలాంధ్రబ్యూరో - అమరావతి
సంక్రాంతి వస్తూనే అందరి ఇళ్లల్లోనూ నూతన క్రాంతి వస్తుంది. ఈ పండక్కి గ్రామాల్లో నవ కాంతులతో నూతన శోభ కనిపిస్తుంది. ఇక అన్ని కుటుంబాల్లోనూ సంక్రాంతి సందడి ఉంటుంది. కాని ఆ

- జీతాలకు నోచుకోని పంచాయతీ కార్మికులు
- 20 వేల కుటుంబాలు ఇక్కట్లపాలు
- మూడు నుంచి 9 నెలల జీతాల పెండింగ్
- పట్టించుకోని ప్రభుత్వం

ఇళ్లల్లో మాత్రం ఈసమంత కూడా పండుగ వాతావరణం కనిపించటంలేదు. కొన్ని నెలలుగా ఆ కుటుంబాలు పస్తులుంటున్నాయి. పండుగ రోజైనా తమ బతుకుల్లో వెలుగు రాకపోదా అనుకున్న వారి ఆశలు అడియాసలయ్యాయి. సుమారు 20 వేల కుటుంబాలు సంక్రాంతి పండుగకు దూరంగా ఉన్నాయి. నేడు రాష్ట్రంలోని పల్లెలు పరిశుభ్రంగా ఉన్నాయంటే కారణమైన వారికి



కొన్ని నెలలుగా జీతాలు లేకపోవటమే ఇందుకు కారణం. రాష్ట్రంలోని 12,980 గ్రామ పంచాయతీల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న 20 వేల మంది పంచాయతీ కార్మికులకు సంక్రాంతికి కూడా చేతికి జీతాలు అందలేదు. దీంతో పంచాయతీ కార్మికుల కుటుంబాల్లో పండుగ వాతావరణమే కొరవడింది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మూడు నుంచి తొమ్మిది నెలల వరకు జీతాలకు నోచుకోని కార్మికులూ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. పారిశుధ్య నిర్వహణలో జాతీయస్థాయిలో అవార్డులు పొందుతూ సంబరాలు చేసుకుంటున్న పాలకులకు, ఆ అవార్డుకు కారణమైన

- మిగతా 2 లో

చిల్లర విపణిలోకి ఎఫ్‌డీఐలు వినాశకరం
ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్
7లో

ఇదీ లోకం!



పాతరేనా..?

- కొలిక్కిరాని ఏపీపీఎస్సీ పాత నోటిఫికేషన్లు
- 18 నుంచి గ్రూప్-2 ధ్రువీకరణ పత్రాల పరిశీలన
- కొత్త కేలండరుపై అభ్యర్థుల ఆశలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూపు-2 రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల విద్యార్హత ధ్రువీకరణ పత్రాల్ని ఈనెల 18వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ పరిశీలిస్తారు.విజయవాడ బందరురోడ్డు(ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం ఎదురుగా)లోని ఏపీపీఎస్సీ కార్యాలయం, రెండో అంతస్తులో ప్రతి రోజూ ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతుంది.చివరిరోజైన ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం, సాయంత్రమూ ధ్రువీకరణ పత్రాల్ని అభ్యర్థుల రిజిష్టర్ నంబర్ల ఆధారంగా పరిశీలిస్తారు.ఈ నెల 18వ తేదీన 1 నుంచి 100 వరకూ గల రిజిష్టర్ల నంబర్లు, 19న 201 నుంచి 312 వరకూ, 22న 401 నుంచి 508, 23న 601 నుంచి 712, 24న 801 నుంచి 908 అభ్యర్థుల పత్రాల్ని పరిశీలిస్తారు. 25న 1001 నుంచి 1112, 29న 1201 నుంచి 1312, 30న 1401 నుంచి 1508, 31న 1601 నుంచి

- మిగతా 2 లో

బడ్జెట్‌పై కోటి ఆశలు
వరాల కోసం 13 రంగాల ఎదురుచూపులు
7లో

హిందూరాష్ట్రలో ముస్లింలకు స్థానం లేదు : బీజేపీ ఎమ్మెల్యే
9 లో


తెలుగు అమ్మాయికి అరుదైన అవకాశం



న్యూ ఢిల్లీ:
తెలుగమ్మాయికి అరుదైన అవకాశం లభించింది. షిప్ ఫర్ వరల్డ్ యూత్ లీడర్స్ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీతేజ అనే యువతి ఎంపికైంది. జపాన్ ఏటా నిర్వహించే ఈ కార్యక్రమానికి భారత్ నుంచి హాజరయ్యే 10 మంది బృందానికి శ్రీతేజ నేతృత్వం వహించనున్నారు. పార్లమెంట్ రీసెర్చి ఫెలోషిప్ విద్యార్థినిగా ఉన్న శ్రీ తేజను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ ఎంపికచేసింది. యువతీ యువకుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించనున్న ఈ కార్యక్రమానికి 11 దేశాల నుంచి 240 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. దీనిద్వారా రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ప్రతినిధులకు అవగాహన కల్పించనున్నారు.




న్యూగినియాలో బద్దలైన అగ్నిపర్వతం



న్యూగినియా : పపువా న్యూగినియా దీవిలో అగ్నిపర్వతం బద్దలైంది. అనేక రోజులుగా ఈ పర్వతం నుంచి విరామంలేకుండా బూడిద వెలువడుతోంది. అగ్ని పర్వతం బద్దలు కావడంతో ఎర్రటిరాళ్లు, సల్ఫర్ డై ఆక్సైడ్, పరిసర ప్రాంతాలకు వెదజల్లుతోందని రబ్బుల్ వల్కనో లాజికల్ అబ్జర్వేటర్ ఒక బులిటన్‌లో తెలిపింది. ఆప్రాంతంలో నివశిస్తున్న 1500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు స్థానిక రెడ్ క్రాస్ అధికారులు ఆదివారం తెలిపారు. కడోవార్ దీవిలో ఈ అగ్ని పర్వతం బద్దలైంది. ఈనెల 5 నుంచి అగ్నిపర్వతం నుంచి వాతావరణంలోకి బూడిద వెదజల్లుతోంది. కడోవర్ దీవి నుంచి బ్లప్‌బ్లప్ దీవికి దాదాపు 600 మందిని తరలించారు. సురక్షిత ప్రాంతాలకు తరలించిన ప్రజలకు సహాయ కార్యక్రమాల కోసం 26,275 డాలర్లు కేటాయించినట్లు న్యూగినియా రెడ్ క్రాస్ సెక్రటరీ జనరల్ వెనమా రొవ తెలిపారు.

పెరూలో భూకంపం.. సునామీ హెచ్చరిక జారీ



లిమా : పెరూలో ఆదివారం భూకంపం సంభవించింది. భూకంప లేఖినిపై 7.3 తీవ్రతతో ప్రకంపనలు నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే అధికారులు ధ్రువీకరించారు. పుక్వియో నగరానికి 124 కి.మీ దూరంలో ఈ భూకంపం సంభవించింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో ఇళ్లలోని ప్రజలు భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. భూకంపం వచ్చిన 300 కి.మీ పరిధి వరకు మాత్రమే సునామీ హెచ్చరికలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రకంపనలు వచ్చిన ప్రదేశానికి సమీపంలో దాదాపు 10 మిలియన్ల మంది ప్రజలు నివసిస్తున్నారు.



పాలస్తీనా సొరంగాన్ని ధ్వంసం చేసిన ఇజ్రాయిల్



జెరూసలేం : గాజా స్ట్రిప్ ప్రాంతంలో పాలస్తీనా సైన్యం ఇజ్రాయిల్‌లోకి వచ్చేందుకు వీలుగా ఉన్న సొరంగాన్ని తాము ధ్వంసం చేసినట్లుగా ఇజ్రాయిల్ ఆదివారం ప్రకటించింది. ఈ సొరంగం ఇజ్రాయిల్ మీదుగా ఈజిప్టువరకు ఉంటుంది. పాలస్తీనాలోని హమాస్ సంస్థ ఈ సొరంగాన్ని నిర్మించిందని తమ పై దాడుల కోసం దీన్ని వినియోగిస్తున్నందున ధ్వంసం చేసినట్లు ఇజ్రాయిల్ సైనిక ప్రతినిధి జోనథాన్ కొంత్రికస్ చెప్పారు. సొరంగం ధ్వంసం చేసనప్పుడు ఎవరైనా చనిపోయారా లేదా అన్ని విషయం తనకు తెలియదన్నారు. ఇజ్రాయిల్ గాజా స్ట్రిప్‌ల మధ్య వస్తువుల రవాణాకు ఈ సొరంగం బాగా ఉపయోగపడుతోంది. వైమానిక దళాలు ఈ సొరంగాన్ని రద్దు చేశాయని ఆయన చెప్పారు. గాజా స్ట్రిప్ రఫహ్ నగరానికి తూర్పు ప్రాంతం నుంచి ఈ సొరంగం ఇజ్రాయిల్ లోపలికి 180 మీటర్ల వరకు ఉంటుంది. అక్కడి నుంచి ఈజిప్టు వైపు కొనసాగుతుంది. అయితే ఈజిప్టు వరకు ఇంత ఉంటుందని తనకు తెలియదని కొంత్రికస్ చెప్పారు.

ఇరాన్‌తో అణు ఒప్పందం రద్దును వ్యతిరేకిస్తాం

అమెరికాకు స్పష్టం చేసిన రష్యన్ అధికారులు



మాస్కో : ఇరాన్‌తో కుదిరిన అణుఒప్పందాన్ని రద్దు చేసేందుకు జరిగే ఎలాంటి ప్రయత్నాలనైనా తాము వ్యతిరేకిస్తామని రష్యన్ అధికారులు స్పష్టం చేశారు. ఇరాన్‌తో అణు ఒప్పందాన్ని సమీక్షిస్తామని, రద్దు చేసుకునే అవకాశాలను పరిశీలిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు చెప్పారు. తాజాగా ఇరాన్ ఒప్పందాన్ని సమీక్షించే అంశంపై యూరోపియన్ యూనియన్ మిత్రదేశాలతో చర్చలు జరుపుతామని అమెరికా చేసిన ప్రకటనపై రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా విదేశాంగ శాఖ డిప్యూటీ మంత్రి సెర్జీ రిబ్కో విలేకరులతో మాట్లాడుతూ అమెరికా జరిపే చర్చలు అణుఒప్పందంపైన ఎలాంటి ప్రభావాన్ని చూపినా అంగీకరించబోమన్నారు. లోతుపాతులను విశ్లేషిస్తామని రానున్న పరిణామాలను జాగరూకతతో అంచనావేస్తామన్నారు. 2015లో ఇరాన్‌తో అమెరికా మరో 5 అణ్వస్త్ర దేశాలు కలసి పౌర అణుఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఒప్పందంపై సంతకం చేసిన దేశాల్లో రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్, చైనా అమెరికా, జర్మనీ ఉన్నాయి. చివరిసారిగా ఈ ఒప్పందాన్ని పొడిగిస్తున్నానని తదుపరి ఒప్పందాన్ని పొడిగించకుండ రద్దుచేస్తామని 2 రోజుల క్రితం ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో కుదిరిన ఒప్పందం అమెరికాకు వినాశకరమైనదని ట్రంప్ పలుమార్లు చెప్పారు. ట్రంప్ వైఖరి అణుఒప్పందం కొనసాగింపుపై సందేహాలు కలిగిస్తోంది. రాజకీయ, దౌత్యమార్గాల్లో ఈ సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. ట్రంప్ ప్రకటనకు ఇరాన్ విదేశాంగ శాఖ స్పందిస్తూ 2015లో కుదిరిన ఒప్పందం కోసం తాము ఏరోజూ చర్చలకు పిలవలేదని, అమెరికా ఒత్తిళ్ల మూలంగానే ఈ ఒప్పందం కుదిరిందని పేర్కొంది. ఒప్పందాన్ని రద్దు చేస్తామని ట్రంప్ ప్రకటించడం అత్యంత ప్రమాదకరమని, అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమేనని, రష్యా ఫెడరేషన్ కౌన్సిల్ విదేశీ వ్యవహారాల కమిటీ చైర్మన్ కొనస్టాటిన్ కొసచ్చియేవ్ అన్నారు. ఒప్పందం పై సంతకాలు చేసిన ఇతర దేశాల అమోదం లేకుండా రద్దుకు ప్రయత్నించడం అంతర్జాతీయ చట్టమౌలిక సూత్రాలను ఉల్లంఘించడమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి 120 రోజులకు ఇరాన్‌పై విధించిన ఆంక్షలను సస్పెండ్ చేస్తూ ఈ ఒప్పందం కింద అమెరికా అధ్యక్షుడు సంతకం చేయవలసి ఉంటుంది. ఈ విధంగా చేయడం ద్వారా ఒప్పందాన్ని కొనసాగిస్తున్నారు.



నేడు కొరియాల మధ్య మరో దఫా చర్చలు

సియోల్ : ఉత్తరకొరియా,దక్షిణకొరియాల మధ్య కార్యాచరణ స్థాయి చర్చలు సోమవారం జరగనున్నాయి. ఉత్తరకొరియా సరిహద్దుల్లోని పన్‌ముంజమ్ గ్రామంలో సోమవారం ఈ చర్చలు జరుగుతాయని దక్షికొరియా ఏకీకరణ మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసింది. చర్చలకు సాంస్కృతిక ,టూరిజం శాఖ అధికారి నాయకత్వంలో ఒక బృందం వెళుతుందని ఆ ప్రకటన పేర్కొంది. ఉత్తర కొరియా కూడా కళారంగానికి చెందిన బృందాన్ని పంపుతున్నట్లు తెలిపింది. దక్షిణ కొరియాలో జరిగే వింటర్ ఒలంపింక్స్‌కి తమ క్రీడాకారుల బృందాన్ని పంపించేందుకు ఇదివరకే ఉత్తర కొరియా అంగీకరించింది. శాంతి ప్రాంతంగా పరిగణించే టోంగిల్ పెవిలియన్‌లో పలుమార్లు చర్చలు జరిపేందుకు ఇరుదేశాలు ఒక అవగాహనకు వచ్చాయి. ఒలంపిక్స్‌లో పాల్గొనే క్రీడా బృందానికి సంబంధించిన వివరాలను ప్రధానంగా ఈ సమావేశంలో చర్చించనున్నారు. రెండుదేశాల ప్రతినిధుల మధ్య ఈనెల 20న కూడా అంతర్జాతీయ ఒలంపిక్స్ కమిటీ ఆధ్వర్యంలో చర్చలు జరుగుతాయని ఉత్తర కొరియా తెలియ చేసింది.

కాలిఫోర్నియా దుర్ఘటనలో 19కి పెరిగిన మృతులు

కాలిఫోర్నియా : కాలిఫోర్నియా నగరంలో బురదలో కూరుకుపోయి మరణించిన వారి సంఖ్య 19కి పెరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. శాంటాబార్బరా కౌంటీ ప్రాంతంలో బురద ప్రవాహం సంభవించగా, ఐదుగురు కనిపించడం లేదని వారికోసం ఇంకా గాలిస్తున్నామని తెలిపారు. ఎడతెరిపిలేకుండా బురద ప్రవహిస్తున్నదని వారు పేర్కొన్నారు. అత్యవసర సహాయ బృందాలు వచ్చి గాలింపులు జరుపుతున్నాయని శాంటాబార్బరా కౌంటీ షరీఫ్ బిల్ బ్రౌన్ చెప్పారు.

భారత శాంతి దళాలు నిర్మించిన వంతెన

ఐరాస : దక్షిణ సూడాన్‌లోని నదిపై కూలిపోయిన వంతెనను ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని భారత శాంతి దళాలు రికార్డు సమయంలో నిర్మించాయి. సూడాన్ అంతర్యుద్ధంతో తల్లడిల్లుతోంది. తూరు- సెంట్రల్ ఆఫ్రికా మధ్య అకోకా గ్రామం వద్ద వంతెన మాత్రమే ప్రధాన రహదారిగా ఉపయోగపడుతోంది. గత జూన్‌లో కురిసిన భారీ వర్షాలకు ఈ వంతెనపై 300 మీటర్ల ప్రాంతం కూలిపోయింది. సూడాన్ ప్రభుత్వం సహాయంతో వంతెనను భారత శాంతి దళాలు కేవలం 10 రోజుల్లో నిర్మించాయని ఐక్యరాజ్యసమితి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రాంతంలో ఇతర రహదారుల మరమ్మతులకు ఈ వంతెన చాలా కీలకమైందని భారత ఇంజనీరింగ్ కంపెనీ ఇన్‌చార్జి లెఫ్టినెంట్ కల్నల్ నిష్కమ్‌పురి వెల్లడించినట్లు ఆ ప్రకటన పేర్కొంది. 4 మీటర్ల లోతున నీరున్న ప్రాంతంలో వంతెన నిర్మించడం పెద్ద సవాలుగా నిలిచిందని పేర్కొన్నారు.



భీతిగొలిపిన మిసిలీ అలారం

హోనులులు : హవాయికి తరలిస్తున్న బాలిస్టిక్ మిసిలీ హెచ్చరిక అలారం పొరపాటున మోగడంతో హోనులులు నగర ప్రజలు పూర్తిస్థాయి భయాందోళనలకు గురయ్యారు. ఎమెర్జెన్సీ అలారం పొరపాటున మోగిందని అధికారులు ప్రకటించారు. క్షిపణిని విన్యాసాల కోసం తరలించడం లేదని, హవాయికి తరలిస్తుండగా పొరపాటున అలారం మోగిందని అధికారులు వెల్లడించారు. అలారం మోగడంతో ప్రజలు ఫోన్లద్వారా నగరమంతటినీ అప్రమత్తం చేశారు. ఎందువల్ల ఇలా అలారం మోగిందనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని హవాయి ఎమెర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ప్రతినిధి రిచర్డ్ తెలిపారు.

మెదడు వయసుకు కళ్లెం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపిన వివరాల ప్రకారం రోజూ యోగా సాధన చేసే పురుషుల్లో మెదడు, గుండె సంబంధిత రుగ్మతలు చాలా వరకు అదుపులో ఉన్నట్లు గుర్తించారు. పెరిగే వయసుతో పాటుగా సంక్రమించేందుకు అవకాశాలున్న మతిమరుపు, బీపి వంటి రుగ్మతలను నివారించుకోగలుగుతారన్నారు. అమెరికన్ ఏజింగ్ అసోసియేషన్‌లో పరిశోధన నివేదికను ప్రచురించారు. 20-30సంవత్సరాల వరకు మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని పరిశోధకులు చెప్పారు. 40సంవత్సరాల నుంచి నిదానిస్తుందన్నారు. ఈ సమయంలోనే తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నిదానించే లక్షణాలను అదుపు చేయడానికి యోగ సాధన ఉపయోగపడుతుందన్నారు.



మంచు పల్లకి

(మొదటిపేజీ తరువాయి)



అవగాహన కోసం ఒక కోర్సు నేర్చుకోవాలని.. దీనికి రూ.15వేల ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరిస్తారు. మిడిమిడి జ్ఞానంతో క్రిప్టో కరెన్సీ లావాదేవీలను ప్రారంభిస్తే తీవ్రంగా నష్టపోతారని భయపెడుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ తరగతులు ఇప్పుడు జరుగుతున్నాయి. వీటిద్వారా ఆకర్షితులైన వారికి తాము రూపొందించిన కోర్సులో శిక్షణ ఇచ్చి.. ఆ తర్వాత అసలు రంగంలోకి దింపుతున్నారు.

ఎగువ మధ్యతరగతి వర్గమే లక్ష్యం

ఉద్యోగస్తులు, చిన్న, మధ్యతరహా వ్యాపారులే క్రిప్టో కరెన్సీ వ్యాపారానికి లక్ష్యంగా మారుతున్నారు. వీరందరినీ సమీకరించడానికి ఏజెంట్లు పనిచేస్తున్నారు. సాధారణంగా తక్కువగా ఉత్పత్తి అయ్యే వస్తువులకు డిమాండ్ అధికంగా ఉంటుంది. బిట్‌కాయిన్ వ్యవస్థ కూడా అంతేనని ట్యూటర్లు నమ్మిస్తున్నారు.

చరిత్ర ఇది

మొదటిసారి 2008లో బిట్‌కాయిన్‌పై ఓ వ్యాసం ఒక జపాన్ దేశస్థుడి పేరుతో ప్రచురితమైంది. 2009 జనవరి 3నుంచి ఈ వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. ఇది ఏ దేశం నియంత్రణలో ఉన్నదీ, సృష్టికర్త ఎవరన్నది ఎవరికీ తెలియదు. ఇది పూర్తిగా ఆన్‌లైన్ ద్రవ్యవ్యవస్థ. భౌతికంగా దీనికి ఎలాంటి అస్తిత్వం లేదు. కంప్యూటర్ల ద్వారా గణిత శాస్త్ర సమీకరణాలతో బిట్‌కాయిన్లను సృష్టిచేసి వాటిని మార్కెట్‌లో అమ్ముతారు. ప్రస్తుతం ప్రపంచంలో 1.22కోట్ల బిట్‌కాయిన్లు ఉన్నట్లు అంచనా. వీటిని 2.1కోట్లకు మించకుండా ఉండేలా విధానాన్ని రూపొందించారు. క్రిప్టో కరెన్సీ చెలామణిలో డిపాజిట్ కీ. డ్రా కీ ఉం టాయి. దాంతో మరొకరు దొంగతనం చేసే వీల్లేకుండా పారదర్శకంగా ఉంటుందన్నది ట్యూటర్ల అభిప్రాయం. కనీసం 1200 రకాల కాయిన్లు ప్రస్తుతం చలామణిలో ఉన్నాయని అంచనా.

బోగస్ వెబ్‌సైట్లు

ఓ వ్యక్తి తన దగ్గరున్న కాయిన్లను అమ్మడానికి నిర్ణయించుకొని కాయిన్లను బదిలీ చేస్తున్న సమయంలో కీ తెలుసుకొన్న మరోకరు ఆ కాయిన్లను వేరేవారికి అమ్మేశాడు. సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయిస్తే గానీ అసలు విషయం ఇద్దరికీ అర్థం కాలేదు. బిట్‌కాయిన్లకు సంబంధించి అనేక బోగస్ వెబ్‌సైట్లు దర్శనమిస్తున్నాయి. ఏది అసలో, ఏది నకిలీదో గుర్తించిన తర్వాతే లావాదేవీలకు అడుగేయాలి.

వాట్సప్ గ్రూపుల్లోనే అంతా..

బిట్ కాయిన్, వన్ కాయిన్.. ఇలా క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెట్టిన వారంతా వాట్సప్ గ్రూపులను నడిపిస్తున్నారు. లాభదాయకమైన అంశాన్ని గుర్తించగానే ఒకరికొకరు సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటున్నారు. ఒకరు కాయిన్స్‌ను విక్రయిస్తే మిగతావారూ అనుకరిస్తున్నారు. ఒక దాంట్లో నుంచి మరొక కాయిన్స్‌లోకి పెట్టుబడులను మార్చేందుకు ఈ గ్రూపుల్లోనే చర్చించుకుంటున్నట్లు ఓ ట్యూటర్ వివరించారు.ఆన్‌లైన్‌లో అనేక వెబ్‌సైట్లల్లో క్రిప్టో కరెన్సీ గురించి సమాచారం లభిస్తున్నది. బిట్ కాయిన్, ఈథర్, రిప్పల్, లైట్‌కాయిన్, బిట్ కాయిన్ క్యాష్, నియో, స్ట్రాటిస్ కాయిన్స్ క్రిప్టో కరెన్సీని నడిపిస్తున్నాయి.

పుట్టగొడుగుల్లా క్రిప్టో దుకాణాలు

హైదరాబాద్‌లో క్రిప్టో కరెన్సీ దుకాణాలు అసంఖ్యాకంగా ఉన్నా వాటిని గుంభనంగా నడిపిస్తున్నారు. వాటికి బోర్డులుండవు. చాలా వరకు అపార్టుమెంట్లలోనే నడుస్తున్నాయి. ఐతే ప్రత్యేక సమయంలో మాత్రమే దాన్ని తెరుస్తారని గుర్తించింది. పైగా అక్కడ ఎంటర్‌ప్రైజెస్ పేరిట బోర్డు ఉంది. ఏజెంట్లు వారి అనుయాయులతో పెట్టుబడి పెట్టిస్తున్నా రు. ఐతే కీ(పాస్‌వర్డ్) మాత్రం చెప్పకుండా మోసాలకు పాల్పడుతున్నారని సమాచారం.

'బరి'తెగించారు..!

(మొదటిపేజీ తరువాయి)

కోళ్లకు కత్తులు కట్టి భారీ ఎత్తున పందేలు నిర్వహించారు. కోడి పందేలపై పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ ఆదివారం ఉదయం వరకు గట్టిగా వ్యవహరించినా, ఆ తర్వాత మెత్తబడక తప్పలేదు. దీంతో ఆ జిల్లాల్లో కొప్పాక, అప్పనవీడు, శ్రీరామవరం, అయి భీమవరం, వెంప, కవ్వగుంట, దిబ్బగూడెం, భీమవరం, నర్సాపురం, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పందేలు నిర్వహించారు. అయితే ఆ జిల్లాల్లో పందేలన్నీ మధ్యాహ్నం రెండు గంటల తర్వాతే ప్రారంభమయ్యాయి. ఉండిలో మాత్రం ఎమ్మెల్యే శివరామరాజు డింకీ పందేలంటూ ఉదయాన్నే ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ 50 బరుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేయటంతోపాటు పలువురిపై బైండోవర కేసులు పెట్టారు. చివరకు ట్రాక్టర్లతో బరులను దున్నినా పందేలకు అడ్డుకట్ట వేయలేకపోయారు. పోలీసుల ఆంక్షలతో నిర్వాహకులు పట్టుబట్టి మరీ పందేలు నిర్వహించటం గమనార్హం.

తూర్పులోనూ భారీగానే...

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప సొంత జిల్లా తూర్పు గోదావరిలోనూ భారీగానే కోడి పందేలు ప్రారంభమయ్యాయి. పోలీసుల ఆంక్షలపై ప్రజా ప్రతినిధులు ఎదురు తిరిగి ఎక్కడికక్కడే పందేలు నిర్వహిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాల్లో రాజమహేంద్రవరం, మండపేట, అమలాపురం, కాకినాడ ప్రాంతాల్లోనూ భారీగా కోడి పందేలు ప్రారంభమయ్యాయి. ప్రజా ప్రతినిధులే దగ్గరుండి మరీ పందేలను నిర్వహించటం గమనార్హం. కృష్ణాజిల్లాలో గన్నవరం, గుడివాడ, కైకలూరు, హనుమాన్‌జంక్షన్, నూజివీడు, ఆగిరిపల్లి మండలం శోభనాపురం, ఈదులగూడెం, నెక్కలం - గొల్లగూడెం, విజయవాడ సమీపంలోని కొత్తూరు తాడేపల్లి, పెనమలూరు మండలం పెద పులిపాక, కంకిపాడు మండలం గొడవర్రు, ఈడ్పుగల్లులో భారీగా పందేలు జరుగుతున్నాయి. కృష్ణాజిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నిర్వహించిన గుండాటలో చిన్న పిల్లలు, యువత భారీ ఎత్తున పాల్గొనటం గమనార్హం. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొన్ని చోట్ల మధ్యాహ్నం రెండు గంటల తర్వాత పందేలు ప్రారంభమయ్యాయి. అప్పటి వరకు హడావుడి చేసిన పోలీసులు వెనక్కి తగ్గటంతో, పందేలరాయుళ్లు జూలు విదిల్చారు. పందేల నిర్వహణ ప్రదేశాల్లో పందేలు చూసేందుకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. తోటల్లో పందెపురాయుళ్ల కోసం మద్యం కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. అలాగే గుండాట, కోతముక్క, చిత్తులాట వంటి జూదాలు కూడా భారీగా సాగాయి. ఇక గుంటూరుతోపాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ కోడి పందేలు జరిగాయి.

జల్లికట్టులో ఉత్సాహంగా యువత

తమిళనాడు సరిహద్దులోని చిత్తూరు జిల్లాలో నిర్వహించిన జల్లికట్టు పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంది. తమిళనాడు నుంచి కూడా యువకులు జల్లికట్టు కోసం సీఎం చంద్రబాబు సొంత మండలం చంద్రగిరికి తరలివచ్చారు. ఒకవైపున సీఎం చంద్రబాబు నారావారిపల్లెలో పండుగ చేసుకుంటుండగా, అదే మండలంలోని మరో గ్రామంలో భారీగా జల్లికట్టు జరిగింది. కోడె గిత్తలను అదుపు చేసేందుకు యువత పోటీపడ్డారు.



పాతరేనా..?

(మొదటిపేజీ తరువాయి)

1712, ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 1801 నుంచి 1908 వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 1909 నుంచి 1935 రిజిష్టరు నంబర్లగల అభ్యర్థులకు నిర్వహిస్తారు. ఏపీ ప్రభుత్వం ఏపీపీఎస్సీ గ్రూప్-2(జనరల్) రిక్రూట్‌మెంటులో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్‌ను (నంబరు-18/2016) విడుదల చేసింది.ఈ రాత పరీక్షా ఫలితాలను 29 డిసెంబరు 2017న ప్రకటించారు.అర్హులైన అభ్యర్థులకు వ్యక్తిగతంగా కాల్‌లెటర్లను కమిషన్ కార్యాలయం నుంచి పంపారు. ఏపీపీఎస్సీ వెబ్‌సైట్లో ధ్రువీకరణ పరిశీలన షెడ్యూలు, అర్హత పొందిన రిజిష్టరు నంబర్లను పొందుపరిచారు.మొత్తం పదిరోజులపాటు ధ్రువీకరణ పత్రాల పరిశీల కొనసాగుతుంది.అర్హులైన అభ్యర్థులంతా సంబంధిత అసలు ధ్రువీకరణ పత్రాలతో కమిషన్ కార్యాలయానికి సకాలంలో చేరుకోవాలని సెక్రటరీ తెలిపారు.పూర్తి వివరాల కోసం ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌ను తిలకించాలని సూచించారు.

పాత నోటిఫికేషన్ల భర్తీలో తీవ్ర జాప్యం..!

2016లో ఏపీపీఎస్సీ కమిషన్ ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యాన నిర్వహించిన కేలెండరు నోటిఫికేషన్ ఉద్యోగాల భర్తీ ఓ కొలిక్కిరాలేదు.గ్రూప్-2 నోటిఫికేషనే ఇందుకు నిదర్శనంగా (గ్రూప్-2 జనరల్ నోటిఫికేషన్-18/2016) పోస్టుల భర్తీ ప్రక్రియ ఇంతవరకూ నిర్వహించకపోవడం విమర్శలకు దారితీస్తోంది.దాదాపు నెల రోజుల క్రితం విజయవాడ బందరురోడ్డులో కమిషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆశించిన స్థాయిలో కమిషన్ కార్యకలాపాలు పెరగలేదని అభ్యర్థులు వాపోతున్నారు. 2018 కేలండరు నోటిఫికేషన్‌ను ఇంతవరకూ కమిషన్ వెల్లడించకపోవడం గమనార్హం.ప్రతిఏటా ఏపీపీఎస్సీ నుంచి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వస్తాయని నిరుద్యోగులు ఆశిస్తున్నారు.హైదరాబాద్,విజయవాడ, విశాఖపట్నం తదితర నగరాల నుంచి ఏడాదిపాటు కోచింగ్‌లు తీసుకుంటున్నారు. కమిషన్ నుంచి ప్రణాళికా బద్ధంగా నోటిఫికేషన్లు రానందున వారంతా నిరుత్సాహానికి గురవుతున్నారు. అభ్యర్థుల వయోపరిమితిని 42(ఓసీ)లకు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.అటు ఏపీపీఎస్సీ నుంచి సకాలంలో నోటిఫికేషన్లు రాకపోవడం విమర్శలకు దారితీస్తోంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం తొలిసారిగా విజయవాడ కేంద్రంగా ఏపీపీఎస్సీ కమిషన్ కార్యాలయం కేంద్రంగా ఇంటర్వ్యూలు, ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు శ్రీకారం చుట్టారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నోటిఫికేషన్లకు రంగం సిద్ధం

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి కొద్ది రోజుల్లో నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేయనున్నారు.ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీలలో నెలకొన్న ఖాళీలను వెల్లడించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీపై ఆదివారం విజయవాడలో మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి..చివరి నిమిషంలో రద్దు చేశారు.దీంతో సంక్రాంతికిగానీ, ఆ తర్వాత గానీ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నారు.ఈ పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు.అటు జిల్లాల వారీగా నిర్వహించే ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ప్రక్రియను(డీఎస్సీ) ఏపీపీఎస్సీకి ప్రభుత్వం అప్పగించనుంది.

పండుగ పూట పస్తులే..

(మొదటిపేజీ తరువాయి)

కార్మికుల కష్టాలు తెలియకపోవటం గమనార్హం. రాష్ట్ర రాజధాని ప్రాంతమైన కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు సీఎం చంద్రబాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేష్ సొంత జిల్లా చిత్తూరుతోసహా అన్ని జిల్లాల్లోనూ పంచాయతీ కార్మికులు ఈ పండక్కి పస్తులుండటం గమనార్హం. రోజువారీ కూలీకి వెళ్లే వారుసైతం పండుగకు పిండి వంటలు చేసుకోవటంతోపాటు భార్యా, పిల్లలకు కొత్త బట్టలు కొనుగోలు చేస్తున్నారు. కాని ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రోడ్లను, డ్రెయినేజీలను పరిశుభ్రంగా ఉంచటంతోపాటు తాగునీరు, విద్యుత్ సరఫరాను సకాలంలో అందిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాల్లో మాత్రం ఆనందమే కనిపించటంలేదు.

అసలే అత్తెసరు జీతాలు

గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేసే కార్మికులకు నెల జీతం కనిష్ఠంగా రూ.1,500 నుంచి గరిష్టంగా రూ.8 వేలుగా ఉన్నాయి. నిత్యావసర ధరలు ఆకాశన్నంటుతున్న ఈ రోజుల్లో జీతాలు రూ.15 వేలు లేకపోతే కుటుంబ పోషణ కష్టమనే విషయం అందరికీ తెలుసు. పంచాయతీల ఆర్థిక పరిస్థితిని బట్టి కార్మికులకు రూ.1,500, రూ.6 వేలు, రూ.8 వేలు చొప్పున జీతాలు చెల్లిస్తున్నారు. ఈ అత్తెసరు జీతాలను కూడా మూడు నెలలకు ఒకసారి లేదా ఐదు నెలలకు ఒకసారి చెల్లించటం పరిపాటైంది. కొన్ని జిల్లాల్లోని కార్మికులకు తొమ్మిది నెలల జీతాలు చెల్లించాల్సి ఉందని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నేతలు చెబుతున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. జన్మభూమి మా ఊరు గ్రామ సభల సందర్భంగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, రంగోలి పోటీల నిర్వహణకు పంచాయతీలకు వేలాది రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే సంక్రాంతి సంబరాల నిర్వహణ కోసం రూ.13.55 కోట్లను విడుదల చేసింది. రాష్ట్రంలోని 20 వేల మంది పంచాయతీ కార్మికులకు సంక్రాంతి పండుగ సందర్భంగానైనా కనీసం ఒక నెల జీతం ఇచ్చేందుకు ఈ మొత్తం సరిపోతుందని సంఘ నేతలు అభిప్రాయపడుతున్నారు.

పండక్కి రూ.వెయ్యి అడ్వాన్స్

సంక్రాంతి పండుగ వస్తోంది కదా మా జీతాల సంగతేంటని కార్మికులు పంచాయతీ పాలకవర్గాలు, అధికారులను ప్రశ్నిస్తే, అడ్వాన్స్‌గా రూ.వెయ్యి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కుటుంబంలో ఐదుగురు సభ్యులుంటే కొత్త బట్టలు కొనేందుకు, పిండి వంటలు చేసుకునేందుకు వెయ్యి రూపాయలు ఏ మూలకు వస్తాయని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఒక్క సంక్రాంతేకాదు దీపావళి, దసరా, ఉగాది పండుగలకు కూడా తాము నోచుకోవటంలేదంటూ వాపోతున్నారు. జీతాలు పెంచాలని ఆందోళన చేస్తే మాత్రం తమపై సస్పెన్షన్ వేటు వేస్తామని బెదిరింపులకు దిగే ప్రభుత్వం జీతాల చెల్లింపు విషయాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోవటంలేదో అర్థంకావటంలేదంటున్నారు. పండుగ వస్తోందని ఎప్పటి నుంచో చెబుతున్నా, పట్టించుకోని అధికారులు, పండక్కి ఒక్క రోజు ముందు రూ.వెయ్యి అడ్వాన్స్ ఇచ్చారని కార్మికులు తెలిపారు. పండుగలు, ఇతర కార్యక్రమాల పేరుతో కోట్లాది రూపాయలను వృథా చేస్తున్న ప్రభుత్వం, రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించకపోవటం శోచనీయమని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నేతలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం గొప్ప కోసం వృథా ఖర్చులు చేస్తోందన్నారు. రాష్ట్రంలో అన్ని కుటుంబాల్లో ఉన్న సంతోషం, సందడి, పంచాయతీ కార్మికులకు దూరమైందని సంఘం నేత ఒకరు ఆందోళ వ్యక్తం చేశారు. సంక్రాంతి సంబరాలకు ఇచ్చినట్లే, కనీసం ఒక్క నెల జీతం ఇచ్చినా కార్మికులు పండుగ చేసుకునే వారన్నారు.

పంచాయతీలకు ఆగిన నిధులు

గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం మరో ఏడెనిమిది నెలల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధుల విడుదలను స్తంభింప చేసింది. దీంతో పంచాయతీల్లో చేపట్టే పలు అభివృద్ధి పనులతోపాటు కార్మికుల జీతాలను కూడా నిలిపేయాల్సి వచ్చిందని పలువురు సర్పంచ్‌లే చెబుతున్నారు.

నిత్యం కష్టపడుతున్న కార్మికులను పండుగ రోజుల్లో పస్తులుంచటం బాధాకరంగానే ఉన్నప్పటికీ, తమకు మరో ప్రత్యామ్నాయం లేదంటున్నారు. మూడు నెలల క్రితమే ప్రభుత్వం నుంచి నిధుల విడుదల నిలిచిపోయినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయట అప్పులు తెచ్చి ఒకటీ రెండు నెలల జీతాలు చెల్లిస్తున్నామన్నారు.

మంచు దుప్పట్లో విశాఖ

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- లంబసింగిలో 2, మైదాన ప్రాంతాల్లో 10 డిగ్రీలు



విశాలాంధ్ర-విశాఖపట్నం : విశాఖ జిల్లా మంచు దుప్పటి పరచుకున్నట్టుగా మారింది. మైదానం, మన్యం అని తేడా లేకుండా జిల్లాలోని అన్నిప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి చేరిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరిగి ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో మంచుకురుస్తూనే ఉంటుంది. ఈ తీవ్రత విశాఖ జిల్లాకే పరిమితం కాలేదు. ఉత్తరాంధ్రను సైతం గజగజ లాడిస్తోంది. ప్రధాన నగరాలతో పాటూ గ్రామాల్లో కూడా ఉదయం 9 గంటల వరకూ చలి తీవ్రత అధికంగానే ఉంటుంది. మరోపక్క మంచు కూడా ఉదయం 9 గంటల వరకూ కురుస్తుండటంతో ఇళ్ళ నుండి బయటకు వచ్చిన ఉద్యోగస్తులు, కూలీలు, విద్యార్థులు, ప్రయాణికులు, ప్రజలు రహదార్లపై ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విశాఖ ఏజెన్సీలో ఈ ఏడాది కనిష్ట ఉష్ణోగ్రతలు రెండుకు చేరుకోగా, మైదానం ప్రాంతంలో 10 డిగ్రీలకు పడిపోయాయి. వారం రోజులుగా చలితీవ్రత మరింత పెరిగింది. జిల్లాలో ఏజెన్సీ ప్రాంతమైన లంబసింగి 3600 అడుగుల ఎత్తులో ఉంది. అలాగే ఇక్కడి పరిసర ప్రాంతమైన డల్లాపల్లిలో సైతం అత్యంత శీతలగాలులు ప్రజలను తీవ్రంగా వణికిస్తున్నాయి.

భాషా పండిట్లకు ఊరట

- ప్రత్యేక సిలబస్‌తో టెట్ పేపర్-3
- సోషల్/మ్యాథ్స్/సైన్స్ సిలబస్ తొలగింపు
- వెబ్‌సైట్‌లో దరఖాస్తుల స్వీకరణకు వెసులుబాటు
- 150లో భాషాంశాలకు 90మార్కులు
- అభ్యర్థుల ఒత్తిడితో దిగొచ్చిన ప్రభుత్వం
- ఇక నుంచి పేపర్-1,2,3 విభాగాల్లో టెట్..



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్ సిలబస్‌పై గాబరా పడిన భాషా పండిట్లకు ప్రభుత్వ ప్రకటన ఊరటనిచ్చింది.భాషాంశాల కోసం ప్రత్యేకంగా పేపర్-3ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.ఈ మేరకు టెట్ వెబ్‌సైట్‌లో పేపర్-3 ఆప్షన్‌ను విద్యాశాఖ అందు బాటులో ఉంచింది. ఇప్పటివరకూ పేపరు-2కు దరఖాస్తు చేసిన భాషా పండితులంతా..పేపర్-3కు మార్చుకోవాలని సూచించింది.తెలుగు/హిందీ/ఇంగ్లీషు, సంస్కృతం తదితర భాషాంశాలు చదివిన వారికి..సంబంధంలేని సబ్జెక్టులపై ఎక్కువ సిలబస్‌ను టెట్‌లో రూపొందించడంపై అభ్యర్థులు ఆందోళన చెందారు. టెట్‌లో అత్యధికంగా భాషకే మార్కులు కేటాయించాలంటూ మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుకు పలువురు విన్నవించిన విషయం విదితమే. అభ్యర్థుల విజ్ఞప్తుల్ని దృష్టిలో ఉంచుకుని భాషాంశాలు చదివిన వారి కోసం టెట్ పేపర్-3ని కొత్తగా ప్రవేశపెట్టారు.దీంతో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లకు-పేపర్ 2, భాషా పండితులకు పేపర్-3 విభాగాల్లో ప్రభుత్వం టెట్ పరీక్షలను నిర్వహించనుంది.

గత టెట్‌లలో తీవ్రంగా నష్టపోయిన భాషా పండిట్లు

ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష)లో భాషా పండిట్లకు ఇతర సబ్జెక్టుల (సోషల్/మ్యాథ్స్/సైన్స్) కంటెంట్లలో అత్యధికంగా మార్కులు కేటాయించడంపై అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారు.ఏపీ ప్రభుత్వం ఇప్పటివరకూ నాలుగుసార్లు టెట్ నిర్వహించినా..అందులో పండిట్లు 50 శాతానికిపైగా అర్హత పొందలేదు. విద్యాహక్కు చట్టం ఆధారంగా టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీకి దరఖాస్తు చేసేలా ప్రభుత్వం నిబంధన విధించింది. తెలుగు/హిందీ తదితర లాంగ్వేజీ పండిట్లుగా శిక్షణ పొందాలంటే.. బీఏ(తెలుగు/తెలుగు), (బీఏ-ఓరియం టల్)/ ఎంఏ (తెలుగు/ హిందీ) చదివిన వారంతా తెలుగు/హిందీ లాంగ్వేజీ పండిట్ల శిక్షణ చేసేందుకు అర్హులు.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఎల్పీసెట్‌లో అర్హత పొందిన వారికి ర్యాంకుల ఆధారంగా భాషా పండిత కళాశాలలలో ఏడాదిపాటు శిక్షణ పొందుతారు.వాస్తవంగా తెలుగు/ హిందీ లాంగ్వేజీ పండిట్లు, స్కూలు అసిస్టెంట్ పోస్టులను వారికే కేటాయించాలి.గత కొంతకాలం నుంచి బీఈడీలో రెండో మెథడాలజీలో తెలుగు/హిందీచేసి.. ఎంఏ (తెలుగు/హిందీ) చదివిన అభ్యర్థులనూ డీఎస్సీలో లాంగ్వేజీ పండిట్స్, స్కూలు అసిస్టెంట్స్ పోస్టులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది.దీంతో ఒక ఆశయంతో తెలుగు/హిందీ శిక్షణ పొందిన భాషా పండిట్లకు అన్యాయం కొనసాగుతోంది.డీఎస్సీలలో ఇలా దొడ్డిదారిన వచ్చిన వారికే ఎక్కువ పోస్టులు దక్కుతున్నాయి.ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ భాషా పండిత శిక్షణార్థులు పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేదు.

భాషాంశాలకు 30 నుంచి 90 మార్కులకు పెంపు..

అభ్యర్థుల విజ్ఞప్తులతో ప్రభుత్వం దిగొచ్చి భాషాంశాలకు 30మార్కుల నుంచి 90 మార్కులకు పెంచింది.తొలుత టెట్‌లోనూ అదే పరిస్థితి నెలకొంది.టెట్ పేపరు-2 150 మార్కులకు ప్రభుత్వం కేటాయించింది.ఇందులో సోషల్ స్టడీస్/లేదా గణితం/సైన్స్-60 మార్కులు, ఇంగ్లీషు-30, సైకాలజీ-30, తెలుగు/హిందీ-30 మార్కులకు విభజించారు. తెలుగు/హిందీ పండిట్లు టెట్ రాయా లంటే.. వారికి తెలుగు/హిందీలో కేవలం 30 మార్కులే కేటాయించారు.సోషల్/మ్యాథ్స్/సైన్స్‌కు అత్యధికంగా 60 మార్కులు(కంటెంట్-42 మార్కులు+మెథడాలజీ-12 మార్కులు) కేటాయించారు.2011 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటివరకూ నాలుగుసార్లు టెట్‌ను ప్రభుత్వం నిర్వహించింది.ఇతర సబ్జెక్టులకు టెట్‌లో ఎక్కువగా కేటాయించడంపై లాంగ్వేజీ పండిట్లు అర్హత సాధించలేక పోతున్నారు. గత 2012 డీఎస్సీకి వారంతా దూరమయ్యారు.150 మార్కులకు నిర్వహించే టెట్‌లో ఓసీ-90, బీసీ-75, ఎస్సీ/ఎస్టీ-60మార్కులు సాధిస్తేనే అర్హతగా పరిగణిస్తారు.తమకు సంబంధంలేని సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులు సాధించలేకపోతున్నామని భాషా పండితులు వాపోతున్నారు.దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి కార్యాచరణ రూపొందించారు.ప్రభుత్వానికి వారి డిమాండ్లను విన్నవించారు.ప్రభుత్వం స్పందించి భాషా పండితుల కోసం టెట్ పేపర్-3ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.ఇందులో సైకాలజీ-30, ఇంగ్లీషు-30, సంబంధిత భాషాంశాల సబ్జెక్టుకు-90 మార్కులు కేటాయించారు.

2014 టెట్ కమ్ టీఆర్టీలో సోషల్ అభ్యర్థులదే హవా..

2014లో టెట్ కమ్ టీఆర్టీని ఉమ్మడిగా కలిపి ప్రభుత్వం 200 మార్కులకు నిర్వహించింది.ఇందులో టెట్ సబ్జెక్టుల్లో భాగంగా సోషల్/మ్యాథ్స్/సైన్స్‌కు 60మార్కులు కేటాయించారు.భాషా పండితుల సబ్జెక్టులకు అతి తక్కువ మార్కులు కేటాయించి..వారికి సంబంధంలేని సబ్జెక్టులకు ఎక్కువ మార్కులు పెట్టారు.దీంతో తెలుగు పోస్టులను సోషల్/మ్యాథ్స్/సైన్స్‌తోపాటు తెలుగు మెథడాలజీతో బీఈడీ చేసిన అభ్యర్థులే అత్యధికంగా కైవసం చేసుకున్నారు.2014 డీఎస్సీలో తెలుగుపై అవగాహన లేని..బీఈడీ(సోషల్) అభ్యర్థులే ఎక్కువగా తెలుగు టీచర్లుగా మారిపోయారు.

టెట్ షెడ్యూలు పొడిగింపు..?

భాషాంశాల సబ్జెక్టులకు ప్రత్యేకంగా టెట్ పేపర్-3 ఏర్పాటు చేయడంతో పరీక్ష షెడ్యూలు మరింత పెరిగే అవకాశముంది.భాషా పండితులు ఇప్పటివరకూ ప్రభుత్వం జారీచేసిన సిలబస్ ఆధారంగా ప్రిపరేషన్ కొనసాగించారు. కొత్తగా మార్చిన సిలబస్‌ను చదవాలంటే కనీసం రెండు నెలలు సమయం పడుతుంది.టెట్ పరీక్ష ఫీజు చెల్లింపునకు ఈ నెల 20, ఆన్‌లైన్లో దరఖాస్తు చేసేందుకుగాను ఈ నెల 22 వరకూ గడువు విధించారు.అటు డీఎడ్, బీఈడీ, లాంగ్వేజీ పండిట్లు చివరి ఏడాది చదువుతున్న వారికీ ప్రభుత్వం టెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో టెట్ పరీక్ష ఫీజు, పరీక్షల షెడ్యూలు వాయిదా పడే అవకాశముంది.



డీహెచ్‌పీఎస్ డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ప్రచురించిన 2018 డైరీని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆవిష్కరించారు. దాసరిభవన్‌లో శనివారం డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి విల్సన్ మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం పోరాటాలు సాగించాల్సిన అవసరాన్ని ఈ డైరీ ద్వారా గుర్తించి చైతన్యవంతులు కావాలన్నారు. డైరీలో సామాజిక విప్లవకారులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కార్ల్‌మార్క్స్, మహాత్మా జ్యోతిరావ్‌పూలే జీవితాలను పున్నయ్య కమిషన్ వివరాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలను కార్యకర్తలకు తెలియచేసే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వి విజయలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా ఉద్యమ నేత సూర్యకాంతం కన్నుమూత



విశాలాంధ్ర, తణుకు : ప్రముఖ సంఘ సేవకురాలు, మహిళా ఉద్యమ నేత భూపతిరాజు సూర్యకాంతం (81) తణుకులో ఆమె స్వగృహంలో ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు.ఆమె దివంగత సీపీఐ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు భూపతిరాజు సుబ్బరాజు సతీమణి.

సూర్యాకాంతం జీవిత విశేషాలు

1931లో భీమవరం తాలూకా యండగండిలో సూర్య కాంతం జన్మించారు. బాల్యం నుంచే ప్రజా ఉద్యమాల పట్ల ఆకర్షితులయ్యారు. ప్రజానాట్య మండలిలో సినీ నటులు మిక్కిలినేని లాంటి వారితో కలిసి మా భూమి, కష్టజీవి వంటి సామాజిక చైతన్యం కలిగించే కళా రూపాలు, బుర్రకథలలో పాత్ర ధారులయ్యారు. వివాహా నంతరం మహిళా ఉద్యమంలో, కమ్యూనిస్టు పార్టీలో కార్యకలాపాలు సాగించారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శిగా జిల్లాలో తాలూకాలో అనేక సమస్యలపై సాగిన ఉద్యమాలకు నాయకత్వం వహించారు. రాష్ట్రం లోనే తొలిసారిగా మహిళా పొదుపు సంఘాలను సామా జిక ఉద్యమ నేత డివివిఎస్ వర్మతో కలిసి ప్రారంభిం చారు. అక్షర మహిళ కార్యక్రమాన్ని చేపట్టి ఈ పొదుపు సంఘాలలోని మహిళలందరినీ అక్షరాస్యు లను చేశారు. మద్య నియంత్రణకు కోసం పలుసార్లు ఉద్యమాలు సాగించారు.

ప్రముఖుల నివాళి

మాజీ ఎమ్మెల్యే వంక సత్యనారాయణ, మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు వంక నాగమణి, మద్య నియంత్రణ వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సంకు మనోరామ, సామాజిక ఉద్యమ నేత డివివిఎస్ వర్మ, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నెక్కంటి సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి డేగాప్రభాకర్, తణుకు ఏరియా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, గార ప్రసాద్, సీనియర్ జర్నలిస్టు బి.బుచ్చిబాబు, వైసీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వంక రవీంద్రనాద్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మం ఎన్. దొరబాబు, పీకేరు శ్రీను, గ్రామ సర్పంచ్ జె.వెంకటేశ్వరరావు, వి.వెంకట్రాజు, డాక్టర్ హుస్సేన్, కె.సత్యనారాయణ రాజు, విఎస్ఎన్ రాజు, రఘు, వివిఎస్ సత్యనారాయణ రాజు, జి.ఉదయ భాస్కర్, సిపిఐ నాయకులు డివిఎస్ హనుమంతరావు, పంతం నాగేశ్వరరావు, ఈర్పిన పూర్ణచంద్రరావు, రెడ్డి రామకృష్ణ, మిదతాని దుర్గారావు, మిదతాని కృష్ణ, పెనుమర్తి రంగారావు, ఈద రామకృష్ణ, పి.రవిబాబు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నెక్కంటి జగదాంబ సూర్యకాంతం భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అన్నదాతల జీవితాల్లో శుభక్రాంతి సంక్రాంతి

సీఎం చంద్రబాబు పండగ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సంక్రాంతి శోభతో తెలుగు లోగిళ్లు కళకళలాడుతున్నాయని, భోగి పండగ కంటే ఉత్సాహంగా సంక్రాంతి పండగ చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. దేశ విదేశాల్లోని తెలుగువారికి ఆయన మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే శుభ సందర్భమే సంక్రాంతి అని ఆయన అభివర్ణించారు. అన్నదాతల జీవితాల్లో సంక్రాంతి శుభక్రాంతి తేవాలని ఆకాంక్షించారు. వ్యవసాయంతో రైతుకు రెట్టింపు లాభాలు రావాలన్న విధానంతో తాము పనిచేస్తున్నట్లు చెపాపరు. సంక్రాంతి తెలుగు వారికి ఇది పెద్ద పండగ అని, ప్రత్యేకించి పంటలు ఇంటికి చేరిన వేళ ప్రకృతికి, ఇష్టదైవాలైన ఇలవేల్పులకు కర్షకులు కృతజ్ఞతలు తెలిపే పండుగ అన్నారు. దేశంలో వ్యవసాయరంగం ఎప్పుడూ ఒక సవాలేనని, అలాంటి రంగంలో సైతం మన రాష్ట్రం రెండంకెల వృద్ధి రేటును నమోదుచేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో మరే రాష్ట్రానికి సాధ్యం కానంతగా వ్యవసాయ రంగంలో 25.6 శాతం శాతం వృద్ధి సాధించిందన్నారు. పదిహేనేళ్ల పాటు పాటు 15 శాతం వృద్ధి రేటు సాధించాలన్నదే లక్ష్యమని, 80 శాతం ప్రజా సంతృప్తే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

భోగి మంటలకు దూరం.. బోగీలకే పరిమితం..!

- మంచుతో గంటల కొద్దీ రైళ్ల ఆలస్యం
- ఇంకా సొంత ఊళ్లకు చేరని వైనం
- వణికించే చలిలో ప్రయాణికుల ఇక్కట్లు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దట్టమైన మంచు కారణంగా అనేక రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఉత్తరాదితోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో కొద్ది రోజులుగా మంచు విపరీతంగా కురుస్తుండడంతో పలు దూర ప్రాంత రైళ్లు 8 గంటల నుంచి 12 గంటలపాటు ఆలస్యంగా గమ్యం చేరుతున్నాయి. దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో సంక్రాంతి సందర్భంగా బంధుమిత్రులతో కలసి ఆనందంగా గడిపేందుకు సొంత ఊళ్లకు రావడం ఆనవాయితీ. అయితే పొగమంచు కప్పేయడంవల్ల రైళ్లను నెమ్మదిగా నడపుతుండడంతో పండగ కాస్తా రైళ్లలోనే గడచిపోతోంది. భోగీ మంటలు వేసి చలికాచుకోవడం.. సంప్రదాయరీతిలో తలారా స్నానాలు చేసి కొత్త బట్టలు కట్టుకోవాల్సిన వారందరూ పండగ నాడు రైళ్లలో స్నానాలులేక పాతబట్టలతోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి. ముఖ్యంగా జమ్ము, చండీఘడ్, ఢిల్లీ, పాట్నా, గౌహతి, న్యూజలపాయ్‌గురి, లక్నో, హౌరా వంటి ప్రాంతాల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు నడిచే రైళ్లు ఎప్పటికి గమ్యం చేరుతాయో తెలియడంలేదు. ఉదాహరణకు చెన్నై సెంట్రల్ - చాప్రా గంగాకావేరి ఎక్స్‌ప్రెస్ శనివారం అర్ధరాత్రి విజయవాడ రావాల్సి ఉండగా ఈ రైలు చెన్నైలోనే రాత్రి 11.20కి బయలుదేరి ఆదివారం ఉదయం విజయవాడ చేరుకుంది. అలాగే శబరిమల యాత్రికుల కోసం నిర్దేశించిన విశాఖపట్నం-కొల్లాం ప్రత్యేక రైలు శనివారం రాత్రి 11 గంటలకు బయలుదేరవలసి ఉంది. అయితే ర్యాక్ ఆలస్యం కావడంతో దీని వేళలు మార్పు చేసి ఆదివారం ఉదయం 10.15 గంటలకు నడిపారు. భోగీ రోజు ఉదయం విజయవాడ చేరుకోవచ్చని ఈ రైలుకు రిజర్వేషన్ చేయించుకున్నవారు పండగను విశాఖ రైల్వేస్టేషన్‌లో, రైలులో చేసుకోవాల్సి వచ్చింది. అలాగే కొల్లాం-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు కొల్లాంలో ఉదయం 9.30 గంటలకు బయలుదేరాల్సి ఉండగా సాయంత్రం 5 గంటలకు మార్పు చేసారు. దీంతో ఈ రైలు కాకినాడకు 9 గంటల ఆలస్యంగా చేరుకుంది. ఇంకా తిరుక్కురల్ ఎక్స్‌ప్రెస్, కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా-చెన్నై మెయిల్, చెన్నై-హౌరా కోరమండల్.. ఇలా అనేక రైళ్లు అనేక గంటలు ఆలస్యంతో నడుస్తున్నాయి. ర్యాక్‌ల కొరత కారణంగా గమ్యం చేరిన కొన్ని రైళ్లను ప్లాట్‌ఫారంపైనే తనిఖీలుచేసి, నీటిని నింపి వేరొక రైలుగా నడుపుతున్నారు. అయితే చాలా రైళ్లు ఆలస్యంగా గమ్యానికి చేరుకోవడంతో వాటి నిర్వహణానంతరం బయలుదేరడంలోనూ జాప్యం నెలకొంటోంది. ఇదిలా ఉండగా తాము ఎక్కాల్సిన రైలు కోసం రైల్వేస్టేషన్లకు చేరుకున్న ప్రయాణీకులు అవి ఎప్పుడొస్తాయో తెలియక ప్లాట్‌ఫారాలపై ఎదురు చూడాల్సిన పరిస్థితి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, రోగగ్రస్తులతో ప్రయాణించేవారి బాధలు వర్ణనాతీతం. రాత్రివేళల్లో ప్రయాణం మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పలువురు వాపోతున్నారు. కొన్ని స్టేషన్లలో తినేందుకు సరైన ఆహారం కూడా లభించడంలేదంటున్నారు. సాయంత్రం వేళల్లో రావాల్సిన రైళ్లు తెల్లవారుజామున వస్తుండడంతో రాత్రంతా స్టేషన్లలోనే గడపాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. వణికించే చలిని తట్టుకునేందుకు స్వెటర్లు, శాలువాలను ఆశ్రయిస్తున్నప్పటికీ ఫలితం ఉండడంలేదంటున్నారు. స్థానిక టీవీ ఛానళ్లతోపాటు రైల్వేస్టేషన్లలోని టీవీల్లో ఆయా రైళ్ల రాకపోకలకు సంబంధించిన సమాచారంలో తొలుత రైలు సకాలంలోనే వస్తున్నట్లు పేర్కొంటున్నారని, తీరా సమయం సమీపిస్తున్నప్పుడు పదేసి నిముషాలు పొడిగిస్తూ గంటల కొద్దీ సమయం వేచి ఉండే విధంగా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రిజర్వేషన్ ప్రయాణీకులకు కూడా ఆయా రైళ్లు ఎన్నిగంటలకు బయలుదేరుతాయో సంక్షిప్త సందేశాల ద్వారా చెబుతున్నారే కానీ ఆలస్యానికి సంబంధించిన సమాచారాన్ని ఇవ్వడంలేదంటున్నారు.

ఆరోగ్య భద్రతకు భరోసా..

- మహిళల కోసం విస్తృత వైద్య సేవలు....
- ఆరోగ్య వ్యవస్థ పటిష్టతకు సర్కార్ కృషి...

విశాలాంధ్ర అమరావతి : పేదల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ప్రధానంగా మహిళల ఆరోగ్యం కోసం పలు పథకాలు అమలు చేస్తోంది. పభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన ప్రతి తల్లి బిడ్డను ఇంటికి చేర్చే తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ పథకం రెండేళ్లు పూర్తి చేసుకొని మూడో ఏడాదిలోకి అడుగిడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 279 తల్లి బిడ్డ వాహనాలు ఉన్నాయి. 2017 డిసెంబర్ 15 నాటికి ఈ వాహనాల ద్వారా 4,60,182 మంది బాలింతలను సురక్షితంగా వారి నివాసాలుకు చేర్చారు. విజయవాడ కేంద్రంగా 102 కాల్ సెంటర్ ద్వారా తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ రవాణా సేవలు అందుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా 96.02 శాతం మంది బాలింతలను వారి ఇళ్లకు చేర్చిన తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ మొదటి స్థానంలో నిలవగా, 59.06 మంది బాలింతలను ఇంటికి చేర్చి శ్రీకాకుళం చివరి స్థానంలో నిలిచింది.

ఎన్టీఆర్ బేబీ కిట్...

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన మహిళకు ఓ ఎన్టీఆర్ బేబీ కిట్ ఉచితంగా అందిస్తారు. అందులో ఓ బేబీ టవల్,బేబీ బెడ్ జిప్ బ్యాగ్,చేతులు శుభ్రపరుచుకునే ద్రవ పదార్థం, దోమతెర, కిట్ బ్యాగ్ మొత్తం 5 వస్తువులు ఈ కిట్లో అందిస్తున్నారు. శిశువుకు ఏ విధమైన బ్యాక్టీరియా దరి చేరకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా ఈ కిట్ అందిస్తోంది. ప్రాణాంతకమైన మలేరియా ,డెంగ్యూ,మెదడు వాపు,వంటి వ్యాధులు నుంచి కాపాడేం దుకు దోమతెరలు అందిస్తోంది. గతేడాది నవంబర్ వరకు 3,67,463 మందికి ఈ కిట్లు అందచేశారు.

మహిళల కోసం మాస్టర్ హెల్త్ చెకప్

నిత్యం ఎన్నో కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న గృహిణుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఇందుకోసం మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమం ప్రారంభించింది. నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్,మధుమేహం, హైపర్ టెన్షన్, విజన్, హార్మోన్, అస్తవ్యస్థలు వంటి 7 ప్రధాన వ్యాధులు త్వరగా కనుగొనడం కోసం పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఎన్. సి. డి (అంటూ వ్యాధులు కానీ) పరీక్షల కోసం 12 వేల మంది ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు. అనుమానిత కేసులను రోగ నిర్ధారణ, చికిత్సల కోసం రాష్ట్రంలోని సంబంధిత 57 ఆసుపత్రులకు పంపుతారు. అక్టోబర్ వరకు 8,92,679 మంది మహిళలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. వారిలో 30 మంది కేన్సర్ బారిన పడినట్లు నిర్ధారించారు.

ఎన్టీఆర్ వైద్య పరీక్షలు

ఎన్టీఆర్ వైద్య పరీక్షలు ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో తక్కు ఖర్చులో వైద్య పరీక్షల సేవలు అందచేస్తున్నారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న పరీక్షలకు అదనంగా ఇక్కడ వైద్య పరీక్షలు నిర్వహించే ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 7 మదర్ ల్యాబ్ లతో పాటు 98 ప్రాసెసింగ్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. అక్టోబర్ వరకు 2,65,25,264 మందికి పరీక్షలు చేసి 88,78,632 మందికి సేవలు అందించారు.

చంద్రన్న సంచార వైద్య చికిత్సలు

ఆరోగ్య సౌకర్యాలు లేని మారుమూల ప్రాంతాలలో చంద్రన్న సంచార చికిత్స వాహనాల ద్వారా ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. 5 కిలో మీటర్ల పరిధిలో ఆరోగ్య సౌకర్యం లేని 12 వేల ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాలకు ప్రతినెలా నిర్దారించిన రోజున సంచార వైద్య బృందాలు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఇప్పటి వరకు 2,44,843 వైద్య శిబిరాలు నిర్వహించగా,70,41,319 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. 23,03,866 వైద్య పరీక్షలు చేసి 50,23,292 ఔషధాలను అందచేశారు.

ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలు

నగర మురికివాడల్లో నివసించే వారి ఆరోగ్యం కోసం ఈ కార్యక్రమం ప్రారంభించారు. 30 డయాగ్నస్టిక్ పరీక్షలు, మందుల సరఫరా సేవలు అందిస్తున్నారు. 365 రోజులు అందించే ఈ సేవల ద్వారా 28,48,092 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందించాలన్నదే పథకం లక్ష్యం.



పట్టణాల అభివృద్ధికి 'స్టార్ రేటింగ్'

- పలు ప్రధాన అంశాలపై పర్యవేక్షణ
- పోటీతత్వం పెంచటమే లక్ష్యం
- రేటింగ్ పేరిట సౌకర్యాల కల్పన
- సర్కార్ సరికొత్త ఆలోచన

విశాలాంధ్ర అమరావతి : పట్టణాల్లో వార్డుల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. వార్డుల మధ్య పోటీతత్వం పెంపొందించడం ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అవకాశం మరింత మెరుగుపడుతుందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆలోచన చేస్తోంది. పంచాయితీరాజ్ . గ్రామీణాభివృద్ధి శాఖలో ఇప్పటికే టెన్ స్టార్ రేటింగ్ కార్యక్రమం అమలు జరుగుతుంది. ఇప్పుడు పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలోనూ వార్డుల వారీగా మార్గదర్శకాలు రూపొందించి విడుదల చేశారు. దీని ప్రకారం పట్టణాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించటమే లక్ష్యంగా స్టార్ రేటింగ్ ఇచ్చే కార్యక్రమం ప్రారంభించేందుకు సిద్ధమైంది.

రేటింగ్ ఇలా..

స్టార్ రేటింగ్ ఇచ్చేందుకు నిరంతర పర్యవేక్షణ కోసం ఓ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ముందుగా చెత్త సేకరణను పర్యవేక్షణ బృందాలు వార్డుల వారీగా పరిశీలిస్తారు. సేకరణ ప్రక్రియ సమర్థవంతంగా జరుగుతుందా లేదా అనేది ఈ బృందం పరిశీలిస్తోంది. అలాగే వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు ఉన్నాయా లేవా అనే విషయాలను పరిశీలిస్తారు. వీధివీధికి కాలువల నిర్మాణంతో మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు, రహదారుల నిర్మాణం సాగుతున్న విధానాన్ని పర్యవేక్షిస్తారు. ప్రతి వీధిలో ఎల్ఈడీ దీపాల ఏర్పాటుపై సమగ్ర పరిశీలన, ప్రస్తుతం అమలవుతున్న విధానం, అన్నింటినీ పరిశీలన చేసి నివేదిక రూపొందిస్తారు. అమృత్ పథకం అమలు తీరు, ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉందా లేదా అన్నది ప్రామాణికంగా తీసుకొని నేటి వసతి కల్పనని అంచనా వేస్తారు. పురపాలక పాఠశాలలో పని తీరుపై విశ్లేషణ, బడి మానేసిన విద్యార్థుల పట్ల తిరిగి బడిలో చేర్పించే ప్రక్రియ పట్ల శ్రద్ధ కనబరుస్తున్న తీరు పర్యవేక్షిస్తారు. ఆరోగ్యం, పౌష్టికాహారం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, గర్భిణులు, బాలింతలకి ఆరోగ్య సంరక్షణ వంటి విషయాలను పరిగణనలోకి తీసుకుంటారు. అయితే ప్రధానంగా ప్రతి కుటుంబానికి నెలకు 10 వేల రూపాయల ఆదాయం సంపాదించేలా అమలు చేస్తున్న కార్యక్రమాలను ఈ బృందం పరిశీలిస్తోంది. ఇన్ని అంశాలను పరిశీలించిన అనంతరం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ముందంజలో ఉన్న వాటికి స్టార్ రేటింగ్ కేటాయిస్తారు. అయితే ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో పురపాలకలలో జరుగుతున్న అభివృద్ధి పనులను సచివాలయంలో పర్యవేక్షిస్తున్నారు.

మార్కులు ఇలా..

ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణకు 15, ప్రతినెలా 10 వేల రూపాయలు ఆదాయం పొందుతున్న కుటుంబాల విషయంలో 15, వ్యక్తిగత మరుగుదొడ్లకి 10, ఎల్ఈడి వీధి దీపాలకు 10, కాలువలకు 10, రహదారులకు 10, కుళాయి కనెక్షన్లకి 10, విద్య విషయంలో 10 , ఆరోగ్యానికి 10, ఇలా ప్రధానంగా తొమ్మిది అంశాలను పరిగణనలోకి తీసుకొని రేటింగ్ కేటాయించడం జరుగుతుంది. దీంతో అభివృద్ధి పరుగులు తీయటమే కాక మెరుగైన వసతుల కల్పన అత్యంత వేగంగా జరుగుతుందని శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

చాసో కవిత్వం- సార్వజనీనత

-శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం

"కవులు కనిపించని - లేక - గుర్తింపులేని శాసన కర్తలు" అన్నాడు పి.బి.షెల్లీ "ఎ డిఫెన్స్ ఆఫ్ పొయిట్రీ" అనే తన ప్రసిద్ధ వ్యాసంలో.

అసలు శాసనకర్త (లెజిస్లేటర్) ఏం చేస్తాడు? సామాన్య జనత నేటి గుఱించి మాత్రమే ఆలోచిస్తూ ఉంటే చిత్తశుద్ధి ఉన్న శాసనకర్త అన్నవాడు నిన్నలోని కష్టనష్టాల అనుభవాల ఆధారాల మీద, నేడు నడుస్తున్న సాంఘిక వ్యావహారిక ధోరణులలో కనిపించే కొన్ని వక్రమార్గాల సాక్ష్యాల మీద మనస్సు లగ్నం చేసి రేపు గుఱించి ఆలోచిస్తాడు. ప్రజలకు అందునా కష్ట జీవులకు, సగటు మనుషులకు, బాధా సర్పదష్టులకు, దగా పడుతున్న తమ్ముళ్లకు, దీనులకు, మ్లానులకు బంగారు భవిష్యత్తు కల్పన చేసే జిజ్ఞాసతో, సృజనాత్మక భావ వీచికా జాల పరంపరతో మహాభ్యుదయదాయకమైన చట్టాలను దొరతనంతో చేయించటానికి త్రికరణశుద్ధిగా పాటుపడుతూంటాడు. ఆ దిశగా ఆలోచిస్తూంటాడు; గింజుకుంటాడు; ఆవేశపడుతుంటాడు. ఆశయ సిద్ధి కోసం ఖేదపడతాడు; అది సాధిస్తే మోదపడతాడు; అనంతంగా అనుభూతిస్తాడు.

ఈ రకపు మానసికమైన, మేథో బాధ్యతాయుతమైన వ్యావృత్తితో నిజమైన శాసనకర్త అనేవాడు శాసనసభా స్థలిలో ఆరాటపూరిత ప్రసంగ వాదన పోరాటాలు చేస్తూంటే విశ్వశ్రేయోకాంక్షాకారుడైన కవిగాని, రచయితగాని తన 'రచనలు' అనే అక్షరాల కోలాహల స్థలిలో అదే ఉదాత్త వ్యాపకంలో మునిగిపోయే ఒక మహా 'అక్షర ముని'గా, ఒక ఆదర్శ వాఙ్మయాశ్రమస్థ ప్రజార్షిగా దీక్షాబద్ధుడై ఉంటాడు. అందుకే అన్నారు 'నానృషిః కురుతే కావ్యమ్ (ఋషి కానివాడు కావ్యం రాయలేడు)' అని.

ఆ రాసేది కథైనా కవిత్వమైనా జన జాగృతికి, ప్రజాహితానికి దోహదం చేయాలి. అందులోనే ఉంది ఉత్కంఠభరిత ఆనందం. అసలు ఒక్క కవిత్వము - రచనము అనే అంశానికే కాదు. ఇది మనిషి జీవితానికి గూడా వర్తిస్తుంది. అందుకే అన్నది ఆంగ్ల రచయిత్రి Helen Adams keller 'జీవితం ఒక ఉత్కంఠభరిత వ్యాపకం. అది పరులకోసం సాగిస్తే మఱింత ఉత్కంఠ భరితం' (Life is an exciting business and most exciting when it is lived for others) అని. మఱి తన ఆంధ్ర శబ్ద చింతామణి గ్రంథంలో నన్నయ గారు అన్నమాట 'విశ్వశ్రేయః కావ్యమ్' అని ఉండనే ఉంది ఎటూ. కెల్లర్ చెప్పిన 'ఉత్కంఠ'గాని, నన్నయగారు అన్న విశ్వశ్రేయస్సు గాని కవి యొక్క సాహిత్య జీవితానికి పరమార్థాలు. ఈ రెండు లక్షణాలకూ అద్దంపట్టిన కన పడని శాసనకర్తల్లాంటి కవులలో చాసో ఒకరు. " Fine arts are those which must please and may serve and useful arts are those which must serve and may please" (లలిత కళలకు ఆనందదాయకత ముఖ్యం. అభ్యున్నతి ద్వితీయం. ప్రయోజన కళలకు అభ్యున్నతి ముఖ్యం, ఆనందదాయకత ద్వితీయం) అన్నాడు రెండెల్ మహాశయుడు (డాక్టర్ పి.వి. చలపతి రావు రాసిన 'సాహిత్య విమర్శాదర్శనము చూడుడు').

చాసో కథలు, కవితలు ప్రయోజక కళ, లలిత కళల సమ్మేళనం అనవచ్చు సాహితీ కళా విభాగంలో. కానీ చాసో హృదయాంతరాళంలో కనిపించేది మాత్రం ప్రజాభ్యుదయ దృష్టే.

"అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః" (అంతులేని కావ్య ప్రపంచానికి కవియే బ్రహ్మ) అన్నాడు ఆనందవర్ధనుడు. దీనికి వ్యాఖ్యానప్రాయంగా చెప్పుకోవా లంటే కవి అయినవాడు కవితాసృష్టి కర్తే కాకుండా ద్రష్ట కూడా. అంటే భవిష్యత్ యొక్క బాగోగులను, మంచి చెడులను, కష్ట నష్టాలను గూడా క్రాంత దృష్టితో చూసి అంచనా వేస్తాడు; వర్ణనా నిపుణుడై ఉంటాడు; ప్రతిభావంతుడూ అయి ఉంటాడు. ఈ లక్షణాలన్నీ చాసో వంటి సాహితీస్రష్టలకు సల్లక్షణంగా అమరి ఉన్నాయి.

చాసో కవిత్వం ఆర్ద్రతకు అద్దం, ఆలోచనకు దిక్సూచి, కవితా శిల్పానికి కాణాచి.

అసలు కవిత్వం అంటే ఏమిటి?

ప్రసిద్ధ ఆంగ్ల కవి విలియం వర్డ్స్‌వర్త్ మాటలో "Emotion recollected in tranquility is poetry (ప్రశాంత సమాధి స్థితిలో కలిగే భావావేశమే కవిత్వం)"

4 విశాలాంధ్ర సోమవారం 15, జనవరి 2018

సాహితి

చాసో గారు కూడా వారి ఇంటి ముందు గదిలో ఒక్కరే కూర్చొని (ఒక మౌనిలాగా) బయటకు కనిపించని చైతన్యంతో ఒక అంతర్ముఖీనుడి లక్షణాలతో ఉండే ఒక అక్షర తపస్విలాగా ఆలోచన, ఊహా తరంగాలలో తేలి పోతూ కనిపించేవారు. ఇది మేము వాళ్ల ఇంట్లో అద్దె కున్న కొన్ని సంవత్సరాల కాలంలో పలుసార్లు గమనిం చాను. అఫ్‌కోర్స్ అప్పటికే వారు కవితారచన మానుకొని కథారచనలో ఉన్నారు. కథైనా, కవిత్వమైనా అంతర్ముఖీ నుడైన చాసో తన అంతరంగ ఆలోచనా మథిత ఊహా నిక్షేపాలలోనే ఉండి అనర్ఘ రచనలను వెలారుస్తూ ఉండే వారని, వారిది ఎప్పుడూ ఒక రచనా తపస్సు అని ఏ రచనను చూసినా ఇట్టే అర్థమయి పోతుంది.

కవిత్వంఅనేసరికి Emotion (భావావేశం) అనే కీలక భావపదాన్నే దాదాపు ప్రతి పాశ్చాత్యకవి పండితుడూ వాడాడు. "Poetry is the Language of imagination and emotions (కల్పన, భావోద్వేగములు కలసి మాట్లాడేభాషే కవిత్వం) అన్నాడు ప్రసిద్ధ సాహితీ విమర్శ కుడు, వ్యాస రచయిత అయిన విలియమ్ హ్యాజ్‌లిట్. "What is poetry but the thought and words in which emotion spontaneously embodies itself (ఆలోచన, భాషలతో - వాటి మధ్య - సద్యోభావావేశం ప్రస్ఫుటంగా వచ్చి నిలబడటమే - లేక - సమ్మేళనం కావటమే కవిత్వం అంటే) అన్నాడు ప్రసిద్ధ బహు విషయ పరిజ్ఞాని జాన్ స్టుఆర్ట్ మిల్.

ఈ భావావేశం అనేదే పాతికేళ్ళ ప్రాయంలో చాసో చేత కవితలు రాయించింది. ఆ భావావేశ ప్రకటనాత్మక రచనకు చాసోరాసిన 'ధర్మక్షేత్రం', 'కాందిశీకుడు', 'వంతెనపైన', 'బ్రతుకు' మొదలైన కవితలు చక్కని చిక్కని తార్కాణాలు. అవి మళ్లీ మళ్లీ చదివించే మంచి కవితలు. చాసోకవితారచనాప్రక్రియకు నిరాసక్తుడైపోవటం అప్పటి రోజుల్లో మంచిఊపులోఉన్న అభ్యుదయకవితా రంగానికి ఒక ఎస్సెట్ (ప్రధానఆస్తి) డెఫిసిట్ (తరుగుదల) అయి పోయింది అనే చెప్పాలి.

చాసో ఉద్దేశించిన కవిత్వ ప్రయోజనం

రచనకు కొన్ని ప్రయోజనాలుంటాయి.

"కావ్యం యశస్సేఽర్థకృతే వ్యవహార విదే శివేత రక్షతయే
సద్యః పర నిర్వృతయే కాంతా సమ్మిత తయోపదేశ యుజే" అన్నాడు మమ్మటుడు తన 'కావ్యప్రకాశం' అనే సాహిత్య విమర్శా గ్రంథంలో.

కావ్య రచన ద్వారా రచయితకు ఈ క్రింది ఆరు ప్రయోజనాలు (పై శ్లోకంలో చెప్పినవి) సిద్ధిస్తాయి -

1. ఖ్యాతి
2. అర్థము (ఆర్థికపరంగానో, వస్తుపరంగానో కొంత లభ్యత)
3. వ్యవహార జ్ఞానం
4. అమంగళ పరిహారం (శుభప్రాప్తి)
5. సద్యఃపర నిర్వృతి (పరమానందం). ఇది కృతికర్తకు, పాఠకులకు కూడా.
6. ఉపదేశం (సంఘానికి ఒకశ్రేయోదాయక మార్గనిర్దేశం).


తిక్కన సోమయాజి ప్రజలకు పరమానందాన్ని ఇవ్వటమే కవిత్వపు ప్రధాన ప్రయోజనంగా భావించాడు.

"కావున భారతామృతముగ గర్ణపుటంబుల నారంగ్రోలి యాం
ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్వవతేయ సంస్కృతి
శ్రీ విభవాస్పదం బయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షా విధినొంది పద్యముల గద్యములన్ రచయిం
చెదన్ గృతుల్" అన్నాడు విరాట పర్వ ప్రథమాశ్వాసంలో.

అయితే లావెల్ అనే పాశ్చాత్యపండితుడు "ఏదో ఒక విధాన తత్త్వ బోధ చేయని కావ్యమును నేను మన్నింప జాలను" అంటూ ప్రమోదాత్మకత కంటే ప్రభోదాత్మకతే ప్రధాన ప్రయోజనంగా ఉద్దేశించాడు.

చాసో గూడా ప్రభోదాత్మకతే తన కవిత యొక్క ప్రధాన ప్రయోజనంగా, లక్ష్యంగాభావించాడు - కాక పోతే తనది పరోక్ష ప్రభోధపద్ధతి. "పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం పైపైకి" అన్న శ్రీశ్రీ రచనపు పంథా కాదు. శ్రీశ్రీ రాసిన కొన్ని ఇలాంటి కవితల కంటే చాసో లాంటివాళ్ళు రాసిన "అంతరార్థ ధ్వని" పరి పుష్ట కవితలలో కళాత్మకత నేరుగా ప్రత్యక్షంగా కనిపిస్తుంది. శ్రీశ్రీ కూడా చాలా కవితలు పరోక్ష సందేశాత్మక ధ్వని శిల్పంతో రాశాడు కనుకనే అవి కూడా విశ్వనాథ లాంటి సంప్రదాయ కవుల మన్ననలందుకున్నాయి.

ఇకపోతే మమ్మటుడు చెప్పిన ఆరు రకాల కావ్య



(చాసో 103 పుట్టినరోజు, చాసో స్ఫూర్తి 23వ పురస్కార సభ 17-01-2018 జరగబోతున్న సందర్భంగా)

ప్రయోజనాలనూ చాసో కూడా అందుకున్నారు - 1940 దశకంలో కొన్ని పత్రికలలో ప్రచురితమైన కవితల ద్వారాను, ఆ తరువాత ఆకాశవాణికి చేసిన కథా రచనల మూలంగా కథా రచయితగా జీవితాంతం వఱకు. కానీ 'ప్రజాభ్యుదయం కోసం మాత్రమే కవిత్వంగానీ, కథగానీ' అని త్రికరణ శుద్ధిగా ఆచరించిన సాహితీ మూర్తి చాసో.

చాసోలో కవిత్వపు విలువలు, వస్తువులు

'అసలుకవిత్వం అంటే ఏమిటి?, దాని లక్షణం అనే దాని గుఱించి ఇంతక ముందే మనం చెప్పుకున్నట్టు ఏమి చెప్పినా - కనీసం ఒక్క వాక్యం చెప్పినా - కళాత్మకంగా (ఆర్టిస్టిక్)గా చెప్పటమే కవిత్వం అని, విలియం హ్యాజ్‌లిట్ మాటలలో కల్పన, భావోద్వేగములు కలిసి మాట్లాడే భాషే కవిత్వమనీను కదా!

'మా అమ్మకు నామీద ఉన్న ప్రేమ చాలా ఎక్కువ' అన్నామనుకోండి. ఇది మామూలుగా అందఱూ చెప్పే అనుభవపూర్వక, అనుభూతి వ్యక్తీకరణ వాక్యం. అదే జాషువా లాంటి ప్రతిభావంతుడైన కవి

"మా తల్లి కడుపులో మసలు ప్రేముడి చింది
జలధులై యిలమీద నిలచెనేమో!" అంటాడు.

అమ్మ కడుపులో నుంచి ప్రేమ 'చిందటం' అంటే కేవలం ఒక బొట్టుపైకి లేవటమో, ప్రక్కకు కారటమో అని అర్థం. అలా చిందిన ప్రేమ తనకు ఎంత కమ్మగా ఉంది, ఎంతో విశాలమైనది అనే అనుభూతి కలిగించిందే - మఱి ఒక బొట్టే అంత బృహత్తరంగా ఉంటే ఇంక అమ్మ కడుపులోని ప్రేమ ఈ ప్రపంచంలోని సముద్రాలన్నీ కలిస్తే ఎంత చల్లగా, ఎంత కొలవలేని పరిమాణంలో ఉంటుందో పాఠకుడిని ఊహించుకోమంటాడు ఆ 'నవయుగ కవి చక్రవర్తి', 'కవికోకిల'. అమ్మ ప్రేమ గడ్డ కట్టిన ఒక అమృతపు అచ్చు అని అన్నాం అనుకోండి. అప్పుడూ ఇలాగే భావవిస్తృతి, భావసౌందర్య, గాంభీ ర్యాలు అనుభూతి మాధుర్యాన్ని అనంతంగా అందిస్తాయి.

"The office poetry is not to make us think but to feel truly (కవిత్వం యొక్క పని ఆలోచనా ప్రేరణ కాదు గాని, స్వచ్ఛమైన అనుభూతిని అందించటం)" అన్న ఎఫ్.ఎమ్.రాబర్ట్‌సన్ మాట అనుభూతివాద సూక్తి. సారాంశం ఏమిటంటే కవిత్వం అనుభూతి ప్రధానం, ప్రదానం అని. మఱి చాసో, ఇంకా ఆనాటి అభ్యుదయ వాదులు మాత్రం అటుఅనుభూతికి, ఇటు ఆలోచనా ప్రేరణకు-రెంటికీ సమప్రాధాన్యం ఇచ్చారు కవిత్వ పరంగా.

మఱి చాసో అయితే కవితలు రాస్తున్నంత సేపు ధ్వని, భావగాంభీర్యం, భావశబలతలకు, ఉపమ, పరిక రాది అలంకారాలకు సముచిత స్థానం ఇచ్చారు. తరువాత కథాప్రపంచంలో ధృవతారగా వెలిగే రోజుల లోనూ కథాకథన వాక్యాలలో గూడా కవితలలో మాదిరి గానే ధ్వని, వ్యంగ్య, అలంకారాది ప్రధాన శిల్ప లక్షణా లను పోషిస్తూనే ప్రభోదాత్మకతకు ప్రాణం పోశారు, 'ప్రాణమిచ్చారు' -అక్షరకృషిలో - తన కథలలో. ప్రబంధ కవి ధూర్జటి కూడా కాళహస్తీశ్వర మహాత్మ్యం రాసే నాటికి కవిత్వాన్ని 'మసాలాలతో నింపితే ఏం లాభం? జనానికి సత్యం చెప్పాలి' అన్నాడు. 'సత్యవర్ణన కాకుండా కళాత్మకపు విలువలకోసం అంటూ, శిల్పం కోసం అంటూ కృతులు రచించే కవులు సిగ్గుపడాలి అన్నాడు ఈ క్రింది పద్యంలో -


"ఏ లీలన్ నుతియింప వచ్చు నుపమోత్ప్రేక్షా ధ్వని వ్యంగ్య శ
బ్దాలంకార విశేష భాషల కలభ్యంబైన నీరూపముం
జాలుంజాలుం గవిత్వముల్ నిలుచునే సత్యంబు వర్ణించుచో
ఛీ! లజ్జింపరుగాక మాదృశ కవుల్! శ్రీ కాళహస్తీశ్వరా!"

ధూర్జటి తాను నమ్మిన తాత్త్విక, పారమార్థిక సత్యా నికి ప్రాముఖ్యం ఇచ్చాడు. చాసో తానునమ్మిన మానవతా వాద నిత్య సత్య సిద్ధాంతానికి ప్రాధాన్యం ఇచ్చారు. అంతే తేడా. సరే అది అటుండనిద్దాం. ఇక ప్రస్తుతానికి వద్దాం. చీకటి, వెన్నెల, చుక్కలు, ఆశలదిక్కులు, ప్రేయసి, ప్రేమలు, ఋతుసౌందర్యాలు, ఉగాదులు,ఉద్యానాలు, మయూరాలు, సూర్యోదయాలు, సుందరీ విరహాలు వగైరా లంటూ ఏవేవోరాసి గీసిపారేసే భావకవిత్వ ఆకర్షణలకు లోను కాకుండా కష్టజీవులు, కన్నీళ్ళు, ఉన్న వాడి దోపిళ్ళు, ఊరి పెద్దల ఆరళ్ళు, లేనివాళ్ళ ఆకళ్ళు, ఆవేదనలు, ఆందోళనలు, మధ్య తరగతిలోని క్రింది తరగతివాళ్ళ వెతలు, వేదనలు, నిస్తేజత, నిరాసక్తత, మందకొడితనం, అమాయకత్వం మొదలైన అంశాల మీద మాత్రమే రాశారు కవితలు చాసో. అవి అన్నీ కలిపి పదిపన్నెండు మాత్రమే లభిస్తున్నాయి. అవిచాలు సాహితీ ప్రియుడికి కమ్మని కైతల ఆనందపుకైపు కలిగించ టానికి చాసో రసవత్కవితా సృష్టిగా."పనముత్య మొకటి చాలును కసవూడ్చిన చింపిరాలు గంపెడేలా?" అన్నాడొక దక్షి ణాంధ్ర సాహిత్య యుగకవి. (మిగతా వచ్చేవారం)

కమ్యూనిస్టుయోధుని ఉద్వేగభరిత జీవితం 'ప్రవహిస్తున్న జ్ఞాపకం'

-సి.రాఘవాచారి
విశాలాంధ్ర పూర్వ సంపాదకులు

తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమంలో ఉత్తరాంధ్రలో కళింగాంధ్రగా పిలవబడుతున్న ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నది. అధిక సంఖ్యలో గిరిజనులు ఏజెన్సీ ప్రాంతాల్లో అనుభవిస్తున్న దుర్భర జీవితాలను మెరుగుపర్చడానికి, వారిపై సాగుతున్న ప్రభుత్వ, భూస్వామ్య దోపిడీ నిర్మూలనకు జరిగిన, జరుగుతున్న ప్రజాపోరాటాలు ఉత్తేజకరమైన అధ్యాయం. విదేశీ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అమరజీవితం అందించిన స్ఫూర్తి, ఉత్తేజం ఏడెనిమిది దశాబ్దాలుగా సాగుతున్న ఈ ప్రజాపోరాటాల్లో అంతర్లీనంగా అవిభాజ్యమైన పార్శ్వంగా కొనసాగుతుంది. కార్మిక, కర్షక, కూలీల వర్గపోరాటాలతో అతనికి ఆసరాగా కడుదైన్యంగా జీవితాలు గడుపుతున్న పీడితవర్గాలపై నిరంతరం కొనసాగు తున్న ప్రభుత్వ, భూస్వామ్య, దోపిడీని తుదముట్టించడానికి సాగుతున్న మహోద్యమం లక్ష్యసాధనగా మరింత పట్టుదలతో వజ్ర సంకల్పంతో వివిధవిప్లవశ్రేణుల నాయ కత్వంలో జరుగుతున్న ఆందోళనలు నేటి బూర్జువా పాలకుల 70 ఏళ్ల స్వతంత్ర పాలన నిర్వాకాన్ని అచ్చేదిన్ గరీబీహటావో వంటి మోసపూరిత నినాదాల డొల్లతనాన్ని అతివికృతంగా, నగ్నంగా వెల్లడిస్తున్నవి. ఈ ఐతిహాసిక, అధోజగత్‌సోదరుల సమరశీల భారతంలో ఉత్తరాంధ్ర శ్రామిక ప్రజల విప్లవోద్వేగభరిత ఆందోళన ఇప్పటికీ విస్మరించరాని పర్వం. ఈ క్రమంలో కమ్యూనిస్టు ఉద్యమం నిర్మించిన విప్లవ సంప్రదాయాలు, విలువలు, ప్రమాణాలు, సాంస్కృతిక ప్రభావాలు, వేటికవే ప్రత్యేకించి అధ్యయన, ఆరాధ్య సంపుటికలుగా అభివర్ణించ దగినవి. ఈ ఉత్తేజభరితమైన చరిత్రను అర్థం చేసుకోవడానికి ఎంతో శ్రమించి వివరాలు, మూలాలను అన్వేషించి సేకరించి గ్రంథస్థం చేసి మనకు అందించిన డాక్టర్ కె.ముత్యం బహుధా అభినందనీయుడు. మార్క్సిస్టు చరిత్ర దృక్పథంలో గతితార్కిక విశ్లేషణ ధోరణితో ఆయన అందిస్తున్న పుస్తకం 'ప్రవహిస్తున్న జ్ఞాపకం' చాలా విలువైనది. ఇది ప్రస్తుతం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రం ఒడిశాలోని పర్లాకిమిడి, బరంపురం వంటి ప్రాంతాల తెలుగు ప్రజల సమభ్యున్నతికి పోరాడిన కమ్యూనిస్టు యోధ అమరజీవి గంటి రాజేశ్వరరావు ఉద్వేగభరితమైన జీవిత కథ. కేవలం మూడు దశాబ్దాలు మాత్రమే సాగిన ఆయన జీవితంలో విజయనగరంలో విద్యార్థి దశ నుంచి వివిధ ఉద్యమాల్లో పాల్గొన్న వివరాలను, విశేషాలను అందిన మేరకు మూడేళ్ల క్షేత్ర పర్యటనల ద్వారా ప్రత్యక్ష సంభాషణల ద్వారా సమ కూర్చిన కమ్యూనిస్టు ఉద్యమ సంక్షిప్త చరిత్ర కూడా. రాజేశ్వరరావు చనిపోయిన తర్వాత ఆరు దశాబ్దాలకు వెలు వడుతున్న ఈ గ్రంథం సమగ్రం కాకపోవచ్చుకానీ నాటి సమర శీల అంకితభావంతో పనిచేసిన ఆ కామ్రేడ్ జీవితం లోని విశిష్ట లక్షణాలను, విప్లవాంశాలతో కూడిన సంస్కరణభావా లను ఉత్తేజకరమైన కథనశైలిలో అందించినందుకు విచక్షణ గల తెలుగు పాఠకులు ఆచార్య ముత్యంగారికి సదా ఋణ బద్ధులై ఉంటారు. 4,5 సంవత్సరాల క్రితం ఆయన ఫోన్ చేసి రాజేశ్వరరావు పేరున పుస్తకం రాయాలన్న ఉద్దేశం చెబుతూ దానికి సంబంధించి ఆధారభూతమైన సమాచారం గురించి వాకబుచేశారు. ఆయన ఉద్దేశం ఎంత స్వాగతించదగినదో.. అది ఫలప్రదం అవడానికి జరగాల్సిన ప్రయాస, ప్రయత్నం అంతే కష్టమైనది. అయినా నా ఎరికమేరకు రాజేశ్వరరావు సమకాలీకులు, సహచరులైన కామ్రేడ్స్ కొడుగంటి గోవింద రావు (ఆయన విజయనగరం కాలేజీలో గంటికి సీనియర్), కామ్రేడ్ ఎం.వి భద్రం, కామ్రేడ్ జీవీకే వల్లభరావు ప్రభృతుల గురించి తెలిసిన సమాచారం చెప్పి వారు రాసిన అనుభవాల చరిత్రలనుంచి మీకు కొంతసమాచారం లభించవచ్చని, అలాగే ఆ కాలపు కమ్యూనిస్టుపార్టీ పత్రికలైన ప్రజాశక్తి, విశాలాంధ్ర లో లభ్యమైన మేరకు సంప్రదించాల్సినదిగా చెప్పాను.



వాటితోపాటు జైలు రికార్డులు, వారి తరఫున బారువసంస్థాన్ దివాన్ గంటి బోగయ్య పంతులు గారు ఆయన విడుదల కోసం నాటి మద్రాసు ప్రభుత్వానికి పెట్టుకున్నఅర్జీలు, సంబంధిత ఉత్తర్వులు, సజీవంగాఉన్న అతి కొద్ది మంది సహ చరుల జ్ఞాపకాలను కష్టపడి సేక రించి ఒక నిర్దిష్ట రూపం సంతరింపజేసిన ముత్యంగారి కృషి మామూలు ప్రశంసా ప్రస్తా వనలకు లొంగని నిజ మైన జీవన సాఫల్య కృషి. దీనికి ఆయన శ్రీకాకు ళం ఉద్యమ చరిత్రపై చేసిన పరిశోధనకు (డాక్ట రేట్ పట్టా కోసం కూర్చిన సిద్ధాంతగ్రంథం) సంబంధిత రచనలు సహజంగానే తోడ్పడ్డాయి. అందుకు ఆయన పట్టుదలకు, నిబద్ధతకు, నిజాయతీకి జేజేలు.

ఈ ప్రవహిస్తున్న జ్ఞాపకం చదువుతున్నప్పుడు అనేక జ్ఞాపకాలతో సామ్యాలు గుర్తుకొస్తున్నాయి. పుస్తకానికి సుదీర్ఘ పరిచయ వ్యాఖ్యలు రాసిన మిత్రుడు ప్రసాద్ ప్రస్తావించిన అగ్రనాయకులే గాక ఆయనతో అనేక విధాలుగా పోల్చదగిన కంభంపాటి సత్యనారాయణ సీనియర్ జీవితం గుర్తుకొచ్చింది. రాజేశ్వరరావు లాగే ఆయన కూడా తూర్పుగోదావరి జిల్లాలోని ఒక సంస్థానపు (తుని) దివాన్ కొడుకు. గంటి తండ్రి గారి లాగానే సీనియర్‌తండ్రి కూడా ఆయన్ని శుభప్రదమైన జీవితం గడపడంకోసం అలజడులకు, ఆందోళనలకు దూరంగా ఉంచాలని ఉన్నత విద్య కోసం మద్రాసు లయోలా కళాశాలలో చేర్పించారు. ఆయన అక్కడ చదువుతూనే ఆంధ్రాలో ఉద్యమం తొలి కార్యకర్తల్లో ఒకరిగా రూపొందడానికి రంగం సిద్ధం చేసినట్టు అయ్యింది. మద్రాసులో మహీధర్‌ఖాన్ మార్గ దర్శకత్వంలో ఏర్పడ్డ తొలి పార్టీ శాఖలో సీనియర్ ఒకరు. అదే కళాశాలలో విద్యార్థిగా పుచ్చలపల్లి సుందరయ్యగారు కూడా ఉన్నది విశేషాంశం. దివాన్‌అంటే ఆనాడు సంస్థానంలో ప్రముఖమైనకుటుంబం. దానితోపాటు ఇద్దరూ సనాతన బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చినవారు. ఇలాంటి వారు తమజీవితంలో యావత్‌శక్తులుధారబోసి నిర్బంధాలకు, నిషేధాలకు గురై సాగించిన విప్లవ ప్రస్థానం ఒక సారూప్యత ను కలిగిస్తుంది. అలాగే ఆయన (రాజేశ్వరరావు) విద్యార్థిగా ఉన్నప్పుడు మున్సిపల్ కార్మికులతో అందులోనూ మలం తొట్టె లను నెత్తికెత్తుకుని శుభ్రపర్చే పాకీ వారితో మమేకమై కార్మిక ఉద్యమంనిర్మించినవిషయం నిజంగా ప్రస్తావించాలి. ఈ సందర్భంగా కృష్ణాజిల్లాలోని గుడివాడ పట్టణంలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకునిగా అట్లూరి సీతారామయ్య మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌లో పనిచేస్తున్నప్పుడు ఆయన్ను గిట్టని వారు పాకీ సీతారామయ్య అని పిలిచేవారని చెబుతుంటారు. అలా చాలామంది ఆ రోజుల్లో ఏ నేపథ్యం నుంచి వచ్చినా ఇలాంటివిధులు నిర్వహించడం సాధారణం. గంటి రాజేశ్వరరావు ప్రథమ సార్వత్రిక ఎన్నికల ముందు పార్టీ విజయానికి ఆరోగ్యం బాగాలేకున్నా కృషి చేస్తూనే మరణించారు.

కుటుంబసభ్యులు ముఖ్యంగా తల్లి దండ్రులు ఎంత బాధపడినా, మిత్రులు ఎంత వారించినా ఆయన తన విప్లవ పంథానుంచి వైదొలగలేదు. అది సహజ మైన సమరశీల విప్లవప్రవాహం. అం దులో ఒక భాగమైన రాజేశ్వరరావు చరిత్రను అందజేసిన ముత్యం గారికి మరోసారి అభినందనలు. ముత్యం విద్యార్థి దశ నుంచి వామపక్ష భావాలతో పనిచేస్తున్న సమరశీల సంప్రదాయం కలవారు. 1983, 84వ సంవత్సరాల్లో పీడీఎస్‌యూ తరఫున ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆర్ట్స్ కళాశాలకు విద్యార్థి సంఘ అధ్యక్షునిగా గెలిచి పనిచేశారు. 20 ఏళ్లకు ముందే ఆ విశ్వవిద్యాలయంలో లా కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుని గా నేను పనిచేసి నప్పటి కన్నా ముత్యం అధ్యక్షు డయ్యే నాటికి పరిస్థితులు చాలా సంక్లిష్టతను సంతరించుకున్నాయి. జార్జిరెడ్డి హత్య, అలాగే ఏబీవీపీ ఇతర విద్యార్థి సంఘాల ఘర్షణలు పెచ్చరిల్లిన కాలమిది. అయినా ముత్యం సాధించిన విజయం ప్రత్యేకించి ఈనాటి విద్యార్థి మిత్రులకు ఆదర్శ ప్రాయమైనది. వారి లేఖనం నుంచి మరిన్ని ఉత్తేజకర మైన రచనలు రావాలని ఆకాంక్షిస్తూ సెలవు. ✪

పుస్తక ప్రభాకరుడు

"కొందరు కనిపిస్తనే
గౌరవం పొంగుకొస్తది
తెల్వకుండనే లేచి
నిలబడుతం
మనసులో మర్యాద
నిండుతది
రెండు చేతులా నమస్కరిస్తం
అది అవుతలి హృదయ పరిమళం
పురి విప్పిన అనురాగం"



ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కార గ్రహీత శ్రీ లంకా సూర్యనారాయణ

ప్రియమిత్రుడు అన్నవరం దేవేందర్ రాసిన ఈ కవితావాక్యాలను ఎవరి నుద్దేశించి అంటున్నానో మీకీపాటికి అవగతమయ్యే ఉంటుంది. కోట్లాది రూపాయలు కుమ్మరించి లంకంత కొంపలు కట్టుకొని సకల సౌకర్యాలు అమర్చుకున్నామని భ్రమించేవాళ్ళ లోగిళ్ళలో టెలిఫోన్ డైరెక్టరీ తప్ప ఏ ఒక్క పుస్తకం కూడా ఉండని వాళ్ళ (సెల్‌ఫోన్లు వచ్చిన తరువాత ఈ ఒక్క పుస్తకం అవసరం కూడా లేకపోయింది.) సాంస్కృతిక దివాళాకోరుతనాన్ని గురించి విచారాన్ని ప్రకటిస్తూ- మాట్లాడని మహావక్తలను, జీవితాంతం వెన్నంటి ఉండే మిత్రులను పరిచయం చేసే, మనల్ని సంస్కారుల్ని చైతన్యవంతుల్ని చేసే ఒకానొక మహామూర్తిని గురించి మీతో సంభాషిస్తున్నాను.

తన జీవితాన్ని ఆనందమయం గావించిన సమాజ రుణం తీర్చుకోవటమే జీవితలక్షణంగా, లక్ష్యంగా జీవనయానం కొనసాగించే వాళ్ళే ఎవరికైనా ఎప్పటికైనా గుర్తుంటారు. చరిత్రలో మిగులుతారు. వీళ్ళు డబ్బుచేసిన లోకాన్ని ఎడమచేత్తో నెట్టేస్తూ కుడిచేత్తో జ్ఞానసంపద నందిస్తూ చిరంజీవులవుతారు.

నేనేపూరన్నా వెళ్ళినప్పుడు ఈ వూళ్ళోని 'కోటేశ్వర' రావులను గురించి ఒక్కడంటే ఒక్కడు అడిగిన పాపాన ఏనాడు పోలేదు. వీళ్ళను వూళ్ళోవాళ్ళు కూడా తలుచుకున్నదెన్నడూ లేదు సుమా! వావిలాల గోపాలకృష్ణయ్య, సి.వి.ఎన్.ధన్, జొన్నలగడ్డ జోషి, పరుచూరి రాజారామ్ లాంటి పుస్తక సంపన్నులను గుర్తుచేసేవాళ్ళు, గౌరవంగా మాట్లాడేవాళ్ళు.

ఎవరిని గురించి ఈ నాలుగు మాటలు రాస్తున్నానో ఆ ధవళవస్త్రధారి, సన్నగా పొడుగ్గా ఉండి ఓవర్ బ్రిడ్జి దగ్గరో, విశాలాంధ్ర వద్దనో పాత కొత్త పుస్తకాల కోసం నిరంతరం వెతుకులాడే ఆ పుస్తక లక్షాధికారిని యింకా మీకు చూపాల్సిన అవసరముందంటారా! 'ఇచ్చునదె విద్య' అని గ్రహించిన ఆయన అన్నమయ్య గ్రంథాలయాన్ని గుంటూరుకు అందించారు. గుంటూరుకేనా! కాదు యావత్ తెలుగుజాతిది ఆ జ్ఞానసంపద. ఆ జ్ఞానప్రదాతతో పరిచయం, ఆయనతో కరచాలనం నాకు లభించిన అపూర్వ అవకాశం. మా పుస్తక ప్రచురణలో ఆయన అందించిన సహకారం సదా స్మరణీయం. మా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) పక్షాన ఆ తేజోమూర్తికి కృతజ్ఞతలు. అభినందనలు, శుభాకాంక్షలు.

(అజో-విభొ-కందాళం ఫౌండేషన్ 25వ వార్షిక సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని 7-1-18న గుంటూరులో స్వీకరించిన సందర్భంలో చేసిన ప్రసంగం.)

-పెనుగొండ లక్ష్మీనారాయణ, ✆ : 9440248778

విశాలాంధ్ర
బతుకు
The Life
సోమవారం
15 జనవరి 2018





కాంతులు చిందించే సంక్రాంతి

సంక్రాంతి లేదా సంక్రమణము అంటే మారడం అని అర్థం. సూర్యుడు మేషాది ద్వాదశ రాశులందు క్రమంగా పూర్వరాశి నుంచి ఉత్తరరాశిలోకి ప్రవేశించడం సంక్రాంతి. అందుచేత సంవత్సరానికి పన్నెండు సంక్రాంతులు ఉంటాయి. అయినా పుష్యమాసంలో, హేమంత రుతువులో, శీతగాలులు వీస్తూ మంచు కురిసే కాలంలో సూర్యుడు మకరరాశిలోకి మారగానే వచ్చే మకర సంక్రాంతికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఇది జనవరి మాసంలోనే వస్తుంది. మకర సంక్రాంతి రోజున సూర్యుడు ఉత్తరాయణ పథంలో అడుగుపెడతాడు.

హిందువుల పండుగలలో సంక్రాంతి మాత్రమే సౌరగమనాన్ని అనుసరించి వస్తుంది. గ్రెగేరియను కాలెండరు కూడా సౌరమానాన్ని అనుసరిస్తుంది కనుక సంక్రాంతి ప్రతీ సంవత్సరం దాదాపుగా ఒకే తేదీన వస్తుంది. మిగిలిన పండుగలన్నీ భారతీయ సాంప్రదాయం ప్రకారం చాంద్రమానాన్ని అనుసరించి వస్తాయి. కాబట్టి గ్రెగేరియన్ కాలెండరు ప్రకారం ఏటికేడాది వేరువేరు రోజుల్లో వస్తాయి.

తెలుగువారికి పెద్ద పండుగ సంక్రాంతి. ఇది కొన్ని ప్రాంతాలలో మూడు రోజులు (భోగి, మకర సంక్రమణం, కనుమ) ఇతర ప్రాంతాలలో నాలుగు రోజులు (నాలుగోరోజు ముక్కనుమ) జరుపుతారు కావున దీన్ని పెద్ద పండుగ అంటారు. ముఖ్యంగా పంట చేతికొచ్చిన ఆనందంలో రైతులు ఈ పండుగ జరుపుకుంటారు కాబట్టి రైతుల పండుగగా కూడా దీన్ని అభివర్ణిస్తారు.

నిజానికి ధనుర్మాసారంభంతో చలిచలిగా నెల రోజులు ముందుగానే సంక్రాంతి వాతావరణం తెలుగునాట ప్రారంభమవుతుంది. ఆ నెల రోజులు తెలుగు పల్లెలు ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా అలరాలుతాయి. బుడబుక్కలవాళ్లు, పగటివేషధారులు, రకరకాల జానపద వినోద కళాకారులు తయారవుతారు. ఈ పండుగకు దాదాపు నెలరోజుల ముందునుంచే - ప్రతీ రోజు తమ ఇళ్ళ ముంగిళ్ళను రంగవల్లులు, గొబ్బెమ్మలతో అలంకరిస్తారు. ముగ్గులు వేయటానికి ప్రత్యేకంగా బియ్యపు పిండిని వాడతారు. కళ్లం నుంచి బళ్ల మీద ధాన్యం బస్తాలు వస్తూ ఉంటాయి. భోగినాడు భోగిమంట విధిగా వేయవలసిందే. ఆ సాయంత్రం పేరంటంలో పిల్లలకు భోగిపళ్లు ఉంటాయి. ఈ పెద్ద పండుగకు కొత్త అల్లుడు తప్పనిసరిగా అత్తవారింటికి వస్తాడు. మరదళ్ల ఎకసెక్కాలకు ఉడుక్కుంటాడు. కోడి పందాలు, ఎడ్ల బళ్ళ పందాలు జరుగుతాయి. ఇవన్నీ సంక్రాంతి పండుగకు శోభ చేకూర్చే సర్వసామాన్య విషయాలు.

సంక్రాంతి రోజున పాలు పొంగించి, దానితో మిఠాయిలు తయారు చేస్తారు. సంక్రాంతి రోజులలో మనము చూసే ఇంకో సుందర దృశ్యం గంగిరెద్దులు. చక్కగా అలంకరించిన గంగిరెద్దులను గంగిరెద్దులవారు ఇంటింటికీ తిప్పుతూ డోలు, సన్నాయి రాగాలకు అనుగుణంగా వాటిచేత చేయించే నృత్యాలు చూడటానికి చాలా రమణీయంగా ఉంటాయి. ఆ గంగిరెద్దులు మనము ఇచ్చే కానుకలను స్వీకరిస్తున్నట్లుగా తలలు ఊపడం, ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మోకాళ్ళ మీద వంగటం వంటివి చూడడానికి సరదాగా ఉంటాయి. అయ్యగారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దుల వాళ్ళు సందడి చేస్తారు. కొత్త ధాన్యము వచ్చిన సంతోషంతో వారికి ధాన్యం ఇస్తారు. హరిలో రంగ హరీ అంటూ నడినెత్తిపై నుంచి నాసిక దాకా తిరుమణి పట్టెలతో, కంచు గజ్జెలు ఘల్లుఘల్లుమనగా చిందులు త్రొక్కుతూ, చేతుల్లో చిడతలు కొడుతూ తలపై రాగి అక్షయపాత్ర కదలకుండా నడుస్తూ హరిదాసు ప్రత్యక్షమయ్యేదీ ఈ కాలంలోనే.

మూడో రోజు కనుమ నాడు వ్యవసాయంలో తమకు ఎంతో చేదోడువాదోడు ఉన్న పశువులకు పూజలు చేస్తారు. కొన్ని ప్రాంతాలలో కోడి పందాలు కూడా నిర్వహిస్తారు. అయితే ఆ పందాలను జీవహింసగా భావించి రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. కొన్ని ప్రాంతాల్లో ఈ రోజున వనభోజనాలనూ నిర్వహిస్తారు. కనుమ నాడు మినుము తినాలనేది సామెత. దీనికి అనుగుణంగా ఆ రోజున గారెలు, ఆవడలు చేసుకోవడం ఆనవాయితీ. కనుమ మరునాటిని ముక్కనుమ అని అంటారు.

దీనికి బొమ్మల పండుగ అని పేరు. దక్షిణ భారతదేశంలోని ప్రజలు ఈ పండుగ మూడు రోజులను శ్రద్ధాసక్తులతో జరుపుకుంటారు. ఉత్తర భారతదేశంలో మాత్రం ఈ పండుగలోని రెండవ రోజు మకర సంక్రాంతి లేదా లోరీని మాత్రమే జరుపుకుంటారు. కనుమ రోజున మాంసాహారం తినడం ఆంధ్ర దేశాన ఆనవాయితీగా వస్తోంది. మాంసాహారులు కాని వారు, గారెలతో (మినుములో మాంసకృతులు హెచ్చుగా ఉంటాయి కనుక దానిని శాకాహార మాంసంగా పరిగణించి కాబోలు) సంతృప్తి పడతారు. అలాగే కనుమ రోజున ప్రయాణాలు చెయ్యకపోవడం కూడా సాంప్రదాయం.

మరుగున పడిపోయిన పాటలు

పూర్వం సంక్రాంతి సీజన్ అంతా ఆడపిల్లలు అంతా చేరి సాయంత్రం వేళల్లో గొబ్బెమ్మల పేరంటం చేసేవారు. గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ సరదాగా ఎన్నో పాటలు పాడేవారు. అలాంటి వాటిలో ఒకటైన ఈ పాటను ఒకసారి గుర్తుచేసుకుందాం!

గొబ్బి సుబ్బమ్మ...
గొబ్బి సుబ్బమ్మ సుబ్బణ్ణియవే..
చేమంతి పువ్వంటి చెల్లెలినియ్యవే
తామర పువ్వంటి తమ్ముణ్ణియ్యవే
అరటి పువ్వంటి అన్ననియ్యవే
మల్లె పువ్వంటీ మామానీయవే
బంతి పువ్వంటి బావానియ్యవే
కుంకుమ పువ్వంటి కూతురునీయవే
కొబ్బరి పువ్వంటి కొడుకునియ్యవే
అరటి పండంటి అల్లుణ్ణియ్యావే-
గులాబి పువ్వంటి గురువునియ్యావే
మొగలి రేకంటి మొగుణ్నియ్యావే.

ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరు...!

సంక్రాంతి కేవలం మన రాష్ట్రంలోనే కాదు తెలుగువాళ్ళు ఎక్కడుంటే అక్కడ మకర సంక్రాంతి మహా ఘనంగా జరుగుతుంది. ప్రవాసాంధ్రులు తెలుగుతనాన్ని మర్చిపోకుండా వీలైనంతవరకూ పండుగ సంప్రదాయాలేవీ లోపించకుండా కళకళలాడేలా వైభవోపేతంగా జరుపుకోవడం మనకు తెలిసిందే. మరో సంగతి ఏమంటే మకరసంక్రాంతి తెలుగువారి పండుగ మాత్రమే కాదు. కర్ణాటక, తమిళనాడు, బెంగాల్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ఇలా వివిధ రాష్ట్రాలవాళ్ళు ఈ పండుగ జరుపుకుంటారు.

తమిళులు నాలుగు రోజులపాటు సంక్రాంతి పండుగ వేడుక చేసుకుంటారు. మొదటిరోజును ''తై'' నాడు సూర్యుని, వానదేవుని ప్రార్థిస్తారు. రెండోరోజు ''పొంగల్'', మూడోరోజు ''మత్తు పొంగల్'', నాలుగోరోజు ''తిరువళ్ళువర్''. వీటిని మనం వరుసగా భోగి, పండుగ, కనుమ, ముక్కనుమ అంటాం. బెంగాలీలకు సంక్రాంతి గొప్ప పండుగ. అత్యుత్సాహంతో ఈ వేడుక చేసుకుంటారు.

ఉత్తరప్రదేశ్‌లో సంక్రాంతిని 'ఖిచ్రి' అంటారు. గంగా, యమునా, సరస్వతి సంగమ తీరంలో నదీ స్నానం చేస్తారు. గంగా తీరంలో పెద్ద ఎత్తున భోగిమంటల ఉత్సవాన్ని నిర్వహిస్తారు. పంజాబులో భోగి పండుగను ''లోహ్రి'' అని, సంక్రాంతిని 'మఘీ'' అని అంటారు. ఈ పండుగ మహోత్సవంలో భాంగ్రా నృత్యం చేస్తారు. మధ్యప్రదేశ్‌లో సంక్రాంతిని ''సుకరాత్'' పేరుతో ఆనందంగా జరుపుకుంటారు. మహారాష్ట్రలో సంక్రాంతి సందర్భంగా నువ్వులతో పిండివంటలు తయారుచేస్తారు.

పండగకి పట్టుకళ!





సంస్కృతిని చాటిచెప్పే రంగవల్లులు

మన సంస్కృతిలో, సంప్రదాయంలో ముగ్గులకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. అవి మన జీవితంలో అంతర్భాగమయ్యాయి. ముగ్గులను మనం రంగవల్లులని పిలుస్తాం. దేశవ్యాప్తంగా అందరికీ తెలిసిన పదం రంగోళి. రంగ్ ప్లస్ హోళి. రంగ్ అంటే రంగులు... హోళి అంటే సెలబ్రేషన్ (ఉత్సవం). అంటే ఇదొక ఆర్టిస్టిక్ సెలబ్రేషన్. కళాత్మక ఉత్సవం. ఇది మన పూర్వీకుల నుంచి సంక్రమించిన వారసత్వ ఆస్తి. త్రేతాయుగంలో రాముడు అరణ్యవాసం అనంతరం రాజ్యానికి వస్తుంటే ప్రజలంతా ఇంటిముందు రంగవల్లులు వేసి, స్వాగతం చెప్పినట్లుగా చరిత్ర చెబుతోంది. ఇంటిముందు కళాత్మకంగా ముగ్గులు వేసి, పసుపు, కుంకుమతో అలంకరిస్తే ఆ ఇంట్లో లక్ష్మీదేవి నివశిస్తుందని, కీర్తి, ఐశ్వర్యం సిద్ధిస్తాయని ప్రజల నమ్మకం. ఇంటిముందు రకరకాల ఆకారాలలో వేసే ముగ్గులు అదృష్టాన్ని కలుగజేస్తాయని కూడా మన పూర్వీకులు విశ్వసిస్తారు. అంటే ఇదొక సింబల్ ఆఫ్ గుడ్‌లక్. దుష్టశక్తులను ఇంట్లోకి ప్రవేశించకుండా ముగ్గులు కాపాడతాయని ప్రాచీనులు భావించేవారు. బియ్యం పిండితో ముగ్గులు వేస్తారు. చీమలు, కీటకాలు, పక్షులు మొదలైన జీవులు పిండి ఆహారంలా ఉపయోగపడాలనే ఉద్దేశంతోనే ఇలా వేసేవారు. పిండిని తినడం వలన వాటి ఆహార సమస్య తీరి, ఇంట్లోకి ప్రవేశించకుండా ఉంటాయని కూడా భావించేవారు.

ముగ్గులు వేసే కళలో శారీరక ఆరోగ్యం కూడా దాగుంది. వేకువజామునే మహిళలు స్నానం చేసి, ప్రశాంతమైన మనసుతో పొందికగా ముగ్గులు వేయడం వల్ల మహిళల్లో ఏకాగ్రత పెరుగుతుంది. వారి శరీరం వివిధ భంగిమల్లో వంగటం వలన రక్తప్రసరణ బాగా జరిగి వారు రోజంతా ఉత్సాహంగా పనిచేయగలుగుతారు. ఇంటిపనులు, పిల్లల ఆలనా పాలనా సమర్థవంతంగా నిర్వహించగలుగుతారు. ముగ్గులు వేసే సంప్రదాయంలో సైన్స్ కూడా అంతర్లీనంగా దాగుందని ప్రముఖ న్యూరో సర్జన్ వీఎస్ రామచంద్రన్ ప్రయోగపూర్వకంగా నిరూపించారు. తన 'ఇండియన్ ఆర్ట్... న్యూరో సైన్స్' అనే పుస్తకంలో అనేక విషయాలు వెల్లడించారు. ఫిజిక్స్‌లో రకరకాల సర్క్యూట్స్ ఉంటాయి. ఆ సర్క్యూట్స్ ఆధారంగా అనేక యంత్ర పరికరాలు పనిచేస్తుంటాయి. అవి ఎనర్జీ ప్రేరేపిత కేంద్రాలుగా ఉంటాయి. అలాగే ముగ్గులు కూడా నథింగ్ బట్ సర్క్యూట్స్ అని, ఇవి పాజిటివ్ వైబ్రేషన్స్‌ను ఉత్పత్తి చేస్తాయని, ఇవి మనలో మంచి ఆలోచనలను, ఎనర్జీని కలుగజేస్తాయని తెలిపారు. వేకువజామునే మహిళల మనసు ఒక పని (ముగ్గు వేయడంపై) కేంద్రీకృతం కావడం వలన ఆ రోజంతా వారు నిశ్చల స్థితిలో ఉండే అవకాశం ఉంటుందని, ఇదొక ధ్యాన స్థితి అని



ఆయన భావించారు. అలాగే నేడు అనేకమంది శరీరంపై ధరిస్తున్న టాటూలు కూడా శరీరంలో పాజిటివ్ ఎనర్జీని క్రియేట్ చేస్తాయనే నమ్మకంతో ధరిస్తున్నవే.

ఇక సంక్రాంతి వచ్చిందంటే ఆ సందడే వేరు. పల్లెలన్నీ జీవకళతో ఉట్టిపడుతుంటాయి. మహిళలు ముంగిళ్లను పేడతో అలికి ఆకర్షణీయమైన ముత్యాల ముగ్గులు తీర్చిదిద్ది, రంగులు అద్ది వాటిలో గొబ్బెమ్మలు ఉంచుతారు. తద్వారా వీధులన్నీ శోభాయమానంగా దర్శనమిస్తాయి. అంతేకాదు ఎక్కడెక్కడో ఉన్న బంధువులంతా ఒకచోట చేరడం, కొత్త బట్టలు ధరించడం, మనసు విప్పి మాట్లాడుకోవడం, రకరకాల పిండివంటలు, అరిసెలు వండటం, గాలిపటాలు ఎగురవేయటం, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దు విన్యాసాలు, మహిళల నోటివెంట అలవోకగా జాలువారే పాటలు, కోలాటం, చెక్కభజనలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో.. ఎన్నెన్నో అనుభవాలు, అనుభూతులు. సంవత్సరానికి సరిపడా మధుర జ్ఞాపకాల్ని నిక్షిప్తం చేసే వేడుక సంక్రాంతిని శోభాయమానం చేసేవి నిస్సందేహంగా రంగవల్లులే.

– పి.శ్రీనివాసరావు

ముగ్గులు... విశేషాలు

రాళ్ళూరప్పలూ లేకుండా ఒక పద్ధతిలో అలికిన నేల...మేఘాలు లేని ఆకాశానికి సంకేతం. ఒక పద్ధతిలో పెట్టే చుక్కలు రాత్రి వేళ కనిపించే నక్షత్రాలకు సంకేతం. చుక్కల చుట్టూ తిరుగుతూ చుక్కలను గళ్ళలో ఇమిడ్చే ముగ్గు ఖగోళంలో ఎప్పటికప్పుడు కనిపించే మార్పులకు సంకేతం. ఎంత పెద్దదైనా చిన్నదైనా ముగ్గు మధ్య గడిలో పెట్టే చుక్క సూర్యుని స్థానానికి సంకేతం. ఇంకొక దృక్పథంలో గీతలు స్థితశక్తికి (స్టాటిక్ ఫోర్స్), చుక్కలు గతిశక్తి (డైనమిక్ ఫోర్స్)కి సంకేతాలని అంటారు.

రథం ముగ్గు : పండగ చివరి రోజున రథం ముగ్గు వేస్తారు. అందరికీ ఆనందాన్ని పంచే పండుగను ఘనంగా సాగనంపేందుకు పుట్టినదే ఈ రథం ముగ్గు. అందరూ ఒకరికి ఒకరు తోడుంటూ కలసి సహజీవనం సాగించాలి అనే సంకేతాలతో ఒక రథం ముగ్గు తాడును మరొక ఇంటి వారి ముగ్గుతో కలుపుతూపోతూంటారు.



అతడు-ఆమె

44



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ముక్కు మూసుకు, నవ రంధ్రాలూ బంధించి లక్ష గాయత్రీ చేసి ధర్మం పట్టుకుని వేళాడుతానంటే - అసలు ధర్మమే మారిపోతూంటే! నిన్నటి ధర్మం ఈవేళ లేదు - ఈవాళ ధర్మం రేపు ఉండదు. శాశ్వత ధర్మాలంటూ వున్నాయా? అనిపిస్తూంటుంది నాకు. సత్యం, ధర్మం దేశ కాల పాత్రలని అనుసరించే కాదూ? ఆర్యకాలంలో నిష్కామ కర్మ, అపరిగ్రహం, జ్ఞానసముపార్జితం, జ్ఞానదానం - ఇవీ బ్రాహ్మధర్మాలు. ఇప్పుడవి మారిపోయాయి కావా? ఏదో ఒకవిధంగా డబ్బు సంపాదనే ఇప్పట్లో ప్రధానం. ఎలా సంపాదించినా తప్పులేదు. దివాలా తీసి సంపాదించినా, బ్రిడ్జి ఆడి సంపాదించినా, షేరుమార్కెటులో సంపాదించినా, బీదల దగ్గిర చికిత్సకోసం డబ్బుగంజి సంపాదించినా, రైతులని పీడించి సంపాదించినా, తప్పుడు సాక్ష్యాలు ఇచ్చీ ఇప్పించీ సంపాదించినా - సంపాదిస్తేనే మర్యాద! ఒక తరం దాటిపోతే సమకాలీనులు మర్చిపోతారు. మరీ చిక్కుండదు.

(నిన్నటి సంచిక తరువాయి)

సంపాదించకపోతే అసమర్థుడు, అప్రయోజకుడు, గౌరవ మర్యాదలకి హక్కుండదు. మా పెద్ద తాతగారు నలుగురు స్లానని ఉంచుకున్నారట. ఉంచుకోకపోతే పురుష లక్షణమే కాదుట - ఆ రోజుల్లో! యూరపులోనూ అంతేగా మొన్న నిన్నటివరకూ! మహారాజులంటే చచ్చిపడిపోయే వారు మునుపు. ఇపుడెవరికీ లక్ష్యమే లేదు. కూలివాడుకూడా ఆత్మగౌరవం కోసం పాకులాడుతున్నాడు. ధర్మం ఇలాగే తారుమారువుతూంటుంది. నేను వెనక "శశిరేఖ" గురించి వ్రాసింది చదువుకుని - వ్రాసినదనుకున్నాను. ఉద్రేకంలో వ్రాసివుంటాను. స్వేచ్ఛంటే అచ్చువేసిన అబోతులాగు తిరగడం కాదే! దాహం వేస్తున్నదని చెప్పి పదిమంది కరచిపెట్టి త్రాగిన గళాసుతో త్రాగగలమా? అది స్వేచ్ఛ కాదు - విషయలోలత్వం. ప్రపంచంలో వున్నది స్త్రీ పురుష సంబంధం ఒక్కటేనా? మానవ జీవితానికి వ్యక్తి జీవితానికి అదేనా ప్రధానం అయింది? విషయలోలత్వం, బహుభార్యాత్వం, బహు భర్తృత్వం - ప్రజాభిప్రాయం ఎప్పుడూ అసహ్యించుకుంటుంది. వ్యక్తిత్వము, సమానత్వము, గౌరవము, స్వాతంత్ర్యము, స్థిరత్వము - గృహస్థజీవితంలో ఇదే ముఖ్యమైన లక్ష్యం. ఇదే నిజమయిన అభ్యుదయం...

"అమ్మా - తల్లీ" అంటూ కిందనుంచి కేక వినిపించింది. పన్నెండు గంటల వేళప్పుడు ఎవరు పిలుస్తున్నారు చెప్మా? అని కిందకి వెళ్ళి చూశాను. పదహారేళ్ళ అమ్మాయి - చింపిజుత్తు - మాసిన పరికిణి, చిరిగిపోతూ చిరిగిపోతూన్న బాడీసు, మెళ్ళో నల్లపూసల పేరు - ముక్కుని చెవలని పూచిక పుడకలు - మొండి చేతులు - "ఆకలేస్తూందమ్మగారూ - అన్నం పెట్టించరా?" అని అడిగింది. తప్పకుండా అన్నం పెట్టిస్తానమ్మా అని, ముందు వేడి వేడి కాఫీ తాగు. ఆ తరవాత తలంటుకుని స్నానం చెయ్యి. అప్పుడు భోంచేద్దువు గాని - అని చెప్పి లోపలికి రమ్మన్నాను. తలంటుకున్నాక నా చీర, బాడీసు ఇచ్చాను. భోంచేస్తున్నప్పుడు తన కథ చెప్పింది. వాళ్ళది నైజాంట. నాందేడు దగ్గిర పన్నెండుమైళ్ళ దూరంలో పల్లెటూరట. తల్లిదండ్రులు అతి బీదవాళ్ళట. ఈ అమ్మాయీ, ఇంకా ముగ్గురు చెల్లెళ్ళూ నలుగురు తమ్ముళ్ళూనట. బ్రాహ్మలట. మురికినాట్లుట. మళయాళంనుంచి ఎవరో ఇద్దరు మగవాళ్ళు, ఆడవాళ్ళు వాళ్ళ వూరువొచ్చి, ఈ అమ్మాయిని, తల్లిదండ్రులకి రెండువందల రూపాయల ఖరీదు ఇచ్చి కొనుక్కున్నారట. ఆరు రోజుల క్రింద టనే నైజాం నుంచి బయలుదేరి తోవలో షేరు మహమ్మదు ఊరులో మరో ఇద్దరు అమ్మాయిలని కూడా చెరి మూడు వందలకూ ఖరీదుచేసి, నాల్గు రోజుల క్రింద అందరూ కలిసి నైజాంనుంచి బయలుదేరి నిన్న సాయంత్రం చెన్నపట్నం వచ్చారట. ఈ అమ్మాయికి వాళ్ళని చూసి భయం వేసిందట. రెండుమూడుసార్లు పారిపోవడానికి ప్రయత్నించిందట. కాని సాగలేదుట. ఆఖరికి నిన్న సాయంత్రం బహిర్భూమికి వెళ్తానని చెప్పి, మరుగుదొడ్డి వెనుక గుమ్మం నుంచి, పొరుగు మరుగుదొడ్డిలోకి పారిపోయి, రాత్రి అల్లా అక్కడే దాంకుని , చీకటితోనే ఖబ్రస్తానులో దాంకుని, మధ్యాహ్నానికి ఇక్కడి కొచ్చి



చేరుకుందట. భోంచేస్తూన్నంత సేపూ తనకోసం వెతుక్కుంటూ, వాళ్ళెవరేనా ఇంట్లో జొరబడి తన్ని తీసుకుపోతారేమో అని భయం భోజనం అయాక ఎందుకేనా మంచిదని, తల దువ్వి జడేసి, సిగేసి, చెవులకి వెలిసిపోయిన నా దుద్దులు, ముక్కుకి ఎర్రపొడి ముక్కుపుడక పెట్టి, చేతులకి గిల్టుగాజులు, కాళ్ళకు పుదుచ్చేరీ గొలుసులు పెట్టి, పౌడరు, కుంకం బొట్టు కాటిక పెట్టేసరికి - పూర్తిగా వేరేమనిషి అయిపోయింది. మీ తల్లి దండ్రుల దగ్గరికి పంపించేద్దునా అని అడిగితే - 'నైజాంలో తాగడానికి గంజేనా దొరకదమ్మా! మీదగ్గిరే మీరు వుంచుకుంటే వుంటానమ్మా!" అని ఏడుస్తూ అంది. సరేలే, యివాళనుంచి నీ పేరు 'సుభ' సుమా! అన్నా.

పాపాయితో ఆడుకుంటూంది - ఇంతట్లో శాస్త్రి కోర్టునుంచి ఇంటికి వచ్చి ఆ పిల్లను చూసి - "ప్రెసిడెన్సీ మెజిస్ట్రేటుగారి అమ్మాయా యేమిటి? పాపాయితో ఆడుకోవడానికి వచ్చిందా?" అని నవ్వుతూ అన్నాడు. "కాదు సుభ" అన్నాను. అని అమ్మాయి కథ చెప్పా. శాస్త్రి ఏదో సణుక్కున్నాడు. "సరేలే" అన్నాడు, చివరికి.

శాస్త్రి స్నానంచేసి వచ్చాడు. వసారాలో కూర్చుని కాఫీ త్రాగుతున్నాం. సుభ ఏదో హిందూస్తానీ "గజల్" రాగంతీసి పాడుతూంది. గొంతుక శ్రావ్యంగా వుంది. భైరవిలో బాగా విసురుతూంది. శాస్త్రి అన్నాడు: "శాంతం! నీ శిష్యురాలు సంగీత కళావేత్తలావుందే, అభివందనాలు!" "ఆ ఏదో విన్నపాటలాగుంది. నేర్చుకుందా యేమేనానా?" అన్నా. "ఆ అమ్మాయి మనస్సులో ఎంత విచారంవున్నా సంతోషం వెలిబుచ్చుతూ పాడుతూంది. నిజమైన కళ కళకోసమే ఏమిటి! అన్నం అన్నం కోసమే - ఆవకాయ ఆకాయకోసమే అన్నట్టుంది. కళ మన అందరి కోసం - ప్రపంచకోసం. ప్రజాకోటిని ఉత్తేజపరచడాని కోసం ప్రపంచ రథాన్ని ముందుకు నెట్టడానికోసం!" అన్నా. "అదేమిటట్లా అంటావు? కళ ఉత్తమమైనది. అది మరి ఒక వస్తువు వినియోగార్థం కాదు" అన్నాడు శాస్త్రి. "ఏం? అలాగైతే కళ మైలబడిపోతుందా?" అన్నా. "నీ వెటకారం వెనకబెట్టు. కళ అన్నింటికంటే అతీతమైనది. కళావేత్త ప్రత్యేక వ్యక్తి. సామాన్య నీతులు, కట్టుబాట్లు, అతనికి వర్తించవు. అతనికి ప్రపంచంతో సంబంధం లేదు. కవి వంతు అతనికి తోచినట్టు రాసిపారెయ్యడమే. నీకు నచ్చిందా పాడుకుని సంతోషించు. లేదూ నీ ఖర్మం. అంతేనే కాని కవినీ, అతని కళనీ ఈ పాడు ప్రపంచపు కొలతబద్దలతో కొలవక" అన్నాడు. "అయితే యీ ప్రపంచం వదిలేసి సప్తసముద్రాలూ దాటి అక్కడ వొంటి స్తంభం దంతపుమేడ కట్టించుకుని వుండమను. ఈ సంగతి బోధ చెయ్యి - మన ఈనాటి కవులకి. నీకు చాలా కృతజ్ఞులవుతారు. ఇలాంటి పాడు పంథొమ్మిదో శతాబ్దపు నీతులు వినే, పెళ్ళాం మెళ్ళో పుస్తెలు సహా అమ్ముకుని వాళ్ళకి యిప్పుడు చిప్ప చేతికొచ్చింది" అన్నా. "అయితే నువ్వనేదేమిటి? ప్రపంచం మెచ్చుకొనేలా వ్రాయాలంటావా? అయితే కళ యింక సంకరమై పోతుంది" అన్నాడు. "ఇప్పుడు మహా అయిపోకుండా ఏడిసిందా ఏమిటి? కవులందరూ టిక్కెటుబుక్కు కమిటీ వాళ్ళ చెప్పుచేతుల్లో వున్నారు. చిత్రకారులందరూ సేట్‌జీల బొమ్మలు రాస్తున్నారు. సంగీత విద్వాంసులు గ్రామఫోను కంపెనీల గులాములై పోయారు. సినీమానటులు చెట్టియార్లకి అమ్ముడుపోయారు. ఈవేళ కళ స్థితి యిది. ఇహ ఆ కూడుకూడా లేకుండా చేస్తావు కళ కళకోసమే అంటే" అన్నా. "నేనన్నదీ - కవికాని, గాయకుడు కాని, చిత్రకారుడుగాని ఒక ఉద్దేశంకోసం కళని అవలంబిస్తే అది సరైన కళకాదని" అన్నాడు శాస్త్రి. "ఒక ఉద్దేశం అంటూ లేకపోతే అతని నవ్వులు అతని ఏడ్పులు వినేవరకు నాకేం పట్టింది? ఉద్దేశం, లక్ష్యం వుండాలి. కవి ముందుకు సాగిపోతూండాలి. ఆదర్శవంతుడుగా వుండాలి. తన సమాజానికి పురోగామిగా వుండాలి. దీనులకి, ఆర్తులకి, కష్టజీవులకి, బానిస ప్రజలకు బతుకుమీద ఆశ కల్పించి, జీవితానికి ఒక అర్థం నిర్ణయించి, వాళ్ళని స్వేచ్ఛాసమరంలో పరాక్రమవంతులుగా చెయ్యాలి. వాళ్ళ జీవితాన్ని సుఖవంతంగానూ, ఫలవంతంగానూ జయప్రదంగానూ మార్చాలి. సంఘంలో కళోపాసకుడికి, కళావేత్తకి ఉత్తమస్థానం ఉంది. సంఘంలో తానుకూడా ఒక పౌరుడననుకొని తన విధిని నెరవేరుస్తే సంఘం గౌరవిస్తుంది. తిండీ బట్ట యిచ్చి బహూకరిస్తుంది. లేదు, నేను కొండమీద కోతిలా కూచుంటాను నా యిష్టం వచ్చింది నేను రాస్తాను, నా యిష్టం వచ్చినప్పుడు నేను రాస్తాను, నన్ను ముట్టుకోకు నామాలకాకి అంటే - సరే నీ తిండీ బట్టా నువ్వే తెచ్చుకో అబ్బాయీ! అంటుంది సమాజం" అన్నా.

"కళని ధర్మార్థ కామసాధనాలకి వినియోగించడమే మన హిందూ సంప్రదాయం. త్యాగరాజు ఏమన్నాడో చూడు... సంగీత శాస్త్రజ్ఞానము సారూప్యసౌఖ్యదమేనసా... నియమనిష్ఠ యశోధనముకల్గనే నేర్పులగ త్యాగరాజు నేర్చిన సంగీతశాస్త్రజ్ఞానము" అని కృతి పాడేను.

"కృతి పూర్తి అయిందా?" అన్నాడు. "ఏమిటా తొందర?" అన్నా. "ఏమీలేదూ-దేశకాచారీ 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ' కొత్త కూర్పు ఇప్పుడే వచ్చింది. అందులో డొమెస్టిక్ ట్రాన్స్‌ఫరు గురించి ఏమివ్రాశాడో చూద్దాం అని" అన్నాడు.

"మీ లాయర్ల కెప్పుడూ ఇదే ఘోషకదా! ప్రపంచం అంతా మీకోసమే వుందనుకుంటారు!" అన్నా.

56 అతడు

దారంట పోయేవాళ్ళందరినీ ఇంట్లో తెచ్చి పెడుతుంది. మన కెందుకు ఒకరి గొడవ అంటే వినదు. మహా చెడ్డ అల్లరి వచ్చిపడింది! నేను సాయంత్రం ఇంటికొచ్చేసరికి ఎవరిదో కొత్త మొఖం కనిపించింది. ఓహో వెంకట్రామయ్యగారి అమ్మాయి కాంసును - అసలు ఇక్కడున్న పెద్ద కుటుంబాలే నాలుగో ఐదోనో తెలుగు వాళ్ళని - మనవాళ్ళందరితోను స్నేహంగా ఉండడం చాలామంచిది అనుకుని సంతోషిస్తే - తుమ్మలపల్లి వాళ్ళమ్మాయి కాదంటూ, ఆ పిల్ల వృత్తాంతం చెప్పుకొచ్చింది. ఎవరో పిల్లనో తీసికొని పోతూంటే, మనం మధ్యవర్తిత్వం చేస్తే మనకి చుట్టుకుంటుంది.

- ఇంకా వుంది.

కోరుకున్న ఉద్యోగం కొంచెంలో తప్పిపోయిందా ?



ఒక్క మార్కు కూడా రానప్పుడు ఎక్కువ బాధపడం కానీ, పాస్ అవ్వడానికి ఒక్క మార్కు తగ్గితే బాధపడతాం. ఒక్క పరుగు కూడా చేయనప్పుడు బాధపడం కానీ... సెంచరీకి ఒక్క పరుగు తగ్గితే బాధనిపిస్తుంది. అలాగే... అసలు ఉద్యోగం తెచ్చుకునే నైపుణ్యాలు మన దగ్గర లేకపోతే బాధపడం కానీ... ఆ స్కిల్స్ ఉండీ కొంచెంలో ఉద్యోగం చేజారిపోతే ఎంతో బాధపడతాం. అలా జరగకూడదంటే ఏయే విషయాల్లో ఏం గ్రహించాలి? ఏ జాగ్రత్తలు తీసుకోవాలి? ఒక మ్యాచ్‌లో 99 పరుగులు సాధించి అవుటై, తరువాతి మ్యాచ్‌లో ఒక పరుగు సాధిస్తే సెంచరీ అవ్వదు. మళ్లీ మొదటి పరుగు నుంచీ ప్రారంభించాల్సిందే కదా. ఉద్యోగ సాధన కూడా క్రికెట్ మ్యాచ్ లాంటిదే. ఎంపిక అయ్యేవారికీ అవ్వనివారికీ మధ్య తేడా చాలాసార్లు, 99కీ, 100కీ ఉన్నంతే ఉంటుంది. చూడటానికి ఒక్క పరుగే అనిపిస్తుంది. కానీ ఆ ఒక్క పరుగే భవిష్యత్తుని నిర్ణయిస్తుంది. 100కి ఉన్న విలువ 99కి ఉండదు. 100లో సంతృప్తి ఉంటుంది. 99లో సానుభూతి ఉంటుంది. 100లో సాధించాం అన్న ఆనందం ఉంటుంది. 99లో దగ్గరికి వచ్చి ఓడిపోయామన్న బాధ ఉంటుంది. ఉద్యోగాన్ని సంపాదించడంలోనూ దగ్గరగా వచ్చి కూడా ఎందుకు ఓటమిపాలయ్యామన్నది ఒకసారి ప్రశ్నించుకోవాలి.

ఉద్యోగం విషయంలో ఎంతోమంది ఎన్నో సలహాలు ఇస్తూ ఉంటారు. ఇంటర్వ్యూకి ఇలా వెళ్లాలి, ఈ విధంగా మాట్లాడాలి, రాత పరీక్షకు ఈ రకంగా సన్నద్ధమవ్వాలి, గ్రూప్ డిస్కషన్స్‌లో ఇలా ప్రవర్తించాలి, టెక్నికల్ ప్రశ్నలకు ఈ తీరులో సమాధానమివ్వాలి.. అంటూ ఎన్నో విలువైన సూచనలు ఇస్తూ ఉంటారు. ఆ సలహాలన్నీ పెద్దపెద్ద తప్పులు చేయకుండా ఉండేందుకు ఉపయోగపడతాయి. కానీ, తెలియకుండానే చిన్నచిన్నవీ, తెలిసీ తెలియనివీ తప్పులెన్నో చేస్తూ ఉంటాం.

ఎంత బాగా రాసినా, ఇంటర్వ్యూలో ఎంత బాగా మాట్లాడినా ఉద్యోగం ఎందుకు రావటంలేదో ఒక్కోసారి అర్థం కాదు.కొన్నిసార్లు మనకంటే తక్కువ చదివేవాళ్లు, మనకంటే తక్కువ నైపుణ్యాలు ఉన్నవాళ్లు కూడా ఎంపికైపోతుంటారు. అసలు ఎక్కడ పొరపాటు జరుగుతోందో ఎంత ప్రయత్నించినా తెలుసుకోలేక పోతుంటాం. అలా మనం తెలుసుకోలేని చిన్నచిన్న తప్పులే 'అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్' (అనవసరపు తప్పిదాలు). ఈ పొరపాట్లు రాత పరీక్షలో, గ్రూప్ డిస్కషన్స్‌లో, జస్ట్ ఎ మినిట్ (జామ్) రౌండ్‌లో, ఇంటర్వ్యూలో.. ఎక్కడైనా జరగొచ్చు. కాబట్టి మనమెంతో జాగ్రత్తగా ఉండాలి.

ఆ పొరపాట్లు ఏమిటో... అవి ఎక్కడెక్కడ జరిగే అవకాశం ఉందో తెలుసుకుందాం.

1. జామ్ (జస్ట్ ఏ మినిట్)

ఇందులో ఒక టాపిక్‌ను ఇచ్చి నిమిషంపాటు దాని గురించి మాట్లాడమంటారు. ఒక విద్యార్థిని జామ్‌లో తన రోల్ మోడల్ గురించి మాట్లాడమని అడిగారు. అతను 'రవీంద్రనాథ్ ఠాగూర్' గురించి అనర్గళంగా, ఆత్మవిశ్వాసంతో మాట్లాడాడు. తర్వాత ప్రకటించిన ఫలితాల్లో తన పేరు లేకపోవడం అతణ్ణి షాక్‌కి గురిచేసింది. ఎంత ఆలోచించినా తను ఎందుకు సెలెక్ట్ కాలేదో అర్థం కాలేదతడికి.

హెచ్‌ఆర్ అధికారిని కలిసి కారణం అడిగాడు. 'నువ్వు ఠాగూర్ గొప్పతనం గురించి బాగా మాట్లాడావ్. కానీ, ఆయన నీకెందుకు రోల్ మోడల్ అయ్యారో.. నువ్వేం స్ఫూర్తి పొందావో ఒక్క మాట కూడా చెప్పలేదు. అందుకే నిన్ను సెలెక్ట్ చేయలేదు' అని ఆయన వివరించాక రవికి అర్థమైంది. రోల్ మోడల్ ఘనత గురించి మాత్రమే కాదు, ఆ వ్యక్తి తనకెంత ప్రేరణ కలిగించారో కూడా మాట్లాడాల్సివుంటుందని బోధపడింది. తర్వాత రెండు నెలలకు వాళ్ల కాలేజీకి ఇంకో కంపెనీ వచ్చింది. అప్పుడు మళ్లీ రోల్ మోడల్ గురించే మాట్లాడమన్నారు. ఆ విద్యార్థి ఈసారి 'యువరాజ్ సింగ్' కాన్సర్‌తో ధైర్యంగా పోరాడిన విషయాన్ని ప్రస్తావిస్తూ అది తనలో స్ఫూర్తిని నింపిందనీ, మనిషి తలచుకుంటే ఏదైనా సాధించగలడనే నమ్మకం యువరాజ్ వల్లే తనకు వచ్చిందనీ చెప్పాడు. ఈసారి తర్వాతి రౌండుకు సెలక్ట్ అయ్యాడు. ధైర్యం చేసి హెచ్‌ఆర్ అధికారిని అడగడం వల్ల తప్పెక్కడ జరిగిందో అర్థమైంది. దాన్ని సరిదిద్దుకోగలిగాడు.

2. చర్చల్లో దూకుడొద్దు

చాలామంది జామ్‌లో చేసే తప్పులనే గ్రూప్ డిస్కషన్స్‌లోనూ పునరావృతం చేస్తుంటారు. టాపిక్ ఒకటైతే ఇంకేదో చెప్పడమో, హెచ్‌ఆర్‌ను మెప్పించడానికి ఎక్కువగా మాట్లాడటమో చేస్తుంటారు. ఒక్కోసారి మిగతావాళ్ల గురించి ఆలోచించకుండా మాట్లాడుతూనే ఉంటారు. ఇవన్నీ చాలా పెద్ద తప్పులు. ఎందుకంటే గ్రూప్ డిస్కషన్స్ ముఖ్యమైన ఉద్దేశమే మనం బృందంతో ఎలా ఉంటాం, టీంని లీడ్ చేసే సామర్థ్యం మనలో ఉందా లేదా అనేది తెలుసుకోవడం. కాబట్టి అందరికీ మాట్లాడే అవకాశం ఇవ్వాలి. అందరి మాటలూ వినాలి. ఎవరినీ కించపరుస్తూ మాట్లాడకూడదు. ఇవన్నీ పట్టించుకోకుండా ఎంత బాగా మాట్లాడినా సెలక్ట్ అయ్యే అవకాశాలు చాలా తక్కువ. అందుకే గ్రూప్ డిస్కషన్స్‌లో హుందాగా ప్రవర్తించాలి. నిరాడంబరంగా ఉండాలి. దూకుడు చూపిస్తే మార్కులను కోల్పోవాల్సి వస్తుంది.

3. రాతపరీక్ష (ఆప్టిట్యూడ్ టెస్ట్)

అన్ని రౌండ్ల కంటే ఎక్కువ తప్పులు.. చిన్నచిన్నవన్నీ ఇక్కడే చేస్తాం. ఎంతో పరిజ్ఞానం ఉన్నవాళ్లు కూడా ఇక్కడే విఫలమవుతుంటారు. అసలెక్కడ తప్పు జరుగుతోందో కూడా తెలుసుకోకుండా మళ్లీమళ్లీ చేసిన పొరపాట్లే చేస్తూ ఉంటారు. పోటీపరీక్షలకీ, కళాశాల పరీక్షలకూ చాలా తేడా ఉంటుంది. కాలేజీలో అకడమిక్ పరీక్ష పేపర్ ఈజీగా వస్తే 80-90% మార్కులు వస్తాయి. అందరూ మెచ్చుకుంటే సంతోషపడతాం. అదే పేపర్ కష్టంగా వస్తే 55-60% మార్కులు వస్తాయి. అందరూ తిడితే బాధపడతాం. అందుకే పేపర్ సులభంగా రావాలని కోరుకుంటాం. కానీ పోటీపరీక్షలు వేరు (క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో సహా). 'పేపర్ ఈజీగా ఉంది' అంటే ఆ పేపర్ మీకు మాత్రమే ఈజీ కాదు... మీతోపాటు పరీక్ష రాసే వాళ్లందరికీ ఈజీనే! మీకు 90% వస్తే మీతోపాటు అదే పరీక్ష రాసిన వాళ్లందరికీ 91%, 92%, 93% వచ్చే ఛాన్స్ ఉంది. అందుకే పేపర్ ఎంత ఈజీగా వచ్చినా... మీరెంత బాగా రాసినా.. మీతోపాటు రాసేవాళ్ల కంటే మీరు ముందున్నారా లేదా అనేదే ముఖ్యం. ఈ పోటీ ప్రపంచంలో పరుగు ఆపితే వెనుకబడిపోతాం, ఓడిపోతాం. అందుకే పరుగెడుతూనే ఉండాలి. అందరికంటే ముందుండాలి!

ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో అలా ఉండాలంటే 'డెసిషన్ మేకింగ్' చాలా ముఖ్యం. సాధారణంగా ఏ కంపెనీ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో అయినా 50 ప్రశ్నలుంటాయి. 30-40 నిమిషాల సమయాన్ని ఇస్తారు. ఆ 50 ప్రశ్నల్లో సుమారు 20 సులువు, 20 మధ్యస్థం, 10 కష్టంగా ఉంటాయి. పేపర్ మొత్తాన్ని సాధించడానికి కనీసం 75-80 నిమిషాలు పడుతుంది. కానీ ఇక్కడ ఇచ్చేది 30 నిమిషాలే. కాబట్టి, ముందుగా వేటిని చేయాలో నిర్ణయించుకోవాలి. ముందుగా తేలికైన వాటిని ఎంచుకుని సాధించాలి. ఆ తరువాత మధ్యస్థ ప్రశ్నలు చేయాలి. కష్టమైనవాటిని చేస్తే ఎక్కువ మార్కులేమీ ఇవ్వరు. బాగా కష్టమనిపించిన వాటిని వదిలేయవచ్చు. అవి తెలియక కాదు.. చేయడం ఇష్టం లేక వదిలేయాలి.

టెస్ట్ క్రికెట్‌లో రాహుల్ ద్రవిడ్ చాలా బంతులను వదిలేసేవాడు. ఎందుకు? క్రికెట్ రాక కాదు. ఆ బంతులు ఆడటం ఇష్టం లేక. అలా వదిలేస్తూ ఉంటే బౌలర్ విసిగిపోయి ఈజీ బాల్స్ వేస్తాడు. అప్పుడు సులువుగా స్కోర్ చేసుకోవచ్చు అన్న ఉద్దేశం ద్రవిడ్‌ది. సరిగా ఇదే కాన్సెప్టును ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో వాడాలి. కష్టమైన ప్రాబ్లమ్స్‌ను అన్నింటినీ వదిలేస్తే కచ్చితంగా సులువైనవి మిగులుతాయి. వాటిని తక్కువ సమయంలో సాధించవచ్చు. ఎక్కువ స్కోర్ చేయొచ్చు. ఇలా వేటిని సాధించాలి, వేటిని వదిలేయాలనే వాటి విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటే సులువుగా ఆప్టిట్యూడ్ రౌండ్‌ను పూర్తిచేయవచ్చు.



4. హాబీల గురించి...

ఒక అభ్యర్థి ఇంటర్వ్యూ వరకూ వచ్చాడంటే దాదాపుగా ఎంపికయిపోయినట్టే! ఇంటర్వ్యూకి హాజరయ్యేటప్పుడు ఫార్మల్ డ్రెస్సింగ్ ఉండాలి. అబ్బాయిలు గడ్డాన్ని నీట్‌గా ట్రిమ్ చేసుకోవడం, అమ్మాయిలు అతిగా మేకప్ వేసుకోకుండా ఉండటం లాంటివి అందరికీ తెలిసే ఉంటాయి. కానీ కొన్ని విషయాల్లో తెలియకుండానే తప్పులు చేస్తుంటాం. అవకాశాన్ని చివరి క్షణాల్లో పోగొట్టుకుంటుంటాం. అలాంటి వాటిలో..

▶ **అభిరుచులు :** రెజ్యూమేలో హాబీల గురించి రాసేప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. దానిలో రాసినవాటిపై ప్రశ్నలను కచ్చితంగా అడుగుతారు. హాబీ అంటే మనకు అది చాలా ఇష్టమైంది అని. ఆ పని చేయడంలో మనకెంతో ఆనందం ఉంటుంది అని. అందుకే హాబీ గురించి ఇంటర్వ్యూయర్ అడిగినపుడు చిరునవ్వుతో బదులివ్వాలి. దాని గురించి సంతోషంగా మాట్లాడాలి.

ఉదాహరణకు హాబీ 'క్రికెట్' అని రాశారనుకోండి. అప్పుడు క్రికెట్ గురించి ఏం అడిగినా చెప్పగలగాలి. బ్యాట్ సైజు, మొదటి ఇంటర్నేషనల్ మ్యాచ్ ఎక్కడ జరిగింది? ప్రపంచంలో పెద్ద స్టేడియం ఎక్కడుంది?... లాంటి ఏ ప్రశ్నకైనా సమాధానం రెడీగా ఉండాలి. అంతేకానీ... నాకు 'క్రికెట్‌లో బేసిక్స్ మాత్రమే తెలుసు' లాంటి సమాధానాల వల్ల రిజెక్ట్ అయ్యే అవకాశాలెక్కువ. సింగింగ్‌ను హాబీగా రాసినవాళ్లని గాయకుల పేర్లు, పాడమని అడగటం లాంటివి చేయవచ్చు. అలాగే కుకింగ్ అని చెబితే తయారీ విధానాన్ని అడగవచ్చు. అప్పుడు విసుక్కోకుండా నవ్వుతూ సమాధానాలు ఇవ్వడం ఎంతో ముఖ్యం!

▶ **సమయస్ఫూర్తి :** చాలాసార్లు ఇంటర్వ్యూల్లో అభ్యర్థి సమయస్ఫూర్తి (స్పాంటేనిటీ)ని పరీక్షిస్తుంటారు. అందుకు అనవసరమైన ప్రశ్నలు వేస్తుంటారు. అప్పుడు 'గుర్తు రావట్లేదు, ఆలోచిస్తున్నా' అని చెబితే తక్కువ అభిప్రాయం ఏర్పడుతుంది.

ఉదాహరణకు 'పొద్దున బ్రేక్ ఫాస్ట్‌లో ఏం తిన్నావ్? అని అడిగితే వెంటనే 'ఇడ్లీ' అని చెప్పెయ్యాలి. ఆలోచించకూడదు. ఎందుకంటే నువ్వు ఏం తిన్నావో ఇంటర్వ్యూయర్ వచ్చి చెక్ చేయరు కాబట్టి. 'నీకు ఇడ్లీ వడ్డించేటప్పుడు మీ అమ్మ ఏ రంగు గాజులు వేసుకుంది' అనడిగితే ఎక్కువ ఆలోచించకుండా 'గ్రీన్' అనో 'రెడ్' అనో చెప్పాలి.. వచ్చి చూడలేరు కాబట్టి. ఏ నంబర్ బస్సు ఎక్కి వచ్చావ్ అంటే ఏదో నోటికొచ్చిన నంబర్ చెప్పవచ్చు. ఇలాంటి ప్రశ్నలు పూరికే మన ఐక్యూను పరీక్షించడానికి అడుగుతుంటారు. ఇక్కడ కొంచెం అయోమయానికి గురైనా రిజెక్ట్ అయ్యే అవకాశాలే ఎక్కువ. ఇలా తీసుకునే కొన్ని జాగ్రత్తలు సులువుగా ఉద్యోగాన్ని తెచ్చుకోవడంలో సాయపడతాయి.

ఆశించిన కొలువును చేజార్చుకోకూడదంటే చిన్న విషయాల్లో కూడా జాగ్రత్తగా ఉండాలి.

ఆటోమొబైల్ ఇంజనీరింగ్ కోర్సు వివరాలు

ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో ఇంజనీరింగ్ మెకానిక్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్, మెకానిక్స్ ఆఫ్ సాలిడ్స్, మెటలర్జీ, మెటీరియల్ సైన్స్, మెషిన్ డ్రాయింగ్, ఆటోమోటివ్ ఇంజిన్స్, వెహికల్ డైనమిక్స్, ఆటో-ఎయిర్ కండిషనింగ్, ఆపరేషన్స్ రీసెర్చ్, క్యాడ్/కామ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్ తదితర సబ్జెక్టులు ఉంటాయి. ఆటోమొబైల్ ఇంజనీర్లు ఆటోమోటివ్ డిజైన్, డెవలప్‌మెంట్, ఇంజిన్స్, ఎయిర్ కండిషనింగ్, అప్లికేషన్, సర్వీస్ వంటి విభాగాల్లో పనిచేస్తారు. ఈ వృత్తిలో రాణించడానికి ఎనలిటికల్ స్కిల్స్, క్యాడ్/క్యామ్ అంశాలపై పట్టు ఉండాలి.

ఈ కోర్సు పూర్తిచేసుకున్న వారికి మారుతి, టాటా మోటార్స్, ఫోర్డ్, ఫియట్, టయోటా, హోండా, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి కంపెనీలు టాప్ రిక్రూటర్లుగా నిలుస్తున్నాయి.

ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో ఎంఎస్ చేయడానికి అత్యధిక మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్న దేశం జర్మనీ. 2011-12లో జర్మనీ విశ్వ విద్యాయాల్లో చదువుతున్న భారతీయుల సంఖ్య 5,998 కాగా, అది 2015-16కు 13,740కు చేరింది. ఈ సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ కోర్సుకు టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్, టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్ తదితర విశ్వవిద్యాలయాలు ప్రముఖమైనవి. ఇతర దేశాలతో పోల్చితే జర్మనీలో ఖర్చు చాలా తక్కువ. ఎంఎస్ కోర్సుకు అర్హత సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, జీఆర్ఈ, టోఫెల్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

పూర్తి వివరాలకు: www.daad.de

ఐఐఎఫ్‌టీ ఆఫర్ చేస్తున్న ఎంబీఏ కోర్సుల వివరాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ)కు దేశంలో న్యూఢిల్లీ, కోల్‌కతాలో క్యాంపస్‌లు ఉన్నాయి. దీన్ని భారత ప్రభుత్వం ఓ స్వయం ప్రతిపత్తి సంస్థగా 1963లో ఏర్పాటు చేసింది. విదేశీ వర్తక నిర్వహణలో మానవ వనరులను అభివృద్ధి చేసి, తద్వారా ఎగుమతులను పెంచేందుకు ఈ సంస్థ దోహదం చేస్తోంది.

ఆఫర్ చేస్తున్న కోర్సులు: రెండేళ్ల వ్యవధితో ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్-ఫుల్‌టైం); మూడేళ్ల వ్యవధితో ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్ -పార్ట్‌టైం) కోర్సులను ఆఫర్ చేస్తోంది.

అర్హతలు, ఎంపిక విధానం..

రెండేళ్ల ఎంబీఏ : ఏదైనా విభాగంలో మూడేళ్ల వ్యవధితో బ్యాచిలర్ డిగ్రీ. రాత పరీక్ష, ఎస్సే రైటింగ్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. విదేశీ విద్యార్థులు/ ఎన్నారై/ ఎన్నారై పిల్లలకు జనరల్ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీమ్యాట్) ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. రాత పరీక్షను మల్టిపుల్ ఛాయిస్ ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్, జనరల్ నాలెడ్జ్ అండ్ అవేర్‌నెస్‌బీ లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ అనాలిసిస్ అంశాల నుంచి ప్రశ్నలుంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో ఉంటుంది.

మూడేళ్ల ఎంబీఏ : బ్యాచిలర్ డిగ్రీతో పాటు కనీసం మూడేళ్ల పని అనుభవం. కంపెనీ స్పాన్సర్‌షిప్/ఉద్యోగం చేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్. గ్రూప్ డిస్కషన్, ఎస్సే రైటింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐఎఫ్‌టీ ఆఫర్ చేస్తున్న ఇతర కోర్సులు: ఇంటర్నేషనల్ బిజినెస్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్‌బీ క్యాపిటల్ అండ్ ఫైనాన్షియల్ మార్కెట్స్ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా. ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్‌బీ క్యాపిటల్ అండ్ ఫైనాన్షియల్ మార్కెట్స్; గ్లోబల్ ట్రేడ్ లాజిస్టిక్స్ అండ్ ఆపరేషన్స్‌లో సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఐఐఎఫ్‌టీ పీహెచ్‌డీని కూడా ఆఫర్ చేస్తోంది.

వెబ్‌సైట్ : http://tedu.iift.ac.in/iift/index.php

తెలంగాణలో 521 అసిస్టెంట్ సివిల్ సర్జన్ పోస్టులు



తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టరేట్... 521 అసిస్టెంట్ సివిల్ సర్జన్, 7 డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

విద్యార్హత : పోస్టులనుబట్టి ఎంబీబీఎస్/ బీడీఎస్.

వయసు : 2017, జూలై 1 నాటికి 18-44 ఏళ్ల లోపు ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా అయిదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక : మొత్తం 100 మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. 75 మార్కులు అర్హత పరీక్షలో సాధించిన అగ్రిగేట్ మార్కులకు, మిగతా మార్కులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన తెలంగాణలో ఉద్యోగం చేస్తున్న వారికి, వారి సర్వీస్, పని చేస్తోన్న ప్రాంతం ఆధారంగా వెయిటేజీ ఇస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు : డిసెంబర్ 20 నుంచి జనవరి 18 వరకు.

వెబ్‌సైట్ : http://dophfw.cgg.gov.in

ఎన్‌సీఆర్ఐలో డాక్టోరల్ ఫెలోషిప్స్

హైదరాబాద్‌లోని నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్‌సీఆర్ఐ).. రూరల్ స్టడీస్‌లో పరిశోధనలు చేసే అభ్యర్థుల నుంచి 2018- 19కి గాను డాక్టోరల్ ఫెలోషిప్స్‌కు దరఖాస్తులు కోరుతోంది.

కాల వ్యవధి : మూడేళ్లు.

ఫెలోషిప్ : రూ.16,000. అలాగే కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.15,000 అదనంగా ఇస్తారు.

పరిశోధన విభాగాలు : రూరల్ కమ్యూనికేషన్, రూరల్ మేనేజ్‌మెంట్, రూరల్ సోషల్ వర్క్, రూరల్ సోషియాలజీ, రూరల్ టూరిజం, రూరల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, రూరల్ ఎడ్యుకేషన్ తదితర రూరల్ స్టడీస్ అంశాలు.

అర్హతలు : సంబంధిత విభాగాల్లో పరిశోధనలకు ఏదైనా విద్యాసంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి. అలాగే

స్కాలర్‌షిప్‌లు

సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం (ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు 50 శాతం) మార్కులతో పీజీ/ తత్సమాన విద్య, నెట్/ స్లెట్/ ఎంఫిల్.

వయసు : దరఖాస్తు సమర్పణ గడువు నాటికి 40 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ ఓబీసీ/ మహిళ అభ్యర్థులకు ఐదేళ్లు సడలింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం : వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కవరులో ఉంచి 'మెంబర్ సెక్రెటరీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్‌సీఆర్ఐ), సాకార్ భవన్, ఫతేమైదాన్ రోడ్, బషీర్‌బాగ్, హైదరాబాద్-500004' చిరునామాకు గడువులోగా పంపాలి. లేదా fellowship.ncri@gmail.com మెయిల్ ఐడీకి మెయిల్ చేయాలి.

దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: జనవరి 25, 2018.

వెబ్‌సైట్ : www.ncri.in

ఐహెచ్‌బీటీలో 45 ఫెలోషిప్స్

సీఎస్ఐఆర్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ బయోరీసోర్స్ టెక్నాలజీ (ఐహెచ్‌బీటీ).. 45 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : ప్రాజెక్ట్ అసిస్టెంట్ లెవెల్-ఐ (పీఏ-ఐ)-14; ప్రాజెక్ట్ అసిస్టెంట్ లెవెల్-ఐఐ (పీఏ-ఐఐ))-30; జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-1.

స్టైపెండ్ : పీఏ-ఐకు రూ.15,000; పీఏ- ఐఐకు రూ.25,000; జేఆర్ఎఫ్‌కు రూ.25,000.

అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ ఎంఎస్సీం నెట్-ఎల్ఎస్/ జీప్యాట్/ బ్యాచిలర్ డిగ్రీ.

వయసు : ఇంటర్వ్యూ తేదీ నాటికి పీఏ-ఐ, జేఆర్ఎఫ్‌కు 28 ఏళ్లు; పీఏ-ఐఐకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : వాకిన్ ఇంటర్వ్యూ.

దరఖాస్తు విధానం : వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి నేరుగా వాకిన్ ఇంట ర్వ్యూకు నేరుగా వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.

వాకిన్ ఇంటర్వ్యూ తేదీలు : జేఆర్ఎఫ్‌కు జనవరి 17, 2018బీ పీఏ-ఐఐ (ప్రాజెక్టును బట్టి)కు జనవరి 17, 18, 2018; పీఏ-ఐకు జనవరి 19, 2018.

వాకిన్ వేదిక : సీఎస్ఐఆర్-ఐహెచ్‌బీటీ, పాలంపూర్, కాంగ్రా డిస్ట్రిక్, హిమాచల్ ప్రదేశ్.

వెబ్‌సైట్ : www.ihbt.res.in

బీఆర్ఏపీ 2017లో బెంగాల్ టాప్

కోల్‌కతా: పారిశ్రామిక విధాన, ప్రోత్సాహక విభాగం (డీఐపీపీ) రూపొంది స్తున్న వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక (బీఆర్ఏపీ) 2017 జాబి తాలో పశ్చిమ బెంగాల్ ప్రస్తుతం 86.18 శాతంతో అగ్రస్థానంలో కనిపిస్తు న్నది. తుది జాబితాను డీఐపీపీ ప్రకటించాల్సి ఉండగా, రెండు రోజుల్లో బెంగాల్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ జరుగనున్న క్రమంలో శనివారం పీటీఐ ద్వారా తాజా వివరాలు వెల్లడయ్యాయి. ఇక ఈ లిస్టులో ఇప్పటివరకు ఉన్న సమాచారం మేరకు తెలంగాణ నాలుగో స్థానంలో ఉండగా, ఆంధ్ర ప్రదేశ్ ఎనిమిదో స్థానంలో ఉన్నది. తమ వ్యాపార సంస్కరణల అమలుకు సంబంధించి దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పంపే వివరాల ఆధారంగా డీఐపీపీ ఎప్పటికప్పుడు ఈ జాబితాలో సవరణలు చేస్తూంటుంది. కాగా, 2016లో డీఐపీపీ ప్రకటించిన జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్న విషయం తెలిసిందే. నాడు బెంగాల్ 15వ స్థానంలో నిలిచింది.

అమెజాన్‌లో 6,500 కొత్త ఉద్యోగాలు

న్యూఢిల్లీ: ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా త్వరలో తాత్కాలికంగా 6,500 ఉద్యోగులను నియమించనుంది. జనవరి 20-24 తేదీల మధ్య అమెజాన్ 'గ్రేట్ ఇండియా సేల్'ను నిర్వహించనుంది. ఇందులో భాగంగా వచ్చే ఆర్డర్లను వినియోగదారులను అందజేసేందుకు తాత్కాలికంగా ఈ ఉద్యోగ నియామకాలు చేపట్టనుంది. అమెజాన్ ఇండియా పరిధిలోని నెట్‌వర్క్ సెంటర్లు, వచ్చిన ఆర్డర్లను పరిశీలించి వస్తువులను సిద్ధం చేయటం, డెలివరీ స్టేషన్లు సహా పలు విభాగాల్లో 5,500 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు అమెజాన్ ఇండియా ఉపాధ్యక్షుడు (కస్టమర్ ఫుల్‌ఫిల్‌మెంట్)అఖిల్ సక్సేనా తెలిపారు.గ్రేట్ ఇండియా సేల్‌లో భాగంగా వచ్చే ఆర్డర్లను దృష్టిలో పెట్టుకుని వినియోగదారుల సేవా కేంద్రంలో మరో 1,000 అసోసియేట్లను నియమించనున్నట్లు ఆయన తెలిపారు. కొత్త నియామకాల ద్వారా సంస్థకు అదనపు బలం చేకూరడంతో పాటు, వినియోగదారులకు వేగంగా వస్తువులను బట్వాడ చేయడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూరు సహా అన్ని మెట్రో నగరాల్లో ఈ నియమాకాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. అమెజాన్ ఇండియాకు దేశవ్యాప్తంగా 41 నిర్వహణ కేంద్రాలు, 25 సార్టేషన్ సెంటర్లు, సుమారు 150 డెలివరీ కేంద్రాలు, 350 సర్వీస్ పార్టనర్ కేంద్రాలు ఉన్నాయి.

బడ్జెట్‌పై కోటి ఆశలు

- వరాల కోసం 13 కీలక రంగాల ఎదురుచూపులు



న్యూఢిల్లీ: మరో రెండున్నర నెలల్లో కొత్త ఆర్థిక సంవత్సరం మొదలు కానుంది. దీని కోసం ఇంకో 17 రోజుల్లో కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభ మయ్యే 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. అయితే దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే 13 కీలక రంగాలు ఈ బడ్జెట్‌పై కోటి ఆశలు పెట్టుకొని ఆత్రంగా ఎదురు చూస్తున్నాయి.

స్టాక్ మార్కెట్లు

వినియోగ సామర్థ్యం పెరుగాలని, మధ్య తరగతి ప్రజలకు పన్ను మినహాయింపులు పెంచాలని, గ్రామీణ ఆధారిత పథకాలకు పెద్ద ఎత్తున కేటాయింపులు జరుపాలని స్టాక్ మార్కెట్ వర్గాలు కోరుతున్నాయి. జీఎస్టీ అమలు నేపథ్యంలో ద్రవ్యలోటు లక్ష్యాలను కొంత సడలించుకుంటే మంచిదన్న అభిప్రాయాల్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకులు

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు ఆర్థికంగా చేయూత లభించేలా బడ్జెట్‌లో కేటాయింపులుండాలని, మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించాలని బ్యాంకర్లు కోరుతున్నారు. ఇండ్ల కొనుగోళ్లు పెరిగేలా, చౌక గృహ ప్రాజెక్టులకు దోహదపడేలా అటు కస్టమర్లకు, ఇటు రియల్టర్లకు అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని, దీర్ఘకాలిక ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలివ్వాలంటున్నారు.

ఎన్‌బీఎఫ్‌సీలు

బడ్జెట్‌లో తమకూ కేటాయింపులు పెరుగాలంటున్నాయి బ్యాంకింగేతర ఫైనాన్స్ కంపెనీలు. బంగారం దిగుమతిపై సుంకం పెంచితే, మార్కెట్‌లో ధరలు పెరిగి గోల్డ్ ఫైనాన్స్ సంస్థలకు ఇబ్బందిగా ఉంటుందంటున్నాయి. గృహ, ఇతరత్రా రుణాలపై వడ్డీ రాయితీలు పెంచాలని సూచిస్తున్నాయి.

ఎఫ్ఎంసీజీ

గ్రామీణ, ఎంఎస్ఆర్ఈజీఏకు కేటాయింపులు పెరిగితే తమకు లాభసాటిగా ఉంటుందంటున్నాయి ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) సంస్థలు. వినియోగ సామర్థ్యం పెరిగి కొనుగోళ్లు అధికమవుతాయని ఆశిస్తున్నాయి. వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబుల్లో మార్పులు, పన్ను రేట్లలో కోతలు కూడా వ్యాపారానికి కలిసొస్తాయంటున్నాయి.

చమురు, గ్యాస్

వంటగ్యాస్, కిరోసిన్‌లపై రాయితీ భారం ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో రూ.9,000 కోట్లకు చేరడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సుంకాన్ని తగ్గించాలని చమురు మార్కెటింగ్ సంస్థలు కోరుతున్నాయి.

మౌలిక సదుపాయాలు

రోడ్లు, రైల్వేలు, హౌసింగ్, గ్రామీణాభివృద్ధి రంగాలకు ఈసారి 10-12 శాతం అధికంగా కేటాయింపులు జరుపాలని సంబంధిత మంత్రిత్వ శాఖలు జైట్లీని కోరుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడకుండా, త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలంటున్నాయి.

టెలికం

ప్రధాన మౌలిక రంగ హోదాను టెలికం పరిశ్రమ ఆశిస్తున్నది. దేశీయంగా టెలికం, ఐటీ పరికరాల తయారీకి ఊతకొత్త పద్దుపై కోటి ఆశలు ఈసారి బడ్జెట్‌లో 13 కీలక రంగాలు కోరుతున్నదేమిటి? మిచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుండటాన్ని స్వాగతిస్తున్న టెలికం ఆధారిత సంస్థలు.. టెలికం ఉత్పత్తుల దిగుమతిపై కస్టమ్స్ సుంకం మినహాయింపును ప్రభుత్వం ఉపసంహరించుకుంటుందని ఆశిస్తున్నాయి.

రియల్ ఎస్టేట్

అన్నింటికీ ఏకగవాక్ష (సింగిల్ విండో) విధానంలోనే అనుమతులివ్వాలని, మొదటి సారిగా ఇండ్లను కొనుగోలు చేసేవారికి ప్రోత్సాహకాలు ప్రకటించాలని నిర్మాణ రంగం కోరుతున్నది. జీఎస్టీ రేటును తగ్గించాలని కూడా డిమాండ్ చేస్తున్నది.

మెటల్

మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహిస్తూ దేశీయ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచాలని, అందరికీ ఇండ్లు, రహదారులు వంటి మౌలిక రంగ ప్రాజెక్టులకు మరిన్ని నిధులను కేటాయించాలని మెటల్ కంపెనీలు కోరుతున్నాయి.

విద్యుత్

అందరికీ విద్యుత్, ఐపీడీఎస్, డీడీయూజీజేవై తదితర పథకాలకు నిధుల కేటాయింపు పెరుగాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడుతున్నాయి. ఎలక్ట్రిక్ ఆధారిత వాహనాల తయారీ, వాడకాన్ని ప్రోత్సహించాలంటున్నాయి.

ఔషధ పరిశ్రమ

హాస్పిటల్ ప్రాజెక్టుల పెట్టుబడులపై పన్ను ప్రయోజనాలను పదేండ్లకు పెంచాలని కోరుతున్నాయి. ప్రాధాన్యత రంగం నుంచి మౌలిక రంగానికి ఔషధ పరిశ్రమల హోదాను మార్చాలని, మెరుగైన రుణ సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలంటున్నాయి.

విమానయానం

జీఎస్టీ పరిధిలోకి విమానయాన ఇంధనం (ఏటీఎఫ్) వస్తుందన్న అంచనాలున్నాయి. ఎయిరిండియా ప్రైవేటీకరణకు కార్యాచరణ ప్రణాళిక ఉంటుందని, ఏరోస్పేస్ తయారీకి ఊతమిచ్చేలా నిధులను కేటాయిస్తారని, విమానాశ్రయాల ఆధునికీకరణ వేగవంతం అవుతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

టెక్నాలజీ

కార్పొరేట్ పన్ను రేటును 25 శాతానికి తగ్గించాలి, స్టార్టప్‌లకు ఊతమివ్వాలి, కొత్త తరహా పెట్టుబడులను ప్రోత్సహించాలి, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నవే ప్రధానంగా టెక్నాలజీ రంగం ఆశిస్తున్నది.

దివ్యాంగుల కుటుంబాలకు పన్ను రాయితీలు పెంచాలి

దివ్యాంగుల కుటుంబాలకు పన్ను ప్రయోజనాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సూచించింది. వచ్చే ఏడాది ఎన్నికలు జరుగనున్న క్రమంలో ఈసారి బడ్జెట్.. చివరి పూర్తికాల బడ్జెట్ కావడంతో ఇంకా నెరవేరని 2014 ఎన్నికల వాగ్దానాలపై మోదీ సర్కారు దృష్టి సారించింది. ఇందులో భాగంగానే అంశాలవారీగా ఆయా మంత్రిత్వ శాఖల సూచనలు, సలహాలను కోరింది. ఈ నేపథ్యంలోనే దివ్యాంగుల కుటుంబాలకు వారి వైద్యం, శిక్షణ, పునరావాసాల వ్యయంపై పన్ను ప్రయోజనాలను పెంచాలని సదరు మంత్రిత్వ శాఖ సూచించింది.

ప్రస్తుతం 80 శాతం కంటే తక్కువ, 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారి ఖర్చులపై రూ.75,000 వరకు పన్ను మినహాయింపు న్నది. 80 శాతం పైబడినవారికి రూ.1,25,000 వరకు లబ్ధి చేకూరుతున్నది. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, తోబుట్టువుల అంగవైకల్యానికి చేసే ఖర్చులపై సెక్షన్ 80డీడీ కింద పన్ను మినహాయింపులు అందుతున్నాయి. అలాగే హిందూ అవిభాజ్య కుటుంబానికైతే అందులో సభ్యులై ఉన్నవారికి వర్తిస్తున్నాయి.

చిల్లర విపణిలోకి ఎఫ్‌డీఐలు వినాశకరం

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ హెచ్చరిక



న్యూఢిల్లీ: ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదించిన చిల్లర విపణిలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవేశం వినాశనకరమైనదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ హెచ్చరించారు. ఎఫ్‌డీ ఐల ప్రవేశంతో కొత్త ఉపాధి కల్పన జరగదన్నారు. ఉపాధి కల్పన జరుగుతుందంటూ ప్రభుత్వం చెప్పే మాటలకు తగిన హామీ ఏమిటని ప్రభుత్వాన్ని నిల దీశారు. కార్మిక వ్యయాన్ని కనిష్ఠ స్థాయిలో ఉంచేందుకు విదేశీ పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతారుతప్ప అధిక ఉపాధి కల్పన మీద కాదన్నారు. ఇలాంటి స్థితిలో చిల్లర విపణిలోకి నూరుశాతం ఎఫ్‌డీఐలను ఆహ్వానించడమంటే ఉపాధి మార్కెట్‌ను దెబ్బతీయడమేనన్నారు. ఎంతసేపూ పారిశ్రామిక వర్గ ప్రయోజనాల పరిరక్షణకే ప్రభుత్వం ప్రాధాన్య తనిస్తోందని విమర్శించారు. పరిశ్రమ యజమానుల కన్నా కార్మిక సంఖ్య అధికంగా ఉందన్న సంగతిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. పెద్ద నోట్ల రద్దు కారణంగా లక్షలాది మంది జీవనోపాధి కోల్పో యారని కౌర్ చెప్పారు. రానున్న బడ్జెట్లో ఉపాధి కల్పనకు అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టాలని ప్రభుత్వానికి కౌర్, మరో కార్మిక సంఘం సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌లు విజ్ఞప్తి చేశారు. నష్టపోయిన ఉద్యోగాలతో పాటుగా కొత్త కొలువుల కల్పనకూ సానుకూలత కల్పించే విధంగా బడ్జెట్లో కేటాయింపులు జరపడం ద్వారా కార్మికులను ఆదుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన నైపుణ్య శిక్షణ పథకం ఉపాధి కల్పనకు ఉపయోగపడదన్నారు. హైస్కూలు స్థాయిలో వృత్తివిద్యా శిక్షణ అమలు జరిపితే ఉపాధి భరోసా ఉంటుందన్నారు. సంపద పన్నును విస్మరించడం సహేతుకం కాదన్నారు. సంపద పన్నును అమల్లోకి తేవడం ద్వారా సంపద సృష్టిని తిరిగి సామాజిక రంగానికి, ఉపాధి కల్పనకూ వెచ్చించే వెసులుబాటు లభిస్తుందన్నారు.

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్‌కి ఆత్మీయ స్వాగతం




ఢిల్లీ: భారత్ పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఇవాళ ఢిల్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ బెంజమిన్ నెతన్యాహుకు ఢిల్లీ ఎయిర్ పోర్టులో స్వాగతం పలికారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి మరీ ఢిల్లీ ఎయిర్ పోర్టుకు వెళ్లడం విశేషం. భారత్ కు చేరుకున్న నెతన్యాహును ప్రధాని మోదీ ఆత్మీయ ఆలింగనం చేసుకొని స్వాగతం పలికారు.

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి మోదీ తీన్ మూర్తి చౌక్‌కు వెళ్తారు. అక్కడ జరుగనున్న కార్యక్రమంలో ఇరు దేశాధినేతలు పాల్గొంటారు. ఈ సందర్భంగా తీన్ మూర్తి చౌక్ పేరును తీన్ మూర్తి హైఫీ చౌక్‌గా మార్చనున్నారు. నెతన్యాహు పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ ఇవాళ రాత్రి ఆయనకు ప్రత్యేక విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు. నెతన్యాహు వెంట ముంబై పేలుళ్ల నుంచి సురక్షితంగా బయటపడిన 11ఏళ్ల బాలుడు మోషే కూడా భారత్ వచ్చాడు. బెంజమిన్ భారత్ లో 6 రోజులపాటు పర్యటించనున్నారు.

జోరందుకున్న పారిశ్రామికం

- 17 నెలల గరిష్ఠానికి వృద్ధి
- నవంబర్‌లో 8.4 శాతంగా నమోదు



న్యూఢిల్లీ: దేశ పారిశ్రామిక ప్రగతి చక్రాలు పరుగులు తీస్తున్నాయి. నవంబర్‌లో పారిశ్రామిక వృద్ధిరేటు ఏకంగా 17 నెలల గరిష్ఠ స్థాయిని తాకింది. తయారీ, క్యాపిటల్ గూడ్స్ రంగాల్లో నెలకొన్న జోరుతో వృద్ధి 8.4 శాతానికి చేరుకున్నదని కేంద్ర గణాంకాల సంస్థ (సీఎస్ఓ) శుక్రవారం వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వృద్ధి 5.1 శాతంగా ఉంది. జూన్ 2016లో పారిశ్రామిక ప్రగతి 8.9 శాతం కనబరిచింది. ఇప్పటి వరకు ఇదే గరిష్ఠ స్థాయి. గతేడాది అక్టోబర్‌కు సంబంధించిన ఐఐపీ గణాంకాలను కేంద్రం 2.2 శాతం నుంచి 2 శాతానికి సవరించింది. పారిశ్రామిక ప్రగతిలో 77.63 శాతం వాటా కలిగిన తయారీ రంగం అంచనాలకుమించి 10.2 శాతం వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణమని విశ్లేషించింది. తయారీ రంగంలో ఫార్మాస్యూటికల్స్, మెడిసినల్ కెమికల్స్, బొటానికల్ ఉత్పత్తుల్లో 39.5 శాతం వృద్ధిని కనబరుచగా, అలాగే కంప్యూటర్లలో 29.1 శాతం, ఎలక్ట్రానిక్, ఆప్టికల్ ప్రొడక్టుల విభాగంలో 22.6 శాతం పెరుగుదల కనిపించింది. అలాగే పెట్టుబడులకు కీలకంగా మారిన క్యాపిటల్ గూడ్స్ రంగం 5.3 శాతం నుంచి 9.4 శాతానికి పుంజుకున్నది. వినియోగదారులేతర ఉత్పత్తుల విభాగం 23.1 శాతం వృద్ధిని కనబరిచాయి. 2016 నవంబర్ నెలలో ఇది కేవలం 3.3 శాతంగా ఉన్నది. కానీ గనులు, విద్యుత్ రంగాలు మాత్రం నిరాశాజనక పనితీరును నమోదు చేసుకున్నాయి. గనుల్లో వృద్ధి 8.1 శాతం నుంచి 1.1 శాతానికి పడి పోగా, అదే విద్యుత్ ఉత్పత్తిలో 9.5 శాతం నుంచి 3.9 శాతానికి జారుకున్నట్లు సీఎస్ఓ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి.

డిసెంబర్‌లో 5.21 శాతానికి పెరిగిన ఆహార ద్రవ్యోల్బణం

ధరాఘాతం నుంచి కొన్ని నెలలుగా ఉపశమనం పొందిన సామాన్యులపై ఆహార పదార్థాల రూపంలో పిడుగు పడింది. డిసెంబర్ నెలకుగాను రిటైల్ టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 17 నెలల గరిష్ఠ స్థాయి 5.21 శాతా నికి చేరుకుంది. ఆహార పదార్థాల తోపాటు కోడిగుడ్లు, కూరగాయల ధరలు భగ్గుమనడమే ఇందుకు కారణమని కేంద్ర గణాంకాల శాఖ విశ్లేషించింది. రిజర్వు బ్యాంక్ నిర్దేశించుకున్న స్థాయికంటే అధికంగా నమోదవడంతో ఫిబ్ర వరి 7న ప్రకటించనున్న పరపతి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు సన్నగిల్లాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 3.41 శాతంతో పోలిస్తే ఇంచుమించు రెండు రెట్లు పెరిగినది. అలాగే నవంబర్ 2017లో సూచీ 4.88 శాతంగా నమోదైంది. ఆహార పదార్థాలకు సంబంధించిన సూచీ 4.42 శాతం నుంచి 4.96 శాతానికి చేరుకుంది. జూలై 2016లో 6.07 శాతంగా ధరల సూచీ నమోదైంది.

ధరల భారం

- 5.21 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- 17 నెలల గరిష్ఠానికి చేరిక
- జీఎస్టీ తర్వాత వరుస పెరుగుదల
- కొనుగోలు శక్తికి దెబ్బ.. వడ్డీ రేట్ల తగ్గింపునకు అడ్డంకి
- బడ్జెట్‌కు ముందు ధరాఘాతం



విశాలాంధ్ర-బిజినెస్ డెస్క్: ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో ధరల రాకాసి కోరలు తెరుస్తోంది. కేంద్ర బడ్జెట్‌కు ముందు ధరాఘాతంలా తగిలిన ట్టయింది. కాగా ఆహారోత్పత్తులు, చమురు ధరలు అమాంతం పెరగడంతో క్రితం డిసెంబర్‌లో వినియోగదారుల రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ (సీపీఐ) అమాంతం 5.21 శాతానికి ఎగిసిందని శుక్రవారం కేంద్ర గణం కాల శాఖ స్వయంగా వెల్లడించింది. దీంతో ద్రవ్యోల్బణం సూచీ 17 మాసాల గరిష్ఠ స్థాయికి చేరినట్లయింది. కాగా 2017 నవంబర్‌లో సీపీఐ 4.88 శాతంగా నమోద య్యింది. 2016 ఇదే డిసెంబర్‌లో 1.37 శాతంగా ఉంది. గత నెలలో కూరగాయలు, గుడ్లు, పండ్ల ధరలు భారీగా పెరగడంతో ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోశాయి. గత డిసెంబర్‌లో కూరగాయాల ధరలు ఏకంగా 29.13 శాతం పెరిగాయి. ఇంతక్రితం నెలలో 22.48 శాతం ప్రియమ య్యాయి. పప్పుల ధరలు మాత్రం స్వల్పంగా తగ్గాయి.

ఒకే దేశం ఒకే పన్ను జీఎస్టీతో ధరలు దిగివస్తాయని పదే పదే చెప్పిన మోడీ సర్కార్‌కు చెంపదెబ్బలెఅఉ కొడుతూ ద్రవ్యోల్బణం ఎగిసిపడుతోంది. నోట్ల దెబ్బతో ధరలు పెరగడానికి తోడు జులై నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత పరిస్థితి మరీ భయానకంగా తయారైంది. జూన్‌లో 1.54 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ క్రమంగా పెరుగుతూ డిసెంబర్ నెలలో ఏకంగా 5.21 శాతానికి ఎగిసింది. జులై 2016 తర్వాత అత్యధికంగా నమోదు కావడం ఇదే తొలి సారి. ఇప్పటికే పెరిగిన ధరలు ప్రజల కొనుగోలు శక్తిని హరిస్తున్నాయి. మరింత పెరగడంతో భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థలో మరిన్ని ప్రతికూల పరిణామాలు చోటు చేసుకోనున్నాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

డిసెంబర్ సీపీఐ 5.10 శాతానికి చేరొచ్చని రాయిటర్స్ పోల్‌లో అంచనా వేసింది. అంతకంటే ఇంకా ఎక్కువగానే నమోదు కావడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి మార్చి కాలంలో ద్రవ్యోల్బణం సూచీ 4.3 శాతం నుంచి 4.7 శాతం మధ్య ఉంటుందని రిజర్వు బ్యాంకు అంచనా వేసింది. మధ్యస్థ కాలానికి స్థూలంగా 4 శాతంగా అంచనా వేసింది. తాజాగా పెరిగిన సిపిఐతో వడ్డీ రేట్ల తగ్గింపునకు ప్రధాన అడ్డంకి కానుంది. వచ్చే ఫిబ్రవరి 7న రిజర్వు బ్యాంకు ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహించనుంది. ఇందులో వడ్డీ రేట్లపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

పెరిగిన పారిశ్రామికోత్పత్తి..

గత ఏడాది నవంబర్‌లో పారిశ్రామికోత్పత్తి 8.4 శాతానికి పెరిగి 17 మాసాల గరిష్ఠ స్థాయికి చేరింది. 2016 నవంబర్‌లో 5.1 శాతం వృద్ధి నమోదైంది. కాగా అక్టోబర్ ఐఐపీని 2 శాతంగా సవరించింది. ఇంతక్రితం దీన్ని 2.2 శాతంగా పేర్కొంది. ఐఐపీలో 77.63 శాతంగా ఉన్న తయారీ రంగం గత నవంబర్‌లో ఏకంగా 10.2 శాతం వృద్ధిని కనబర్చి, పారిశ్రామికోత్తత్తికి ప్రధాన మద్దతునిచ్చింది. 2016 నవంబర్‌లో ఐఐపీ వృద్ధి 4 శాతంగా నమోదయ్యింది.

రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ..

జూన్‌లో 1.54 శాతం
జులైలో 2.36 శాతం
ఆగస్టులో 3.36 శాతం
సెప్టెంబర్‌లో 3.28 శాతం
అక్టోబర్‌లో 3.58 శాతం
నవంబర్‌లో 4.88 శాతం
డిసెంబర్‌లో 5.21 శాతం

రైతులకు ప్రయోజనాలు చేరితేనే జీడీపీ వృద్ధి సమర్థనీయం

అరుణ్ జైట్లీ వెల్లడి



న్యూఢిల్లీ: వ్యవసాయ రంగం మీద ఆధారపడిన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు చేరితేనే జీడీపీ వృద్ధి రేటు సమర్థనీయమువుతుందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. వ్యవసాయ రంగంలో ఫలితాలు స్పష్టంగా ఉండాలన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైట్లీ మాట్లాడుతూ తమ ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాల్లో వ్యవసాయ రంగం కూడా ఒకటిగా ఉందని గుర్తు చేశారు. దేశంలో వ్యవసాయ రంగం మీద అత్యధిక జనాభా ఆధారపడిన సంగతిని ఆయన అంగీకరించారు. అధికోత్పత్తుల కారణంగానే రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. అమలు ప్రతిపాదన యోచనలో ఉన్న ఐచ్ఛిక వాణిజ్యం ద్వారా రైతులకు ప్రయోజనం దక్కుతుందన్నారు.కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) వెల్లడించిన సమాచారం ప్రకారం 2017-18 ఆర్థిక సంవత్సర వృద్ధిరేటు నాలుగేళ్ల కనిష్ఠానికి పతనమై 6.5శాతంగా ఉంటుందని అంచనా. వ్యవసాయ, తయారీ రంగాల్లో పేలవ ప్రదర్శన కారణంగా మోడీ సర్కారు పాలనలో తక్కువ వృద్ధి రేటు నమోదు కావడం ఇది రెండవ సారి.

అంతిమ దశకు ఐడియా-వొడాఫోన్ విలీనం

ప్రతిపాదనకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం



న్యూఢిల్లీ: ఐడి యా సెల్యు లర్, వొడాఫోన్ సంస్థల విలీనా నికి దాదాపు అన్ని అడ్డం కులు తొలగి పోయాయి. ఈ ప్రతిపాదనకు ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్) ఆమోదం తెలిపింది. దీంతో ఈ విలీనానికి సంబం ధించిన అంతిమ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ఈ రెండు టెలి కం సంస్థలు చేరువయ్యాయి. వొడాఫోన్ మొబైల్ సర్వీసెస్ లిమిటెడ్, వొడా ఫోన్ ఇండియా లిమిటెడ్, ఐడియా సెల్యులర్ లిమిటెడ్ సంస్థల విలీనానికి అనుమతిస్తున్నట్లు ఈ నెల 11న జారీ చేసిన ఉత్తర్వులో ఎన్‌సీఎల్‌టీ ప్రకటించిందని ఐడియా సెల్యులర్ శుక్రవారం రెగ్యులేటరీ నోట్‌లో వెల్లడిం చింది. ఈ విలీన విషయమై వొడాఫోన్ చేసిన విజ్ఞప్తిని కూడా ఎన్‌సీఎల్‌టీ ఇప్పటికే ఆమోదించినందున ఇక ఈ రెండు గ్రూపులు తుది అనుమతి కోసం టెలికం విభాగాన్ని (డీఓటీ) ఆశ్రయించేందుకు వీలుంటుంది. టెలికం నియంత్రణా సంస్థ ట్రాయ్ (టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం సంయుక్తంగా 40 కోట్ల మందికి పైగా మొబైల్ ఖాతాదారులను కలిగివున్న ఈ రెండు సంస్థలు దేశీయ టెలికం మార్కెట్‌లో అత్యధిక వాటాను కలిగి ఉన్నాయి. ఈ రెండు సంస్థల విలీనం తర్వాత ఏర్పడే కొత్త సంస్థ ఆదాయం దాదాపు రూ.7,500 కోట్ల నుంచి రూ.80, 000 కోట్లుగా ఉంటుందని, ఈ విలీన సంస్థలో వొడాఫోన్ 47.5 శాతం వాటాను, ఆదిత్యా బిర్లా గ్రూప్ ఆధ్వర్యంలోని ఐడియా సెల్యులర్ మిగిలిన వాటాను కలిగి ఉంటాయని భావిస్తున్నట్లు టెలికం మార్కెట్ వర్గాలు తెలిపాయి.

మళ్లీ నాణేల ముద్రణ

- వారం తిరక్కుండానే వెనక్కి తగ్గిన కేంద్రం
- నిదానంగా ముద్రించాలంటూ మింట్లకు ఆదేశం



కోల్‌కతా: నాణేల ముద్రణ పూర్తిగా నిలిపి వేయాలన్న నిర్ణయం నుంచి కేంద్ర ప్రభుత్వం వారం రోజులు తిరక్కుం డానే వెనక్కి తగ్గింది. నాణేల ఉత్పత్తిని మళ్లీ ప్రారంభించాలని, అయితే నిదానంగా ఆ పని చేయాలని దేశంలోని నాలుగు మింట్లకు కేంద్రం స్పష్టం చేసినట్లు ఆ పరిశ్రమ వర్గాలు శనివారం వెల్లడించాయి. వేర్వేరు ముఖ విలువలు కలిగిన నాణేలను ముద్రించాల్సిందిగా కోల్‌కతా, ముంబై, నోయిడా, హైదరాబాద్‌లలో నాలుగు ప్రభుత్వ మింట్లను నడుపుతున్న ఎస్‌పీఎంసీఐఎల్ (సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్)కు ప్రభుత్వం ఈ ఆదేశాలను జారీ చేసిందని, అయితే ఇందుకోసం గతంలో మాదిరిగా రోజుకు రెండు షిఫ్టుల్లో కాకుండా కేవలం ఒక్క షిఫ్టులో మాత్రమే పనిచేయాలని ప్రభుత్వం స్పష్టం చేసిందని, దీంతో శుక్రవారం నుంచి తాము మళ్లీ నాణేల ముద్రణను ప్రారంభించామని కోల్‌కతా మింట్ ఉద్యోగుల సంఘం వైస్‌ప్రెసిడెంట్ బిజాన్ దే వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 771.20 కోట్ల నాణేలను ముద్రించాల్సిందిగా ప్రభుత్వ మింట్లకు రిజర్వు బ్యాంకు ఇండెంట్ ఇచ్చిందని, వీటిలో 590 కోట్ల నాణేలను ఇప్పటికే ఉత్పత్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. దేశంలో నాణేలు ఇప్పటికే సమృద్ధిగా అందుబాటులో ఉండటం, నాణేలను నిల్వచేసేందుకు తగినంత చోటు కూడా లేకపోవడంతో వాటి ఉత్పత్తిని తక్షణమే నిలిపివేయాలని ఈ నెల 9వ తేదీన ఎస్‌పీఎంసీఐఎల్‌ను ఆదేశించిన కేంద్రం కనీసం వారం రోజులు కూడా గడవకుండానే ఈ విషయంలో వెనక్కి తగ్గడం గమనార్హం.

ఎయిరిండియా ఉద్యోగులకు ప్రత్యామ్నాయం?



ఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగానే ఎయిరిండియాలో విదేశీ కంపెనీలు 49శాతం పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవలే కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఎయిరిండియాలో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎయిరిండియాను ప్రైవేటీకరిస్తే అందులో పనిచేసే ఎంతో మంది తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందని ఇప్పటికే ఆందోళన వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. అలా కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఎయిరిండియాలో పనిచేస్తున్న ఉద్యోగులను వేరే ప్రభుత్వ రంగ సంస్థల్లోకి తీసుకోవడం, వాలంటరీ రిటైర్‌మెంట్ ప్యాకేజ్ ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం చేస్తున్నట్లు సమాచారం. అయితే.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులతో కలిపి మొత్తం 29వేల మంది పనిచేస్తున్నారు. ఎయిరిండియాను ప్రైవేటీకరణ చేయడం వల్ల వీళ్లంతా తమ ఉద్యోగాలను కోల్పోయే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పలు ఎయిరిండియా యూనియన్స్ పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

ఎయిరిండియాలో 49శాతం వరకు విదేశీ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఆమోదం తెలుపుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఈనెల 10న నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎయిరిండియాలో పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఆసక్తి కనబరుస్తోంది. వీటికి తోడు 2018 చివరి కల్లా ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను పూర్తి చేస్తామని పౌరవిమానాయాన శాఖ సహాయమంత్రి జయంత్ సిన్హా వెల్లడించారు. ఇదిలా ఉంటే ఎయిరిండియాను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు నిలిపివేయాల్సిందిగా పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రతిపాదించింది. ఇప్పుడిప్పుడే ఎయిరిండియా లాభాల బాటలో పయనిస్తోంది.. దానికి మరికొన్ని సంవత్సరాలు సమయం ఇస్తే అప్పుల ఊబి నుంచి కోలుకునే అవకాశం ఉందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది.

గొంతు మంటను తగ్గించే 10 సహజ చిట్కాలు

గొంతులో నొప్పితో, చిరాకుతో బాధపడుతున్నట్లయితే ఎవరికైనా ఆందోళనగా ఉంటుంది. గొంతు నొప్పి చాలా సాధారణంగా వచ్చే వ్యాధి. 80శాతం మంది కనీసం ఏడాదికి ఒకసారైనా సాధారణమైన జలుబును (లేదా) ఫ్లూ బారిన పడుతున్నారు, అలానే వాటితో పాటు ఎంతో బాధాకరమైన గొంతునొప్పిని సమస్యను కూడా ఎదుర్కొంటున్నారు. నిజానికి, గొంతునొప్పి అనేది కూడా సాధారణ జలుబు (లేదా) ఫ్లూ లక్షణాల వంటిది కావచ్చు. అయితే, ఇది ఇతర ఆరోగ్య పరిస్థితులను కూడా సూచిస్తుంది. గొంతునొప్పి అనేది శ్వాసకోశ నాళంలో పాటు గొంతులో కూడా వైరస్ (లేదా) బ్యాక్టీరియాలతో నిర్మితమైన ఒక సమూహమని చెప్పవచ్చు. పైన తెలిపిన ప్రక్రియలో ఇన్ఫెక్షన్లు, మంటల ఫలితంగా గొంతు పొడి బారాడం, గొంతులో దురదగా ఉండటం, నొప్పిని కలిగి ఉండటం, పుండ్లు పడటం, ఆహారాన్ని, నీటిని మింగడంలో కష్టం వంటి ఇతర లక్షణాలకు కారణమవుతుంది. సాధారణంగా గొంతు నొప్పి జ్వరం, దగ్గు, జలుబు వంటివి ఎదురైన పరిస్థితుల్లోనూ, ఫ్లూ (లేదా) మైక్రోబయల్ ఇన్ఫెక్షన్ వంటి పరిస్థితుల్లోనూ ఎదురయ్యే ఒక లక్షణంగా చెప్పవచ్చు. మీరు తీవ్రమైన గొంతునొప్పితో చాలాకాలంగా బాధపడుతున్నట్లయితే అది టాన్సిల్స్, లైంగిక సంక్రమణ వ్యాధులు లేదా క్యాన్సర్ వంటి పెద్ద ఆరోగ్య సమస్యలను సూచిస్తుంది. అందువల్ల పైన తెలిపిన సందర్భంలో, మీరు వెంటనే ఒక ప్రొఫెషనల్‌ను సంప్రదించడం చాలా ముఖ్యం. ఔషధాలతో పాటుగా, గొంతుకు సంబంధించిన గార్లింగ్ ద్రవాలను ఉపయోగించడం వల్ల, కొన్ని రకాల సూక్ష్మజీవుల వలన సంభవించిన గొంతు ఇన్ఫెక్షన్లను పోగొట్టి, మళ్లీ మీ గొంతును సహజమైన స్థితికి తీసుకురావడానికి సహాయపడుతుంది. గొంతునొప్పి పోగొట్టేందుకు ఇక్కడ కొన్ని సహజమైన గార్లింగ్ చిట్కాలు ఉన్నాయి, ఇవి గొంతునొప్పిని సహజంగానే నయం చేస్తాయి. వాటిని మీరు కూడా ఒకసారి చూడండి.



ఉప్పు నీటితో పరిహారం :

చాలా యుగాలకు ముందు నుండి దీనిని అన్ని ఇళ్లలో ఉపయోగించే అత్యంత సాధారణమైన గొంతునొప్పి నివారణులలో ఒకటి. ఇది చాలా ప్రభావవంతమైనది కూడా. వేడినీటిలో 1-2 టేబుల్ స్పూన్ల ఉప్పును కలిపి సుమారు 5 నిముషాల పాటు గార్గిలింగ్ చెయ్యడం వల్ల గొంతునొప్పికి కారణమైన బ్యాక్టీరియాను ఉప్పు చంపడం వల్ల, మీ గొంతుకు చికిత్సను చేయవచ్చు.



అల్లం కషాయం :

ఈ అల్లం కషాయాన్ని గార్గిలింగ్ చెయ్యడం వల్ల మీ గొంతులోని సూక్ష్మజీవులను చంపి, గొంతు వాపును తగ్గించడం ద్వారా గొంతునొప్పి నుండి మీకు ఉపశమనం కలిగించవచ్చు. ఒక కప్పు వేడినీటిలో 1 టీ స్పూను తేనెను, టీ స్పూను పంచదారను, 1 టీ స్పూను పంచదారను కలిపిన పానీయాన్ని తయారు చెయ్యాలి. దీన్ని నోటిలో వేసుకొని 5 - 10 నిమిషాల వరకూ పుక్కిలించిన తర్వాత బయటకు ఊసెయ్యాలి.

కైయేన్ పెప్పర్ లిక్విడ్ :

ఈ చిట్కాను మొట్టమొదటగా ప్రయోగించేటప్పుడు భయానకంగా అనిపించవచ్చు, కాని ఇది చాలా అద్భుతంగా పని చెయ్యగలదని నిరూపణ అయింది. కైయేన్ పెప్పర్‌లో గొంతునొప్పిని తగ్గించే అద్భుతమైన యాంటీబాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంది. రెండు చిటికెల కైయేన్ మిరియాల పొడిని వేడి నీటిలో వేసి బాగా కలిపి, రెండు నిముషాలు పాటు గార్గిలింగ్ చెయ్యండి. ఊరగాయలో చేర్చండి. ఇలా రోజుకు రెండు సార్లు చేయటం వల్ల మీ గొంతు మొదట మంటగా ఉండవచ్చు, కానీ తర్వాత మీ గొంతును చాలా సాధారణమైన స్థితికి తీసుకురాగలదు.

వెనిగర్ చిట్కా :

వెనిగర్, అసాధారణమైన యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగిన వంట పదార్ధంగా ఉంటూ మీ గొంతునొప్పికి చికిత్సను అందచేస్తుంది. ఒక కప్పు వేడి నీటిలో రెండు టీస్పూన్ల వెనిగర్‌ను జోడించండి. ఈ మిశ్రమాన్ని ఐదు నిమిషాల పాటు మీ గొంతుతో ఉంచి, బాగా పుక్కిలించండి.

పెప్పర్మిట్ ఆయిల్ :

పెప్పర్మిట్ ఆయిల్ మీ గొంతునొప్పి లక్షణాలను త్వరగా తగ్గించడంలో సహజసిద్ధమైనదిగా, చాలా ప్రభావవంతమైనదిగా ఉంటుంది. ఒక కప్పులో వేడి నీటిలో పెప్పర్మిట్ ఆయిల్ 4-5 చుక్కలను వేసి, ఐదు నిమిషాల పాటు గార్గిలింగ్ చెయ్యండి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తూ మీ గొంతునొప్పి పోతుంది.

బేకింగ్ సోడాతో చిట్కా :

బేకింగ్ సోడాలో ఉన్న సమ్మేళనాలు కూడా గొంతు సమస్యలకు దారితీసే లక్షణాలను ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో విజయం సాధించగలదని నిరూపించారు. టీస్పూన్ ఉప్పు, టేబుల్ స్పూన్ బేకింగ్ సోడాను ఒక కప్పులో వేడి నీటిలో వేసి కలపండి. గొంతు నొప్పి లక్షణాలు పూర్తిగా తగ్గే వరకూ ఈ మిశ్రమాన్ని ప్రతిరోజూ ఐదు నిమిషాల పాటు గార్గిలింగ్ చేయండి.

పసుపు పొడితో చిట్కా :

ఈ చిట్కా ఆయుర్వేదంలో సిఫారసు చేశారు. సైన్స్ కూడా సమర్థించింది. ఎందుకంటే పసుపు గొంతులో ఉన్న బాక్టీరియాను చంపగల శక్తివంతమైన, సహజసిద్ధమైన యాంటీ బాక్టీరియల్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఒక కప్పు వేడి నీటిలో ఒక టేబుల్ స్పూన్ పసుపును కలపాలి. అలా కలిపిన పానీయంతో 5-10 నిమిషాల వరకూ గార్గిలింగ్ చెయ్యాలి.

మెంతుల చిట్కా :

మెంతులు మంచి శక్తివంతమైన ఆహార పదార్థాలలో ఒకటి. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంటుంది. గొంతునొప్పికి చికిత్సను చేయడంతో పాటు, ఇది శోథ నిరోధక లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. ఒక కప్పు వేడి నీటిలో ఒక టేబుల్ స్పూన్ మెంతుల పొడిని బాగా కలిపి, ఈ పానీయాన్ని ఐదు నిముషాలపాటు మీ గొంతులో ఉంచి, బాగా పుక్కిలించి బయటకు ఉసేయ్యండి.

లవంగ నూనె :

గొంతు ఇన్ఫెక్షన్‌కు కారణమైన బ్యాక్టీరియాలను నివారించేందుకు చికిత్స చేయడంలో లవంగ నూనె చాలా బాగా ఉపయోగపడుతుంది. ఒక కప్పు వేడి నీటిలో 4-5 చుక్కల లవంగ నూనె చేర్చి, దానిని మీ గొంతులో 5 నిముషాల పాటు పుక్కిలించి ఉసేయడం వల్ల, గొంతుమంట ప్రభావాలను తగ్గించడానికి సహాయపడుతుంది.

టమోటా జ్యూస్ :

టమోటాలో పుష్కలంగా దొరికే విటమిన్-సి, లైకోపీన్ అనే ఈ రెండూ విశేషమైన అంశాలను మీ గొంతును ప్రభావితం చేసే బాక్టీరియాను చంపడంలో సహాయపడుతుంది. కప్పు టమోటా రసంలో కప్పు నీటిని జోడించి, ఈ మిశ్రమాన్ని బాగా వేడి చేయండి. ఈ మిశ్రమాన్ని 5 నిమిషాలు పాటు మీ గొంతులో ఉంచి బాగా పుక్కిలించి ఉసేయండి.



బాలల ఆరోగ్యానికి జపాన్ పద్ధతులు ఉత్తమం

పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని అందరమూ కోరుకుంటాం. వాళ్లు బాగా తినాలని, మంచిగా ఎదగాలని ఆకాంక్షిస్తాం. కానీ పిల్లల తిండి విషయంలో ప్రతి ఇల్లూ రోజూ రణరంగాన్నే తలపిస్తుంది. తినటానికి మొండికేసే పిల్లలు కొందరైతే, పెట్టింది పూర్తిగా తినకుండా వదిలేసేవారు ఇంకొందరు. అది కావాలని, ఇది కావాలని గొంతెమ్మ కోరికలతో వేధించేవారు మరికొందరు. దీంతో పిల్లలకు తిండి తినిపించే సరికి చాలామంది తల్లిదండ్రులకు చుక్కలు కనిపిస్తుంటాయి. మరోవైపు- సరిగ్గా తినకపోవటం వల్ల తగినన్ని పోషకాలు అందక పిల్లల ఎదుగుదల సైతం కుంటుపడుతోంది. ఒక్క మనదగ్గరే కాదు, చాలాదేశాల్లోనూ ఇలాంటి పరిస్థితి కనబడుతోంది. కానీ జపాన్ పిల్లలు మాత్రం చాలా ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటుండటం విశేషం. మిగతా దేశాలతో పోలిస్తే జపాన్ పిల్లల్లో ప్రూబకాయం కూడా చాలా తక్కువే. దీనికి ప్రధాన కారణం అక్కడి జీవనశైలి, ఆహార పద్ధతులేనని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఇంతకీ జపాన్ పిల్లల తిండి విషయంలో అక్కడివాళ్లు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు? దీనిలోని కిటుకులేంటి?

ఆనందిస్తూ తినటం

పిల్లలు ఇష్టపడుతూ, ఆనందంగా తినేలా చేయటం చాలా జపాన్‌లోని ఇళ్లలో తరచుగా కనబడే దృశ్యం. దీంతో ఆహారం కూడా మరింత రుచిగానూ అనిపిస్తుంది. అలాగే ఆదరాబాదరాగా కాకుండా విశ్రాంతిగా, వీలైనంత వరకు తృప్తిగా తినేలా చూడటం మరో ముఖ్య విషయం. పిల్లలకు ఇష్టమైన చిరుతిళ్లు, మిఠాయిల వంటివి ఇచ్చినా.. వాటిని మితంగా, అప్పుడప్పుడు మాత్రమే ఇస్తుంటారు. దీంతో ఉత్త కేలరీలతో కూడిన పదార్థాలను తగ్గించినట్టూ అవుతోంది.

చిన్న చిన్న పళ్లాలు

ఒకేసారి పెద్దమొత్తంలో ఆహారం పెట్టేస్తే పిల్లలకు మొహం మొత్తుతుంది. అదే వారినే ఎంచుకోమంటే? తక్కువ తక్కువగానే తీసుకున్నా కూడా ఎంచుకున్నది ఇష్టంగా తింటారు. అందుకే జపాన్‌లో పిల్లలకు చిన్న పళ్లాలు చేతికివ్వటం, ఇష్టమైనవి తీసుకునేలా ప్రోత్సహించటం మంచి ప్రభావం చూపుతున్నాయి. ఎంత తీసుకోవాలనేది పిల్లలకే వదిలేస్తే తక్కువగా తీసుకోవటానికే ఇష్టపడతారు. దీంతో సమయానికి ఆకలి వేస్తుంది కూడా. ఆహారమూ వ్యర్థం కాదు.

ఆరుబయట ఆటలు

వీడియోగేమ్స్ వంటి వాటి నుంచి పిల్లలను దూరంగా ఉంచటం కష్టమే. కానీ వారికి రోజుకు కనీసం 60 నిమిషాల సేపు శారీరక శ్రమ కూడా అవసరమే. అందువల్ల పిల్లలను వీలైనప్పుడల్లా ఆరుబయట ఆడుకునేలా చూడటం మంచిది.



సుకుమార్‌తో మహేష్..!



ప్రస్తుతం క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, రామ్ చరణ్ హీరోగా రంగస్థలం సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను మార్చి 30న రిలీజ్ చేయనున్నారు. ఈ సినిమా తరువాత సుకుమార్ ఓ క్రేజీ ప్రాజెక్ట్‌కు రెడీ అవుతున్నాడన్న ప్రచారం జరుగుతోంది. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా వన్ నేనొక్కడినే సినిమాను తెరకెక్కించిన సుకుమార్ మరోసారి మహేష్ హీరోగా ఓ సినిమా చేసే ఆలోచనలో ఉన్నాడట. ఇప్పటికే మహేష్‌కు ఓ లైన్ వినిపించి ఓకె చేయించుకున్నాడన్న టాక్ వినిపిస్తోంది. రంగస్థలం రిలీజ్ అయిన వెంటనే మహేష్‌తో చేయబోయే సినిమా పనులు ప్రారంభించనున్నాడు సుకుమార్. ప్రస్తుతం మహేష్ బాబు, కొరటాల శివ దర్శక త్వంలో భరత్ అనే నేను సిని మాలో నటిస్తున్నాడు. పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా తరువాత వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నాడు.



'ఎంఎల్ఏ' టీజర్ విడుదల

నందమూరి కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎంఎల్ఏ'. 'మంచి లక్షణాలు ఉన్న అబ్బాయి' అన్నది ఉప శీర్షిక. ఆదివారం భోగి సందర్భంగా సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. టీజర్‌లో 'వస్తున్నాడు వచ్చేస్తున్నాడు.. మన అందరి ఆశాజ్యోతి, ఆంధ్రజ్యోతి, ఈనాడు, నమస్తే తెలంగాణ..' అన్న డైలాగ్ సినిమాపై ఆసక్తి రేకెత్తిస్తోంది. ఎమ్మెల్యే గెటప్‌లో స్టైల్‌గా కళ్లద్దాలు పెట్టుకోవడం, కండువా వేసుకోవడం ఆకట్టుకుంటోంది. ఇందులో కల్యాణ్‌రామ్‌కి జోడీగా కాజల్ అగర్వాల్ నటిస్తున్నారు. 'లక్ష్మీ కల్యాణం' తరువాత కల్యాణ్‌రామ్, కాజల్ జంటగా నటిస్తున్న రెండో చిత్రం ఇది. ఉపేంద్ర ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. భరత్ చౌదరి, కిరణ్ రెడ్డి ఈ సినిమాకు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మార్చ్‌లో ఈసినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మరోపక్క కల్యాణ్ రామ్ 'నా నువ్వే' సినిమాతో బిజీగా ఉన్నారు. ఇందులో ఆయన తమన్నాకు జోడీగా నటిస్తున్నారు. కాజల్ 'పారిస్ పారిస్' అనే తమిళ చిత్రంలో నటిస్తున్నారు. బాలీవుడ్‌లో వచ్చిన 'క్వీన్' సినిమాకు ఇది రీమేక్‌గా రాబోతోంది.



అంజలి న్యూ లుక్

నాని సర్‌ప్రైజ్ ఇదే..



సంక్రాంతి సందర్భంగా నాని సర్‌ప్రైజ్ వచ్చేసింది. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కృష్ణార్జున యుద్ధం'. భోగి పండుగ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను నాని ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. ఫస్ట్‌లుక్‌లో నాని కోపంగా చూస్తూ కన్పించారు. మేర్లపాక గాంధీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్, రుక్సర్ కథానాయికలు. వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ట్విట్టర్ వేదికగా ఈ సినిమాకు సంబంధించిన కీలక ప్రకటన చేశారు. 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. 'ఎంసీఏ'ను పెద్ద సక్సెస్ చేసినందుకు ధన్యవాదాలు. మామూలుగా ఓ సినిమా విడుదలకు దాదాపు నెల రోజులు ముందుగా ఫస్ట్‌లుక్, ఫస్ట్ సాంగ్ విడుదల చేస్తుంటాం. మేం ముందే ఆ పాటను చూస్తుంటాం. ఫస్ట్‌లుక్ కూడా సిద్ధమైపోయి ఉంటుంది. ఇదంతా ఎవరి కోసం చేస్తున్నామో..వాళ్లని ఎందుకు చివరి వరకు ఎదురుచూసేలా చేయడం అని మొన్న నాకు అనిపించింది. మనకు అన్నింటి కన్నా పెద్ద పండుగ సంక్రాంతి. భోగి రోజున కృష్ణ, సంక్రాంతి రోజున అర్జున్ ఫస్ట్‌లుక్‌లను, కనుమ రోజు సినిమాలోని ఫస్ట్‌సాంగ్‌ను మీరు చూడబోతున్నారు. మీ అందరికీ నచ్చుతాయని ఆశిస్తున్నాను. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు.

నాగశౌర్యకు మెగా సపోర్ట్



కెరీర్ మొదట్లో వరుస సక్సెస్‌లు సాధించిన నాగ శౌర్య ఈ మధ్య కాస్త డల్ అయ్యాడు. ప్రస్తుతం వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్న రొమాంటిక్ డ్రామా ఛలో అనే మూవీ చేస్తున్నాడు. ఈ చిత్రంలో నాగ శౌర్య సరసన రష్మిక మందన కథానాయికగా నటిస్తుంది. ఐరా క్రియేషన్స్ పతాకంపై నాగశౌర్య తల్లి ఉషా ముల్పూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మధ్య విడుదలైన టీజర్, సాంగ్స్‌కి మంచి రెస్పాన్స్ రాగా త్వరలో సినిమాకి సంబంధించిన మరి కొన్ని పాటలని ప్రీ రిలీజ్ వేడకలో విడుదల చేయాలని భావిస్తున్నారట. ఈ ప్రీ రిలీజ్ వేడుక జనవరి 25న జరగనుండగా, కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిధిగా హాజరు కానున్నారని నాగ శౌర్య తన ట్విట్టర్ ద్వారా తెలియజేశారు.

వయోలెంట్ పోలీస్ ఆఫీసర్‌గా జ్యోతిక



ఒకప్పుడు టాప్ హీరోయిన్‌లలో ఒకరిగా ఉన్న జ్యోతిక, తమిళ హీరో సూర్యని వివాహం చేసుకున్న తర్వాత సినిమాలకి దూరంగా ఉంది. 36 వయోదినిలే చిత్రంతో వెండితెరకి రీ ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్ళు సాధించింది. ప్రస్తుతం తాను మంచి స్క్రిప్ట్‌లని ఎంచుకుంటూ వైవిధ్యమైన సినిమాలు చేస్తుంది. ఐకానిక్ ఫిలిం మేకర్ బాలా డైరెక్షన్‌లో నాచియార్ అనే సినిమా చేస్తుంది జ్యోతిక. ఈ చిత్రం ఫీమేల్ సెంట్రిక్ మూవీగా ఉంటుందని సమాచారం. ఇటీవల ఈ మూవీ టీజర్ విడుదల కాగా ఇందులో జ్యోతిక అవతారం, ఆమె చెప్పిన డైలాగ్స్ ప్రేక్షకులకి షాక్‌ని కలిగించాయి. ఇక తాజాగా చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. క్రూరమైన పోలీసాఫీసర్ పాత్రలో జ్యోతిక లుక్.. ఆమె నటన.. యాటిట్యూడ్ అన్నీ కూడా సంచలనం రేపేలా ఉన్నాయి. నువ్వు పోలీసువా.. రౌడీవా అంటూ ఉన్నతాధికారి అడగడం, ఒక రౌడీ విలవిలలాడుతున్నట్లు చూపించడం.. వెంటనే జ్యోతిక నోట్లో బ్లేడ్ కనిపించడాన్ని బట్టి బాలా ఆమె పాత్రను ఎలా చూపించాడో తెలుస్తోంది.

ఈ చిత్రంలో సంగీత దర్శకుడు జి.వి.ప్రకాష్ కుమార్ కూడా ఓ కీలక పాత్ర పోషించాడు. ఇతని పాత్ర ఫన్నీగా ఉండడంతో పాటు ఆసక్తిని కలిగిస్తుంది. క్రైమ్ డ్రామా మూవీగా రూపొందిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది.

టీచర్ దెబ్బకు వినికిడిశక్తి కోల్పోయిన విద్యార్థి

న్యూఢిల్లీ : స్కూల్‌లో లెక్కల టీచర్ కొట్టిన చెంపదెబ్బలకు వినికిడి శక్తిని కోల్పోయాడో విద్యార్థి. ఈ సంఘటన ఢిల్లీలోని భాయి పర్మానంద్ విద్యామందిర్‌లో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థి మూడో తరగతి చదువుతున్నాడు. లెక్కలు రాలేదన్న కోపంతో టీచర్ అతని చెంపపగలగొట్టింది. ఈ క్రమంలో ఆ బాలుడి కుడిచెవి కర్ణభేరికి బలమైన గాయమైంది. బాధిత విద్యార్థి తల్లిదండ్రులు టీచర్‌పై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. తమ బిడ్డను ఆమె కొట్టడం ఇది తొలిసారి కాదని, ఆమెను వెంటనే ఉద్యోగంలో నుంచి తొలగించాలని డిమాండు చేస్తున్నారు. గతేడాదిలో ఆమె కొట్టిన దెబ్బలకు బాబు భుజం వద్ద ఎముక జరిగిపోయిందని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఆ అక్కసుతోనే ఆమె తమ కుమారుడిని టార్గెట్ చేస్తోందన్నారు. ఇప్పుడు ఆమె దెబ్బల వల్ల తమ బిడ్డ కుడిచెవి శాశ్వతంగా వినిపించకుండా పోయిందని, అతను వినికిడిశక్తిని కోల్పోయాడని డాక్టర్ చెప్పారన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ అజయ పాల్ సింగ్ స్పందిస్తూ నిందిత టీచర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. అంతర్గత కమిటి వేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ వ్యవహారమంతా సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయిందని, క్లిప్పింగుల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేయాలని భాధితులు కోరుతున్నారు.


సంఘటనను వివరిస్తున్న విద్యార్థి తల్లి



భోపాల్ టీచర్ల గుర్తింపు పోరు.. శిరోముండనంతో నిరసన

భోపాల్ : తమను రెగ్యులర్ టీచర్లుగా గుర్తించాలన్న డిమాండుతో భోపాల్‌లోని లక్షలాది మంది టెంపరరీ టీచర్లు నిరసనబాట పట్టారు. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) జంబూరీ మైదానం వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్న వీరంతా శిరోముండనం చేయించుకొని రాష్ట్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు యత్నించారు. వీరిలో నలుగురు మహిళా టీచర్లు ఉండడం గమనార్హం . ఆజాద్ అధ్యాపక్ సంఘ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు శివరాజ్ వర్మ మాట్లాడుతూ శిల్పిసివన్ (మవ్), సీమా క్షిర్‌సాగర్ (అలీరాజ్‌పూర్), అర్చనా శర్మ (జబల్‌పూర్), రేణుకా సాగర్ (రైసెన్)లు ముందు వరసలో ఉన్నట్టు తెలిపారు. కత్తిరించిన జట్టును సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ భార్యకు బహూకరించేందుకు యత్నించగా సీఎం నివాసం వద్ద అధికారులు తమను అడ్డుకున్నారన్నారు. ' మేం ఏ విభాగానికి చెందినవారమో అర్థం కావడం లేదు. మేం స్థానిక సంఘాల ఉద్యోగులమని విద్యావ్యవస్థ చెబుతోంది. కానీ స్థానిక సంఘాలేమో మేం విద్యావిభాగపు ఉద్యోగులమంటోంది. 2.88లక్షలకుపైగా టెంపరరీ టీచర్లు ఈ చిక్కుముడిని విప్పేందుకు యత్నిస్తున్నారు. కొన్నేళ్లుగా తమ గుర్తింపు కోసం పోరాడుతున్నారు' అని వర్మ అన్నారు.

10 నెలలు.. 9 నోటీసులు



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి 10నెలలు గడిచింది. బీజేపీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టాక ఆ రాష్ట్రంలో నేరాలు రోజు రోజుకూ పెరుగుతుండటం ఒక ఎత్తయితే.. మానవహక్కులు హరించేలా ఎన్‌కౌంటర్లూ పెరుగుతున్నాయి. అనేక నేరాల ఘటనలకు సంబంధించి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఈ పది నెలల కాలంలో యోగి సర్కార్‌కు తొమ్మిది నోటీసులను జారీ చేసింది. బూటకపు ఎన్‌కౌంటర్, ఈవ్‌టీజింగ్, గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి దాదాపు వంద మంది పసికందుల మృతిచెందిన ఘటనలకు సంబంధించినవి కూడా ఇందులో ఉన్నాయి. ఈ తొమ్మిదింటిలో అత్యధిక నోటీసులు చీఫ్ సెక్రెటరీ పేరుతో ప్రభుత్వానికి అందినవే. బారాబంకిలో వైద్యుడులేక వార్డ్‌బాయే ప్రజారోగ్య కేంద్రాన్ని నడుపుతున్న ఘటనకు సంబంధించి ఈ నోటీసులు అందుకున్న వాటిలో తాజాది. ఈ సమస్యలను ప్రభుత్వం విస్మరించరాదని ఉత్తర ప్రదేశ్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్, సమాజ్‌వాది పార్టీ అధికార ప్రతినిధి జూహీ సింగ్ అన్నారు. 'కింది స్థాయి అధి కారులు కొందరిపై సస్పెన్షన్ వేటువేయడం, లేదా దర్యాప్తు కమిటీలను వేసి చేతులు దులుపుకుంటున్నారు. గోరఖ్‌పూర్ సహా ఇతర అంశాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి' అన్నారు. 'మానవ హక్కుల కమిషన్ ఒక రాజ్యాంగ సంస్థ. మేం దానిని గౌరవిస్తాం. కమిషన్ దాని పని అది చేస్తున్నది. ప్రభుత్వం కూడా తన పని తాను చేస్తున్నది. మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందా లేదా అనేది దర్యాప్తులో తేలుతుంది. అదే సమయంలో నేరస్తులతో జరిగిన ఎన్‌కౌం టర్‌లో పోలీసులు కూడా మృతిచెందారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ వారిపై కూడా సానుభూతి చూపాలి' అని బీజేపీ అధికార ప్రతినిధి షలాభ్ మని త్రిపాఠి చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వానికి ఎన్‌హెచ్ఆర్‌సీ అందించిన నోటీసుల వివరాలు

యోగి సర్కార్ నిర్వాహకమిదే....

2017 ఏప్రిల్10 : గ్రేటర్ నోయిడాలోని ఎన్ఎస్‌జీ సొసైటీలో పోలీసులు దర్యాప్తు పేరుతో ఆఫ్రికన్ పౌరులను వేధించినట్టు వచ్చిన ఆరోపణలపై గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, పోలీసు సూపరింటెండెంట్‌కు నోటీసులు.

2017 ఆగస్టు14 : ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ నియోజక వర్గంలోని గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో 63మంది చిన్నా రులు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి మృతిచెందిన తర్వాత ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి నోటీసులు.

2017 సెప్టెంబర్ 26 : బీహెచ్‌యూలో లైంగిక వేధిం పులు, విద్యార్థినుల ఆందోళనపై పోలీసులు విరుచుకు పడిన ఘటనలపై వివరాలను కోరుతూ ఉత్తర ప్రదేశ్ ప్రధాన కార్యదర్శికి ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీసులు.

2017 అక్టోబర్ 5 : గ్రేటర్ నోయిడాలో గ్యాంగ్‌స్టర్ సుమిత్ గుర్జార్ ఎన్‌కౌంటర్ ఘటనపై నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని యూపీ చీఫ్ సెక్రెటరీకి నోటీసులు.

2017 నవంబర్ 2 : రారుబరేలీలోని ఎన్‌టీపీసీ ఉంచార్ ప్లాంట్‌లో బాయిలర్ పేలి 34 మంది మృతి ఘటనపై వెంటనే నివేదిక అందచేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

2017 నవంబర్ 22 : ఎన్‌కౌంటర్ హత్యలను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రోత్సహిస్తోందంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశిస్తూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది.

2017 డిసెంబర్ 14 : నోయిడాలోని చైల్డ్ రిఫార్మ్ హౌంలో వేధింపుల కేసుకు సంబంధించి డీఐజీ పర్యవేక్షణలో ఒక దర్యాప్తు బృందాన్ని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఏర్పాటుచేసింది. ఘటనా స్థలానికి వెళ్ళి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించింది.

2017 డిసెంబర్ 27 : టార్చ్ లైట్లను ఉపయోగించి వైద్యులు కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్టు వచ్చిన వార్తలపై వివరణ కోరింది.

2017 జనవరి 3 : బారాబంకిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడులేక వార్డ్‌బాయే ఆరోగ్యకేంద్రాన్ని నడుపుతున్నట్టు వచ్చిన వార్తల నేపథ్యంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి నోటీసు జారీ అయ్యాయి.

స్మారక చిహ్నంగా నిర్మాణ్ హౌస్

17న ప్రకటించనున్న నెతన్యాహు

ముంబై :26/11 టెర్రరిస్టు దాడుల సందర్భంగా ముట్టడికి ఉపయోగించిన నిర్మాణ్ హౌస్‌ను ఆ మారణహోమంలో ప్రాణాలను అర్పించిన వారికి అంకితమిస్తూ "స్మారక చిహ్నం"గా మార్పుచేయనున్నారు. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఈ వారంలో ముంబై పర్యటన సందర్భంగా స్మారక చిహ్నం ఏర్పాటుకు సంబంధించి అధికార ప్రకటన చేయనున్నారు. 2008 నవంబరులో పాకిస్థాన్‌కు చెందిన 10 మంది టెర్రరిస్టులు ఈ ప్రాంతంలో జరిపిన దాడిలో చాబాద్ హౌస్‌గా కూడా ప్రసిద్ధి చెందిన నిర్మా ణ హౌస్ డైరెక్టర్లుగా సేవలందించిన రబ్బీ గవ్రెల్, రివ్‌కా హోల్ ట్జబర్గ్ జంటతో పాటు ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ ముంబైలోని కొలబా ప్రాంతంలో ఉన్న ఐదంతస్థుల ఈ భవనాన్ని చాబాద్-లుబవిచ్ ఉద్యమానికి గుర్తుగా సాంస్కృతిక, ఔట్రీచ్ సెంటర్‌గా ఈ జంట నిర్వహిస్తోంది. ఈ దాడి జరిగినప్పుడు ఆ జంటకు రెండేళ్ల బాలుడు ఉన్నాడు. అప్పుడు భారతీయ ఆయా ఆ బాలుడిని సురక్షితంగా కాపాడింది. ఈ మారణహోమం జరిగిన తరువాత మొదటిసారిగా ఆ బాలుడు ఈ వారంలో నిర్మాణ్ హౌస్‌కి తిరిగి వస్తున్నాడు. దాదాపు తొమ్మిదేళ్లకు పైగా ఈ కుటుంబంతో ఆ బాలు డికి సంబంధాలు తెగిపోయాయి. యూదు సంస్థ చాబాద్-లుబావిచ్ ఈ స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఇజ్రా యిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు గురువారం (ఈనెల17న) సందర్శన సందర్భంగా ఈ వియాన్ని అధికారికంగా ప్రకటిస్తారని నిర్మాణ్ హౌస్ ప్రస్తుత అధినేతగా వ్యవహరిస్తున్న రబ్బీ ఇజ్రాయిల్ కాజోలోవస్కీ తెలిపారు.

పాక్, చైనా సరిహద్దులో పెరగనున్న బెటాలియన్లు

- బీఎస్ఎఫ్‌లో ఆరు, ఐటీబీపీలో తొమ్మిది
- భద్రత పటిష్టతకేనన్న అధికారులు

న్యూఢిల్లీ : దేశంలోని రెండు ముఖ్యమైన సరిహద్దు గస్తీ దళాల-బీఎస్ఎఫ్, ఐటీబీపీ-లో కొత్తగా 15 బెటాలియన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, చైనాల వ్యూహాత్మక సరిహద్దు వెంబడి భద్రతను పటిష్టపరిచేందుకు బెటాలియన్లను పెంచాలని ప్రభుత్వం యోచిస్తోందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు. "సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్)లో ఆరు, ఇండో-టిబెటియన్ సరిహద్దు పోలీసు (ఐటీబీపీ) దళంలో తొమ్మిది బెటాలియన్లను పెంచే విషయాన్ని మంత్రిత్వ శాఖ చురుకుగా పరిశీలిస్తోంది" అని ఆ అధికారి చెప్పారు. ఈ బెటాలియన్లు ఒక్కొక్క దానిలో సుమారు వెయ్యి మంది ఆపరేషనల్ జవాన్లు, అధి కారులు ఉంటారు. తమ దళంలోకి కొత్త యూనిట్లు మంజూరైన దృష్ట్యా మానవీయ శక్తిని పెంపొందించాల్సి ఉందని బీఎస్ఎఫ్ వర్గాలు తెలిపాయి. అసోం, పశ్చిమ బెంగాల్‌లలోని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో ఈ అదనపు బెటాలియన్లను నియమించాల్సి ఉందని పేర్కొన్నాయి. ప్రత్యేకించి పంజాబ్, జమ్మూ రీజియన్‌లలో సమీప భవిష్యత్‌లో భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వద్ద సమర్థమంతంగా గస్తీ నిర్వహించాల్సి ఉందని తెలిపాయి. "కొత్త బెటాలియన్లను ఏర్పాటు చేసే కచ్చితమైన ప్రదేశాలను ఇంకా ఎంపిక చేయాల్సి ఉన్నది. బెటాలియన్లను కనుక పెంచితే బంగ్లాదేశ్, పాకిస్థాన్ వెంబడి కొన్ని ప్రాంతాలు ప్రాధాన్యత సంతరిం చుకుంటాయి. చొరబాట్లు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణ, మనుషుల అక్రమ తరలింపు, అక్రమ వలసలు వంటి కారణాల వల్ల ఈ ప్రాంతాలు ప్రాధాన్యత పొందాయి" అని బీఎస్ఎఫ్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.



అదేవిధంగా, అంతర్ బీఓపీ (సరిహద్దు ఔట్ పోస్టు) దూరాన్ని తగ్గించాలని ఐటీబీపీ భావిస్తోంది. విపరీతమైన మంచుతో కూడిన 3,488 కిలోమీటర్ల మేర సరిహద్దు ప్రాంతంలో గస్తీ నిర్వహిం చడం ఇబ్బందికరంగా ఉన్నందున బీఓపీల సంఖ్యను పెంచాలని ఐటీబీపీ యోచిస్తోంది. 'ఐటీబీపీ కోసం కొత్తగా 12 బెటాలియన్లు అవసరం. అయితే, సమీప భవిష్యత్‌లో ఈ విధమైన తొమ్మిది యూనిట్లు అవసరం'' అని ఐటీబీపీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తరచూ చోటుచేసుకుంటున్న అతిక్రమణ ఘటనలు, వాస్తవాధీన రేఖ (ఎల్ఓసీ) వెంబడి చైనా ఆర్మీ కవ్వింపు చర్యలు ఐటీబీపీ తన సభ్యుల సంఖ్యను పెంచాలని భావించడానికి ప్రధాన కారణంగా చెప్పారు. హిమాలయాల సరిహద్దు ప్రాంతంలో సమర్ధమంతంగా నియంత్రించేందుకు సరిహద్దు వెంబడి 47 కొత్త బీఓపీల ఏర్పాటుకు ఇటీవలే ఆమోదం లభించింది. కొత్త బెటాలియన్లు రెండు సరిహద్దు గస్తీ దళాలు మరింత అప్రమత్తతతో గస్తీ నిర్వహించడానికి దోహదపడుతుందని హోం మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు.

ద్వితీయ శ్రేణి పౌరులుగా వలస కార్మికులు

కేంద్రం చూస్తోందని రాహుల్ విమర్శ

లక్నో/న్యూఢిల్లీ : వలస కార్మికులను కేంద్ర ప్రభుత్వం ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణిస్తోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ విమర్శించారు. అడ్రస్ ప్రూఫ్‌గా పాస్‌పోర్టు చెల్లదని వస్తున్న వార్తలను రాహుల్ ప్రస్తావిస్తూ, ఈ నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వ వివక్షతాపూరిత వైఖరిని ప్రదర్శిస్తున్నాయని అన్నారు. ఈ విధమైన చర్యలు భారత వలస కార్మికులను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తోందనడాన్ని ప్రతిబింబిస్తు న్నాయని రాహుల్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. పాస్‌పోర్టు చివరి పేజీలో చిరునామాను ముద్రించరాదని, పాస్ పోర్టు అడ్రస్ ప్రూఫ్‌గా చెల్లదని ప్రకటించాలని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకున్నదని వస్తున్న వార్తల నేపథ్యంలో రాహుల్ ఈ ట్వీట్ చేశారు.

నేడు, రేపు అమేథిలో పర్యటన

గుజరాత్ అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికలో సాధించిన మెరుగైన ఫలితాలు ఇచ్చిన ఉత్సాహంతో ఉత్తరప్రదేశ్‌లో పార్టీకి జీవం పోసేందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చర్యలు చేపడుతున్నారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వం వహించిన ఫ్రంట్ మెరుగైన ఫలితాలు సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎంతో మెరుగైంది. అదే విధానాన్ని ఉత్తరప్రదేశ్‌లో అనుసరించి పార్టీ క్యాడర్‌లో జవసత్వాలు నింపాలని, 2019 లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయాలని రాహుల్ భావిస్తున్నారు. పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత



మొదటిసారిగా తను ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గంలో అమేథిలో సోమవారం నుంచి రెండు రోజులపాటు రాహుల్ పర్యటించనున్నారు. ఈ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాహుల్‌కు పదోన్నతితో పార్టీ శ్రేణులు ఉత్సాహంతో ఉన్నారు. అమేథిలో ఆయనకు గొప్ప సత్కారం చేయాలని భావిస్తున్నారు. గత ఏడాది ప్రారంభంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. రాష్ట్రంలో పార్టీకి పూర్వవైభవం కల్పించే శక్తి యువనేతకు లేదని పార్టీ కార్యకర్తలకు తెలుసు. 47 ఏళ్ల కాంగ్రెస్ నేత అమేథిలోని దాదాపు ఏడు ప్రాంతాలలో రోడ్డుషోలు నిర్వహించే అవకాశం ఉన్నది. "రాహుల్‌గాంధీ రాక కోసం అమేథి ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత మొదటిసారిగా రాహుల్ పర్యటిస్తున్నందున ఆయనకు ఘన స్వాగతం పలకాలని ప్రజలు భావిస్తున్నారు" అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అమర్‌నాథ్ తెలిపారు.

'హిందూరాష్ట్ర'లో ముస్లింలకు స్థానం లేదు

బీజేపీ ఎమ్మెల్యే సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు

బల్లియా : దేశంలో కాషాయీకరణ రోజురోజుకూ పేట్రేగిపోతోంది. మతం పేరుతో దమనకాండ కొనసాగుతోంది. మైనారిటీలపై కాషాయ వర్గాల విద్వేషానికి అడ్డుఅదుపు లేకుండా పోతోంది. ఇందుకు బీజేపీ ఎమ్మెల్యే ఒకరు చేసిన వ్యాఖ్యాలు నిదర్శనం. బీజేపీ పాలనలో దేశం 'హిందూ రాష్ట్రం'గా అవతరిస్తుందని, ఆ తర్వాత ముస్లింలకు ఇక్కడ స్థానం ఉండదని బైరియా ఎమ్మెల్యే సురేంద్ర సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందూ సంస్కృతిని స్వీకరించిన ముస్లింలు మాత్రమే దేశంలో ఉండాలని, మిగతావారు వేరేదేశాల్లో శరణం వెతుక్కోవాలన్నారు. 2024 నాటికి 'హిందూరాష్ట్ర' ఏర్పడుతుందని, ప్రధాని నరేంద్రమోడీ అవతార పురుషుడని సింగ్ అభివర్ణించారు. 2025 నాటికి ఆర్ఎస్ఎస్‌కు 100 ఏళ్లు పూర్తవుతాయని, అప్పటికి హిందూ దేశ స్థాపన జరుగుతుందని, మోడీ, యూపీ సీఎం యోగి నేతృత్వంలోని దేశం గ్లోబల్ సూపర్‌పవర్‌గా ఎదుగుతుందని, 'విశ్వగురువు'గా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీపైనా విమర్శలు గుప్పించారు.

భారత, ఇటలీ దేశస్థులకు జన్మించిన రాహుల్‌లో రెండు రకాల విలువలున్నాయని, అతను ఎన్నటికీ దేశానికి దిక్సూచీ కాలేదని, ఎన్ని నినాదాలు ఇచ్చినా భారత్‌ను పటిష్టవంతం చేసే శక్తిసామర్థ్యం ఆయనకు లేవని సింగ్ విమర్శించారు.

ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ మహాయజ్ఞం

న్యూఢిల్లీ: వచ్చే ఎన్నికలకు రాజకీయ పార్టీలన్నీ సిద్ధమవుతుంటే బీజేపీ మహాయజ్ఞాన్ని ఏర్పాట్లు చేస్తోందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. బీజేపీ ఢిల్లీ ఎంపీ మహేష్‌గిరి అధ్వర్యంలో మార్చిలో చారిత్రక ఎర్రకోట వద్ద మహాయజ్ఞం జరగనున్నట్టు తెలిపాయి. ప్రధాని మోడీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు పాల్గోనున్నట్టు వెల్లడించాయి. 'రాష్ట్ర రక్షా యజ్ఞ' ద్వారా బగ్లాముఖీదేవి ఆశీస్సులు పొంది వచ్చే లోక్‌సభ, రాష్ట్రాల్లో ఎన్నికల్లో గెలుపొందాలన్నది బీజేపీ యోచన. దీనిపై ఈనెల 22న మరింత స్పష్టతవస్తుందని గిరి అన్నారు. అధికారంలో ఉన్న వారిని రాజ్యవ్యవస్థ (పాలనా యంత్రాంగం) దేవత దీవిస్తుందన్నది భక్తుల నమ్మకం. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్‌కు అనుచరుడైన గిరి తన నివాసంలో 'రండి ఓ సంకల్పంచేద్దాం.. దైవార్పణం చేద్దాం' నినాదంతో యజ్ఞం నిర్వహించనున్నట్టు పార్టీవర్గాలు తెలిపాయి. రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌తోపాటు కర్ణాటక రాష్ట్రాన్ని దక్కించుకునేందుకు ఈ మహాయజ్ఞాన్ని నిర్వహించాలని బీజేపీ భావిస్తోంది. ఈ నాలుగు రాష్ట్రాల్లో ఈఏడాదిలోనే ఎన్నికలు జరగనున్నాయి. వీటి ఫలితాల ప్రభావం 2019 ఎన్నికలపై పడుతుందన్న అంచనా ఉంది.

ఎన్సీపీతో పొత్తుపై కాంగ్రెస్‌లో మల్లగుల్లాలు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఎన్సీపీతో పొత్తు పెట్టుకునే విషయమై కాంగ్రెస్ పార్టీ ఆచరణాత్మక సమస్యలను ఎదుర్కొంటోంది. అయితే దీనికి ఏదో ఒక పరిష్కారం తప్పక లభిస్తుందన్న విశ్వాసాన్ని పార్టీ వ్యక్తంచేస్తోంది. 2014లో రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఈ రెండు పార్టీలు వేరుపడ్డాయి. కాంగ్రెస్ సీనియర్ నేత పృధ్వీరాజ్ చవాన్ మాట్లాడుతూ ఎన్సీపీ తమ మద్దతును ఉపసంహరించుకొని, తెగతెంపులు చేసుకొని ఉండకపోతే ఈ కూటమికి 35శాతం ఓట్లు వచ్చేవన్నారు. వేర్వేరుగా పోటీ చేయడం వల్ల రెండు పార్టీలూ నష్టపోయాయన్నారు. ఈ పొత్తును పునరుద్ధరించుకోవడంలో కొన్ని ఆచరణాత్మక సమస్యలు ఉండడం వాస్తవమేనని తెలిపారు. 15ఏళ్ల పాటు ఐక్యంగా రాష్ట్రాన్ని పాలించిన ఈ రెండు పార్టీలు ఏదో ఒక పరిష్కారానికి వస్తాయని చవాన్ అన్నారు. అప్పుడే తుది నిర్ణయం కుదరదని చెప్పారు. ముమ్ముందు ఏం జరగబోతోందన్నది భాండారా-గోండియా లోక్‌సభ ఉప ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు. బీజేపీ సిట్టింగ్ ఎంపీ నానా పటోలే భాండారా- గోండియా స్థానానికి రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరడంతో ఈ స్థానానికి ఉప ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్, ఎన్సీపీలు ఉప ఎన్నికల్లో పోటీచేయడం కోసం పోటీపడుతున్నాయి. అయితే ఎన్‌పీ పీతో పొత్తు విషయంలో గోండియాలోని పార్టీ వర్గాలు అనుకూలంగా లేవు. ఎన్సీపీ కూటమికి కట్టుబడి వ్యవహరించదని, కాంగ్రెస్ కార్యకర్తలను తమవైపుకు తిప్పుకు నేందుకు యత్నిస్తుంటుందని గోండియాలోని కాంగ్రెస్ నేత ఒకరు అన్నారు. ఇదిలావుండగా, సోమ వారం జరిగే భండారా జిల్లా పరిషత్ ఉప ఎన్నికల్లో ఎన్సీపీ, కాంగ్రెస్ చేతులు కలపడం ఆసక్తికరం కాగా గోండియా జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీజేపీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం విశేషం.

38 ప్రతిపాదనలు ఆమోదం

పుదుచ్చేరి : రాష్ట్రంలో మొత్తం 38 ప్రతిపాదనలను పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ ఆమోదించనని వాట్సప్ మెసేజ్ ద్వారా వెల్లడించారు. పరిపాలనలో పారదర్శకత్వంలో భాగంగా ఆమె అనేక స్వతంత్ర్య ప్రతిపాదనలను ప్రభుత్వం ముందు ఉంచారు. వీటిలో ఒకటి,3 జీవిత కాల శిక్ష ఖైదీలను ముందుగానే విడుదల చేయనున్నారని మెసేజ్ పేర్కొంది. యానాంలో జిప్‌మర్ వైద్యవిద్యాలయాన్ని కూడా పుదుచ్చేరికి బదిలీ చేయనున్నారు.

నకిలీ పత్రాలతో విదేశీయుడి పట్టివేత

మహారాజ్‌గంజ్ : ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్‌లో మధ్య ఆఫ్రికాకు చెందిన బిస్‌మార్క్ బకుబాను అరెస్టు చేశారు. నకిలీ వీసా పత్రాలతో నేపాల్‌కు చేరాలనుకున్న అతని ప్రయత్నాన్ని ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. బకుబా భారత్- నేపాల్ సరిహద్దులో ఉంటున్నాడని, అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

ఆందోళనాకారుల సంఖ్య తగ్గుదల

న్యూఢిల్లీ : దేశరాజధానిలో ఆందోళనలు నిర్వహిస్తున్నవారి సంఖ్య తగ్గిందని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. 2016తో పోలిస్తే గతేడాది 11 శాతం తగ్గారని, ఇదివరలో దేశంలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, కార్మికులు, యువత, విద్యార్థులు ఇక్కడ ఆందోళనలు, ర్యాలీలు జరిపేవారన్నారు. 2017లో 9,546 మంది ఆందోళనలు జరపగా, 2016లో 10,784 మంది జరిపారని ప్రత్యేక విభాగం పోలీసులు తెలిపారు. జంతర్‌మంతర్ వద్ద జరిగే ఈ ఆందోళనలను గ్రీన్ ట్రిబ్యునల్ నిషేధించింది.

సీపీఎం ఎమ్మెల్యే రామచంద్రన్ మృతి

తిరువనంతపురం : చెంగనూర్ సీపీఎం ఎమ్మెల్యే కేకే రామచంద్రన్ నాయర్ (65) ప్రైవేటు ఆసుపత్రిలో ఆదివారం చివరి శ్వాస విడిచారు. కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో ఆయన బాధపడుతున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. 2016లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పీసీ విష్ణునాథ్‌ను ఓడించి ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2001లో ఇదే నియోజక వర్గం నుంచి శోభనా జార్జిని ఓడించారు. బార్‌కౌన్సిల్ అధ్యక్షుడిగా కూడా ఆయన సేవలు అందించారు. ఆదివారం సాయంత్రానికి ఆయన పార్థివ దేహాన్ని తీసుకువచ్చి సోమవారం అంత్యక్రియలు జరుపుతారని భావిస్తున్నారు.

ఢిల్లీ - సహరన్‌పుర్ రైలుకు విరామం

ముజఫర్‌నగర్ : న్యూఢిల్లీ - సహరన్‌పుర్ రైలు రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాక్‌లను ఆధునీకరించే ప్రయత్నంలో గత 6 రోజుల నుంచి ఈ సమస్య నెలకొందని ఆదివారం అధికారులు తెలిపారు. జనవరి 14 నుంచి 19 వరకు దీనిని మూసివేస్తున్నామని ముజఫర్‌నగర్ రైల్వే స్టేషన్ అధికారి విపిన్ త్యాగి వెల్లడించారు. న్యూఢిల్లీ నుంచి అంబాలాకు వెళ్లే 8 రైళ్లు దారిమళ్లించామన్నారు. శనివారం షామ్లిలో ప్యాసింజర్ ట్రెన్ పట్టాలు తప్పినా ఎటువంటి నష్టం జరగలేదు.

3 ఏటీఎంలు ధ్వంసం : రూ.7.5 లక్షల దోపిడీ

భుసవాల్ : దోపిడీ దొంగలు గ్యాస్‌కట్టర్ల ఉపయోగించి మూడు ఏటీఎంలను పగుల గొట్టి రూ. 7.5 లక్షలు చోరీచేశారని పోలీసులు తెలిపారు. ఈ ఏటీఎంల్లో కాపలా సిబ్బంది లేరని, ఈ ఘటన ఆదివారం తెల్లవారు జామున జరిగిందన్నారు. నిందితులు దొంగిలించిన కారులో ఉడాయించారని మొదటి ఘటనలో రూ. 3.14 లక్షలు, రెండోదానిలో రూ. 75 వేలు, మూడో ఏటీఎం నుంచి రూ. 3.63 లక్షలతో పారిపోయారని,సీసీటీవీల్లో ముఖాలు కనిపించకుండా ముసుగు వేసుకున్నారన్నారు.

స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్, ఎన్సీపీ దూరం

శ్రీనగర్ : వచ్చేనెల జరగనున్న జమ్ముకాశ్మీర్ పంచాయతీ ఎన్నికల్లో ప్రచారానికి భద్రత కరువైందని రాజకీయపార్టీలు భావిస్తున్నాయి. ఫిబ్రవరి 15 నుంచి పంచాయతీ ఎన్నికలు జరుపుతామని రాష్ట్రప్రభుత్వం వెల్లడించింది. ఈ ఎన్నికలను బాయ్‌కాట్ చేయాలని వేర్పాటువాదులు పిలిపునివ్వడంతో భద్రత రీత్యా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), జమ్ముకాశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (జేకేపీసీసీ) ఈ ఎన్నికలకు దూరంగా ఉంటున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురి మృతి

జైపూర్ : ఎస్‌పీయూ వాహనం టైరు పేలి బోల్తా కొట్టడంతో ముగ్గురు మహిళలతో సహా ఐదుగురు దుర్మరణం చెందగా మరో ఐదుగురికి గాయాలయ్యాయి. కరౌలీలోని హిండౌన్ నుంచి భరత్‌పుర వెళుతుండగా ఆదివారం ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. మృతి చెందిన వారిని బబిత జాతవ్ (28), నరేశ్‌యాదవ్ (25), జులి జాతవ్ (25), మంజిత్ జాతవ్ (30), రాంఫాల్ జాతవ్ (60) గా గుర్తించారు. గాయపడిన వారిని దగ్గర్లోని ఆసుపత్రికి తరలించామన్నారు.

అత్యంత శీతలంగా శ్రీగంగానగర్

జైపూర్ : రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ అత్యంత శీతల ప్రదేశంగా నమోదైంది. అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత 3.2 డిగ్రీలు రికార్డు అయింది. పిలానీ 4.8, అల్వార్ 6, మౌంట్ అబు 7, భిల్వారా 8, చిత్తూర్‌ఘర్ 4, జైపూర్‌ల్లో 9.6 డిగ్రీలు నమోదు అయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది. బికనీర్, ఆజ్మీర్, బుంది, జైసల్మేర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. మరో 24 గంటలపాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ అధికారులు వెల్లడించారు.

భారత్‌లో ఇజ్రాయిల్ నగరం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్రమోడీ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం తీన్‌మూర్తి చౌక్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారై చౌక్ పేరును తీన్‌మూర్తి హైఫాగా మార్పు చేశారు.హైఫా ఇజ్రాయిల్ నగరం పేరు.6 రోజుల పర్యటన కోసం బెంజమిన్ భారత్ చేరుకోగా,ఆయనకు మోడీ ఆహ్వానం పలికారు. ప్రథమ ప్రపంచ యుద్ధంలో సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడి అమరవీరులైన కవల్రీ బ్రిగేడ్‌కు చెందిన ముగ్గురు సైనికులకు నివాళులర్పించి, వారి గుర్తుగా పేరును మార్చారు.

ఇద్దరు బంగారం స్మగ్లర్లు అరెస్టు

న్యూఢిల్లీ : ఢిల్లీ విమానాశ్రయంలో ఇద్దరు బంగారం అక్రమరవాణా దారులను అరెస్టు చేశామని కస్టమ్స్ అధికారులు తెలిపారు. వీరిద్దరూ భారతీ ఎయిర్‌టెల్ బూత్‌లో పనిచేస్తున్నారని రూ. 40 విలువైన బంగారాన్ని తరలించేందుకు తెల్ల ప్లాస్టర్‌లో చుట్టిన ఈ బంగారాన్ని ఎయిర్‌పోర్టు సిబ్బందికి అందించారన్నారు. దుబాయ్ నుంచి వచ్చిన మరో ప్రయాణీకుడి నుంచి 300 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

వెనుక ఎందుకు కూర్చుంటారు ?

పనాజీ : గోవా ముఖ్యమంత్రి మనోహర్‌పారికర్ స్కూటర్ వెనుక కూర్చోవడం పెద్ద చర్చనీయాంశమైంది. మీకుమీరుగా ఎందుకు స్కూటర్ నడపడంలేదని అనేక మంది ప్రశ్నిస్తున్నారు. దీంతో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్లప్పుడూ రాష్ట్ర అభివృద్ధికోసం ఆలోచిస్తాను.. ఒకవేళ నేను స్కూటర్ నడుపుతూ ఆలోచిస్తుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.. అందువల్ల నేను వెనుక కూర్చుంటానని ఆదివారం ఆయన స్పష్టం చేశారు. స్కూటర్‌పైనే వెళ్లి ఆయన స్థానిక మార్కెట్లలో కొనుగోళ్లు కూడా జరుపుతుంటారు.

హెలికాప్టర్ వీడీఆర్ లభ్యం

ముంబై : పవన్ హన్స్ హెలికాప్టర్ వాయిస్ డేటా రికార్డర్ (వీడీఆర్) లభ్యమయింది. ఓఎన్‌జీసీ సిబ్బంది ప్రయాణిస్తున్న ఈ హెలికాప్టర్ శనివారం అరేబియా సముద్రంలో ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. శనివారం మూడు మృతదేహాలు లభ్యం కాగ, మిగతా వాటి కోసం నౌకాదళం గాలింపు ముమ్మరం చేసిందని కోస్టు గార్డు అధికార ప్రతినిధి తెలిపారు. హెలికాప్టర్‌లో ఐదుగురు ఓఎన్‌జీసీ సిబ్బందితోపాటు ఇద్దరు పైలెట్లు ఉన్నారు.

కోడి పందేల బరిలో కొట్లాట



విశాలాంధ్ర - సీతానగరం : తూర్పుగోదావరి జిల్లా పెద్దకొండేపూడి గ్రామంలోని మామిడితోటలో ఆదివారం కోడి పందేల్లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కోడి పుంజుకు కత్తులు కట్టే విషయంలో చెలరేగిన వివాదం చిలికిచిలికి గాలివానలా మారి కొట్లాటకు దారితీసింది. వెదురు బదులులు, కావిడి బద్దలతో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో గందరగోళం నెలకొంది. ఈ దాడుల్లో నాగంపల్లి సర్పంచ్ అడపా గణేష్‌కు తలకు తీవ్ర గాయం కావడంతో శశికళా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తొమ్మిది కుట్లు వేసినట్లు సమాచారం. మరోవ్యక్తికు రాజు కాలుకు కోడి కత్తి తెగడంతో నాలుగు కుట్లు పడ్డాయి. కొంతమందికి దెబ్బలు తగిలాయి. కోడిపందేల నిర్వహణపై ప్రభుత్వం, పోలీసులు ఎంత కఠినంగా ఉన్నప్పటికీ కొనసాగం గమనార్హం.

మరో రెండు ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర - విజయవాడ,(గాంధీనగర్) : సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ నివారణ కోసం కాకినాడ టౌన్ - సికింద్రాబాద్, నరసాపూర్ - హైదరాబాద్ మధ్య రెండు సాధారణ ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 82707 గా ఈనెల 17 తేదీన కాకినాడ టౌన్‌లో రాత్రి 10.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, పిడుగురాళ్ళ, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది. రైలు నంబరు 07049గా ఈనెల 16 తేదీన నరసాపూర్‌లో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, పిడుగురాళ్ళ, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్ స్టేషన్‌లలో ఆగుతుందని అధికారులు పేర్కొన్నారు.



సంక్రాంతి పండగ సందర్భంగా రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా నాగాయలంక తీరంలో రెండవ రోజు ఆదివారం రాష్ట్ర స్థాయి పడవల పోటీలు ఉత్సాహంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తిలకించేందుకు తరలివచ్చారు. విశాలాంధ్ర- అవనిగడ్డ



రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేతగా 'కృష్ణా'

విశాలాంధ్ర - గుడివాడ : కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామంలో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సౌజన్యంతో ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతున్న పీపీఆర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియన్ లీగ్ పోటీల్లో కృష్ణా మహిళలు, పురుషుల జట్లు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. ఆతిథ్య కృష్ణాజిల్లా జట్టు రెండు విభాగాల్లోను ఆధిపత్యం ప్రదర్శించాయి. ఆదివారం రాత్రి ఫైనల్స్‌లో కృష్ణాజిల్లా జట్లు ప్రత్యర్థులపై విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగం ఫైనల్స్‌లో అమరావతి, కృష్ణా జట్లు తలపడ్డాయి. రెండు జట్లలో జాతీయ, రాష్ట్ర క్రీడాకారులు ఉండటంతో తొలి నుంచి పోటీ హెరాహెరీగా సాగింది. ఉత్కంఠ నడుమ చివరిలో కృష్ణా జిల్లా జట్టు గెలుపొంది ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. గుంటూరు, కృష్ణా జిల్లాల పురుషుల జట్ల మధ్య ఉత్కంఠ పోరు సాగింది. కృష్ణాజిల్లా జట్టు గుంటూరు జట్టుపై విజయం సాధించింద. తొలుత కృష్ణా జట్టు ఆధిక్యం ప్రదర్శించినా గుంటూరు జట్టు కట్టడి చేసింది. అంతిమంగా గుంటూరుపై కృష్ణా జిల్లా జట్టు ఒకే ఒక్క పాయింట్ ఆధిక్యంతో విజయం సాధించింది. ఈ పోటీలో కృష్ణా జిల్లా జట్టు 39 పాయింట్లు సాధించగా, గుంటూరు జిల్లా జట్టు 38 పాయింట్లు సాధించింది.



'వాకపల్లి' బాధిత గిరిజన మహిళల నిరసన

విశాలాంధ్ర - జి.మాడుగుల రూరల్ : విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం వాకపల్లి గ్రామంలో పోలీసుల అకృత్యాలకు సంబంధించిన కేసులో బాధ్యులపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోలేదంటూ బాధిత మహిళలు ఆదివారం రోడ్డెక్కారు వాకపల్లి గ్రామ పురవీధుల్లో ఆదివాసీ మహిళలు, గ్రామస్తులతో కలిసి బాధితులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో బాధిత మహిళలు మాట్లాడుతూ 2007 సంవత్సరంలో ఆదివాసీయులైన తమపై అత్యాచారానికి పాల్పడిన పోలీసులపై ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అత్యాచార ఘటనపై స్వేచ్ఛాయుత వాతావరణలో న్యాయ విచారణ జరిపించాలన్నారు. ఘటన జరిగి పదేళ్ళు కావస్తున్నా నేటికీ బాధితులకు ఎటువంటి న్యాయం చేయలేదని విమర్శించారు. అత్యాచారానికి పాల్పడిన పోలీసులను కఠినంగా శిక్షించడంతోపాటు విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. తమకు న్యాయం జరిగేవరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు.



పాపికొండల్లో పర్యాటకుల సందడి

విశాలాంధ్ర - వీఆర్‌పురం : సంక్రాంతి పండుగ సెలవుల్లో పాపికొండల విహారయాత్రకు పర్యాటకులు తరలిరావడడంతో బోట్ పాయింట్ వద్ద సందడి నెలకొంది. వందలాది వాహనాల్లో తరలివస్తున్న పర్యటకులు పాపికొండల అందాలు తిలకిస్తూ పరవశించిపోతున్నారు. గోదావరి నదిపై లాంచీల్లో ప్రయాణిస్తూ పెరంటాలపల్లి గ్రామ వద్ద పురాతన శివాలయంలో శివుడి దర్శనం చేసుకోవడంతో అక్కడ కూడా రద్దీ ఏర్పడింది. అధికారుల ఆదేశాలతో బోటు యాజమాన్యం, నిర్వాహ కులు పర్యాటకుల రక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పర్యా టకులు తప్పనిసరిగా లైట్‌జాకెట్ ధరించేలా సూచనలు చేస్తున్నారు.

నంద్యాల జిల్లా అయ్యేనా..!

కొత్త జిల్లాల ఊహాగానంతో తాజాగా తెరపైకి..



విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : నంద్యాలను జిల్లా కేంద్రంగా చేయాలన్నది ఆ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం. ఈ అంశం అనేకసార్లు తెరపైకి వస్తున్నా కార్యరూపం దాల్చకపోవడం తీవ్ర నిరాశకు గురిచేస్తూనే వస్తోంది. సంక్రాంతి పండగ తర్వాత కొత్త జిల్లాలపై నిర్ణయం తీసుకుంటారనే ప్రచారం నేపథ్యంలో నంద్యాల జిల్లా విషయం ప్రధాన చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో నూతన జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుడితే మొట్టమొదట నంద్యాలనే ప్రకటించే అవకాశాలు ఎక్కువ ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత అయిన నంద్యాలను జిల్లా కేంద్రం చేస్తారన్న ప్రచారం సాగినా అమలుకాలేదు. పీవీ నరసింహారావు ప్రధాని బాధ్యతలు స్వీకరించినప్పుడు మొదటి తెలుగువాడు ప్రధాని అయ్యారని, నంద్యాల పార్లమెంటు స్థానానికి టీడీపీ పోటీ పెట్టకపోవడంతో దేశంలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. తమ చిరకాల కోరిక జిల్లా ఆవిర్భాం నెరువేరు తుందని జనం ఆశపడినా ప్రయోజనం కానరాలేదు. రాష్ట్ర విభజన చట్టంలో నియోజకవర్గాల పెంపు ఒక ప్రధాన అంశం. నవ్యాంధ్రప్రదేశ్‌లో 13 జిల్లాలతో కలిసి 25 పార్లమెంటు నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక్కో పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేస్తారనే ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే 25 జిల్లాల రాష్ట్రం అవుతాయి. 2009 డీలిమిటేషన్ ముందు నంద్యాల పార్లమెంటు నియోజకవర్గంలో ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం ఉండేది. డీలిమిటేషన్ తర్వాత నంద్యాల పార్లమెంటు నియోజకవర్గంలో నంద్యాల, డోన్, బనగానపల్లె, పాణ్యం, ఆళ్ళగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు అసెంబ్లీ నియోజక వర్గాలను చేర్చారు. ప్రస్తుతం జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఏడు సీట్లు నంద్యాల పార్లమెంటు నియోజకవర్గంలోనూ, మరో ఏడు స్థానాలు కర్నూలు పార్లమెంటు నియోజకవర్గంలోనూ ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమకున్న 11 జిల్లాలను 31 జిల్లాలుగా విస్తరణ చేయడంతో ఇక్కడ కూడా జిల్లాల పెంపు ఉంటుందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇప్పటికే నంద్యాల పట్టణంలో రూ.1,200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. పట్టణ వీధుల్లో సీసీ రోడ్లుగా రూపుదిద్దుకుంటున్నాయి. రోడ్ల విస్తరణ జరుగుతోంది. కర్నూలు జిల్లా కేంద్రానికి దీటుగా నంద్యాల రూపురేఖలు మారుస్తామంటూ ఉప ఎన్నికల ముందు ముఖ్యమంత్రి పెద్దఎత్తున నిధులు మంజూరు చేశారు. నంద్యాల పట్టణాన్ని అత్యంత సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు నిధులు మంజూరు చేయడంతో 2019 ఎన్నికలలో నంద్యాల శాసనసభ నుంచి పోటీకి టీడీపీలో రాష్ట్ర స్థాయిలో పేరుగాంచిన ప్రముఖ నాయకుడు దృష్టి సారించినట్లు పుకార్లు లేకపోలేదు.

అన్ని అర్హతలున్నప్పటికీ..

నంద్యాల పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా చేసేందుకు అన్ని అర్హలు ఉన్నాయనేది ఈ ప్రాంతవాసుల వాదన. కర్నూలు జిల్లాలోనే నంద్యాల కీలకమైన ప్రాంతం. అత్యంత రాబడి కలిగిన ప్రాంతం కూడా కోనసీమను తలపించేలా నీటి సౌకర్యం ఈ ప్రాంత సొంతం. కర్నూలు సోనా బియ్యం, మహానంది అరటి తోటలు, శ్రీశైలం, మహానంది యాంగంటి శైవక్షేత్రాలతో పాటు అహోబిలం జ్వాలానరసింహుని క్షేత్రం, నందవరం చౌడేశ్వరీమాత వంటి ప్రసిద్ధ ఆలయాలు ఇక్కడి ప్రత్యేకతలు. బేతంచెర్ల, ఆవుకు, కొలిమిగుండ్ల ప్రాంతాలలో నాపరాతి గనులు, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బెలూమ్ గుహలు, సిమెంట్ పరిశ్రమలు, దేశంలోనే ప్రత్యేకతను సంతరించుకున్న నల్లమల అడవులు, రాజీవ్‌గాంధీ వన్యమృగాల సంరక్షణ కేంద్రం, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఈ ప్రాంతంలోనివే. పావన కృష్ణానది ఈ ప్రాంతం నుంచి పరుగులెడుతుంది. రాష్ట్రంలోనే ఏకైక జలవిద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు శ్రీశైలంలో ఉంది. తెలుగుగంగ, హంద్రీ నీవా ప్రవాహాలతోపాటు ముడి ఖనిజసంపద, విత్తనోత్పత్తి సంస్థలు ఇక్కడ ఉన్నాయి. ఇటీవలే ఓర్వకల్లులో విమానాశ్రయం నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఇంజనీరింగ్, మెడికల్, వ్యవసాయ కళాశాలలు అందు బాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రానికి అవసరమైన అన్ని హంగులు, ఆర్థిక వనరులున్న నంద్యాల జిల్లా అయ్యే అన్ని అర్హతలు ఉన్నందున ఈ సారైనా తమ కల నెరవేరుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ప్రముఖుల ప్రాతినిధ్యంతో ప్రత్యేక గుర్తింపు..

నంద్యాల పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలుపొందిన పెండేకంటి వెంకటసుబ్బయ్య కేంద్రహోంశాఖ మంత్రిగా, గవర్నర్‌గా పనిచేశారు. అనంతపురం జిల్లాకు చెందిన నీలం సంజీవరెడ్డి ఇదే పార్లమెంటు నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించడంతో పాటు లోక్‌సభ స్పీకర్‌గా, భారత రాష్ట్రపతిగా పనిచేశారు. ఎంతో మంది ప్రముఖులు ప్రాతినిధ్యం వహించారు. ఈ సారైనా నంద్యాల ప్రజల కోరిక నెరవేరుతుందో లేదో వేచి చూడాల్సిందే.

రూ.23,209 కోట్లతో రాష్ట్రంలో విద్యావికాసం

రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - ఒంగోలు : రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ విద్యావికాసం కోసం రూ.23,209 కోట్లు కేటాయించి పెద్ద పీట వేశామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ప్రకాశం జిల్లా ఏదుగుండ్లపాడు గ్రామ సమీపంలోని పాత నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో తాత్కాలిక ఐఐఐటీ తరగతుల కోసం గదులతోపాటు పరిసరాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్ఎస్పీ గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఒంగోలు, శ్రీకాకుళంలో రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాజీస్ సెంటర్లను ప్రారంభిస్తున్నామన్నారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీ తాత్కాలికంగా ప్రస్తుతం ఇడుపులపాయలో కొనసాగుతుందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం కొత్తగా 1000 మంది విద్యార్థులు చేరనున్న నేపథ్యంలో మొత్తం మూడువేల మందికి ఇడుపులపాయలో వసతి సౌకర్యం కష్టం కావడంతో ప్రత్యామ్నాయం కల్పించాలని వైస్ ఛాన్సలర్ కోరారన్నారు. ఈ నేపథ్యంలో నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలను పరిశీలించామని, ఇంకా రెండు ప్రదేశాలు చూస్తామన్నారు. సోమవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పి నారాయణ, మరో మంత్రి శిద్దా రాఘవరావుతో చర్చించి శాస్వత స్థలం ఎంపిక చేస్తామన్నారు. మూడు నెలల్లో భవనాల పనులను పూర్తి చేయిస్తామ న్నారు. రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాల్లో 1385 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. జనవరి 24వ తేదీన గవర్నర్‌తో సహా ఉపకులపతుల సమా వేశం విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు వివరించారు. కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు పాల్గొన్నారు.

డోకిపర్రును నెంబర్ వన్ చేస్తాం



విశాలాంధ్ర - గుడివాడ : గ్రామస్తులు సంపూర్ణ సహకారం అందిస్తే డోకిపర్రు గ్రామాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రై లిమిటెడ్ (ఎం.ఈ.ఐ.ఎల్) అధిపతులు పీపీ రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి ప్రకటించారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి తోడ్పాటునిస్తే రానున్న ఐదేళ్లలో ప్రత్యేకంగా నిలుపుతామన్నారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామంలో పామిరెడ్డి కృష్ణారెడ్డి, భద్రమ్మల స్మారకార్థం ఎంఈ ఐఎల్ ఆధర్యంలో రూ. నాలుగు కోట్లతో నిర్మించిన తెలుగు రాష్ట్రాల్లో సౌర విద్యుత్‌తో నడిచే తొలి సురక్షిత మంచినీటి పథకాన్ని ఆదివారం సంస్థ చైర్మన్. ఎండీ పీపీ రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో వీరిద్దరూ మాట్లాడుతూ పుట్టిన ఊరిపై మమకారంతో ఎవ్వరూ అడగక్క పోయినా తాము అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు తాము చదువుకున్న పాఠశాలలను అభివృద్ధి చేయడం తో పాటు జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. వీరిరువురితో పాటు మాజీ సర్పంచ్ పి.వీరారెడ్డిని గ్రామస్తులు సత్కరించారు. పీపీ రెడ్డి సతీమణి రమారెడ్డి. పీవీ కృష్ణారెడ్డి సతీమణి సుధారాణి, నాగేశ్వరరెడ్డి, క్షీరసాగరరెడ్డి పాల్గొన్నారు.

ఫీడ్‌బ్యాక్ ర్యాంకింగ్‌లో జీవీఎంసీకి రెండో స్థానం

అగ్రస్థానంలో తిరుపతి



విశాలాంధ్ర - విశాఖపట్నం : సిటిజన్ ఫీడ్ బ్యాక్ ర్యాంకింగ్‌లో మహా విశాఖ నగర పాలక సంస్థకు రెండో స్థానం దక్కింది. మొదటి స్థానంలో తిరుపతి కొనసాగుతోంది. రాబోయే రోజుల్లో నంబరు వన్ స్థానంలో నిలిచేందుకు జీవీఎంసీ అధికారులు పెద్ద కసరత్తే చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులు మరింత మెరుగుపరచడం ద్వారా నగర ప్రజల మన్ననలతో ఆ కలను సాకారం చేసుకోవాలని భావిస్తున్నారు.

రాష్ట్ర స్థాయిలో పోటీ ఇలా..

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్, స్మార్ట్ సిటీలకు ర్యాంకులు ప్రకటించినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా ర్యాంకుల ప్రకటనకు ఆలోచిస్తోంది. మున్సిపాల్టీల్లో పారిశుద్ధ్యం సేవలపై ప్రజల స్పందనను బట్టి ఈ ర్యాంకులు ఇస్తున్నారు. జనవరి 4వ తేదీ నుంచి మార్చి 10వ తేదీ వరకు ఈ ఫీడ్ బ్యాక్ . ఫైనల్‌గా వచ్చిన మార్కుల ఆధారంగా ర్యాంకు నిర్ణయిస్తారు. ఇప్పటివరకు అందిన ఫీడ్ బ్యాక్ ప్రకారం జీవీఎంసీలో 3,500 మంది మాత్రమే ఫీడ్ బ్యాక్ ఇవ్వడంతో రెండో స్థానంలో ఉంది. జనభాలో 0.1 శాతం మంది ఫీడ్ బ్యాక్ ఇవ్వాలన్నది నిబంధన. దాని ప్రకారం జీవీఎంసీ జనాభా 20 లక్షలున్నందున 20 వేల మంది ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలి. మార్చి 10వ తేదీలోపు 2 లక్షల మందితో ఫీడ్‌బ్యాక్ ఇప్పించాలని జీవీఎంసీ కమిషనర్ ఎం హరినారాయణన్ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం.

ఆరు అంశాలపై ఫీడ్ బ్యాక్

సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో ఆరు అంశాలపై ప్రజలు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్యం, డస్ట్ బిన్స్, పెట్రోలింగ్, సోర్స్ సీగ్రిగేషన్(తడి.పొడి చెత్త వేరు చేయడం), యూజీడీ, మురుగునీటి శుద్ధి తదితర అంశాలపై జనం సంతృప్తి వ్యక్తం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం జీవీఎంసీలో తడిపొడి చెత్త వేరు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీవీఎంసీ ప్రచారం నిర్వహిస్తున్నా తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ప్రజల నుండి స్పందన అంతంతగానే ఉన్నట్లు సమాచారం. జీవీఎంసీలో రోజుకు దాదాపు వెయ్యి టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందులో తడి చెత్త 150 టన్నుల వరకూ ఉంటుంది. దీనిలో 20 లేదా 30 శాతం మాత్రమే సేకరించగలుగుతున్నారు. నగర శివార్లలోనూ, సిటీలోని కొన్ని వార్డుల్లో ఇప్పటికీ తడి, పొడి చెత్త వేరు చేయడంలో ఇబ్బందులు తప్పడం లేదు.

ఫీడ్ బ్యాక్ ఎలా ఇవ్వాలి

నగరవాసులు ఎవరైనా 1969 నంబరుకు డయిల్ చేస్తే కొద్ది సెకన్లలోనే తిరిగి అదే మొబైల్‌కు కాల్ వస్తుంది. అందులో వరుసగా ఆరు ప్రశ్నలు వేస్తారు. కాలర్ చెప్పిన సమాధానాలను నోట్ చేసుకుంటారు. ఇలా కాకుండా రెండో పద్ధతి కూడా ఉంది. స్వచ్ఛ సర్వేక్షన్2018.ఒఆర్‌జీ పోర్టల్‌లోకి వెళ్లి కూడా ఫీడ్ బ్యాక్ ఇవ్వొచ్చు.

పండగపూట విషాదం


- నెల్లూరు జిల్లాలో ఏడుగురు మృతి
- ప్రాణాలుతీసిన మంచుదుప్పటి
- బస్సును తగలబెట్టిన బాధిత బంధువులు

విశాలాంధ్ర - నెల్లూరుబ్యూరో : జిల్లాలో పండగ పూట విషాదం చోటుచేసుకుంది. నెల్లూరు జాతీయ రహదారి ఆదివారం రక్తసిక్తమైంది. రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు అక్కడిక్కడే మృతిచెందగా, మరో 15 మంది తీవ్రగాయాలతో చికిత్స పొందు తున్నారు. ఒక ప్రమాదానికి సంబంధించి బాధితులు ఆగ్రహంతో ఏకంగా బస్సునే దహనం చేశారు. రహదారులపై దట్టంగా కమ్మేసిన మంచు వల్లే ప్రమాదాలు చోటుచేసుకున్నట్టు సమాచారం. నెల్లూరు జాతీయ రహదారిపై ఎన్టీఆర్‌నగర్‌లో ఇన్నోవా వాహనం ఓవర్‌టేక్ చేయబోయి లారీ కిందకు దూసుకుపోవడంతో నలుగురు అక్కడిక్కడే మృతిచెందారు. తోటపల్లి గూడూరు మండలం వెంకన్నపురం గ్రామ సర్పంచ్ ముత్యాల నరసమ్మ (45), ఆమె భర్త మల్లికార్జున(50), పామంజి శ్యామల (40) ఇన్నోవా వాహనంలో నాగూర్ నాగపట్నానికి బయలుదేరారు. నగర పరిసర ప్రాంతం కూడా దాటకముందే పొగమంచు మృత్యురూపంలో కబళించింది. వేగంగా వెళుతున్న ఇన్నోవా వాహనం ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి పక్కనే వెళ్తున్న లారీ మంచులో కనిపించకపోవడంతో దాని కిందకు దూసుకు పోయింది. కారు మొత్తం లారీ కిందకు చొచ్చుకు పోయింది. ఘటనా స్థలానికి చేరుకున్నపోలీసులు కారును బయటకుతీసేందుకు చాలాసేపు శ్రమించా ల్సి వచ్చింది. ప్రొక్లెయిన్‌తో కారును బయటకు తీయడంతో సర్పంచ్ నరసమ్మ, శ్యామల, డ్రైవర్ బాషా మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మల్లి కార్జునను చెన్నై తరలించగా చికిత్స పొందులో మరణించారు. ఇదే రహదారిపై మరికొద్దిసేపటికే కిసాన్‌నగర్ సమీప ప్రాంతం ప్రశాంతి నగర్‌లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు బైకును ఢీకొనడంతో ఒక యువకుడు అక్కడే మృతి చెందాడు. మరో యువకుడు పరిస్థితి విషమంగా ఉంది. స్థానికంగా నివాసం ఉంటున్న మృతుల బంధువులు ఆగ్రహంతో బస్సును తగులపెట్టారు. నగరానికి చెందిన యువకుడు బైకుపై వెళుతుండగా కావేరి ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఆ యువకుడు అక్కడిక్కడే మృతిచెందాడు. మరో ప్రాంతంలో కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో నెల్లూరు యువకుడు రఘు మృతి చెందాడు. కొండాపురం మండలం కొమ్మిగ్రామంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో మేనేజర్ వెంకటేశ్వర్లు(50) శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బైకుపై కొమ్మి నుంచి కావలి వస్తుండగా సిరిపురం క్రాస్ రోడ్డు వద్ద కారు ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. నగర, జిల్లా వ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజామున గంట సమయంలో పొగమంచు కారణంతో జరిగిన ప్రమాదాల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడంతో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. సూర్యోదయం కూడా కాకముందే చోటుచేసుకున్న ప్రమాదాలతో సంక్రాంతి సంబరాల్లో విషాదం నెలకొంది.



వేగంగా కొండవీటివాగు ఎత్తిపోతల నిర్మాణం

- ఇప్పటివరకు 70 శాతం పనులు పూర్తి
- రాజధానికి రక్షణ కవచం
- మార్చి నెలాఖరుకు పూర్తి చేసేలా కార్యాచరణ



విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : కొండవీటివాగు ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి చేసిన అధికారులు వచ్చే మార్చినెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. ఇది పూర్తి అయితే రాజధానికి రక్షణ కవచంగా ఉంటుందని భావిస్తున్నారు. వర్షాకాలంలో ఒక్కసారిగా పొంగిపొర్లే కొండవీటివాగుకు కళ్లెం వేసినట్లు అవుతుంది. గుంటూరు జిల్లాలోని సీతానగరం వద్ద కొండవీటివాగు ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నారు. గత ఏడాది మార్చిలో శంకుస్థాపన చేసిన అధికారులు నిరంతరం పనులు వేగంగా కొనసాగిస్తున్నారు. మొత్తం రూ.240 కోట్లతో చేపడుతున్నారు. వర్షాకాలంలో వాగు ద్వారా వచ్చే నీటిని పంపింగ్ చేసి ప్రకాశం బ్యారేజీలోకి మళ్ళిస్తారు. దీంతో రాజధాని ప్రాంతానికి ముంపు సమస్య ఉండదు. ఎత్తిపోతల పథకం పనుల్లో 24 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రిట్ పనులు కొనసాగాల్సి ఉంది. ఇప్పటివరకు 16,600 క్యూబిక్ మీటర్ల మేర పూర్తి చేశారు. కొండవీటివాగు ఎత్తిపోతల పథకంలో సంప్, పంప్‌కమ్ మోటారు హౌస్, విద్యుత్‌సబ్‌స్టేషన్ నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. ఎస్కేప్ రెగ్యులేటర్ పనులు 65 శాతం, పంపుహౌస్ పనులు 55 శాతం పూర్తయ్యాయి. గతంలో భారీ ప్రాజెక్టులు చేపట్టిన మెగా ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ దీనిని కూడా సకాలంలో పూర్తి చేస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కొండవీటివాగు సామర్థ్యం ఇది

కొండవీటి వాగు సామర్థ్యం ఆరువేల క్యూసెక్కులు. భారీ వర్షాల సమయంలో అదనంగా పది వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. వాగు గరిష్ఠ సామర్థ్యాన్ని 16వేల క్యూసెక్కులుగా అంచనా వేస్తూ ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు. వాగు కృష్ణానదిలో కలిసే ప్రాంతమైన సీతానగరం పీడబ్ల్యూడీ వర్క్‌షాపు వద్ద కరకట్ట వెంట ఎత్తిపోతలను నిర్మిస్తున్నారు. కరకట్ట నుంచి 350 మీటర్ల దూరంలో కొండవీటివాగు వెంట 13 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో మినీ రిజర్వాయర్ కూడా ఏర్పాటు చేయనున్నారు. వరద నీటిని తొలుత ఈ సంప్‌లోకి తరలించి అక్కడ నుంచి బకింగ్‌హోమ్ కాలువలోకి, కృష్ణానదిలోకి మళ్ళిస్తారు. ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించకపోతే వరదల సమయంలో రాజధాని ప్రాంతంలోని వాణిజ్య సముదాయాలు, భవనాలు, గృహాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ నిర్మాణాన్ని వేగవంతం చేసింది.

సకాలంలో పూర్తవుతుంది: గుంటూరు సర్కిల్ ఇరిగేషన్ ఎస్ఈ బాబూరావు

కొండవీటివాగు ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని నిర్దేశించిన సమయానికే పూర్తి చేస్తాం. పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఎత్తిపోతల కోసం 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్, 22 టవర్లు కూడా ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం 16 పంపులు ఉంటాయి. దీనిలో ఒకటి స్టాండ్‌బైగా ఉంటుంది.



విరాట్ ఒంటరిపోరు

- మళ్లీ విఫలమైన టాప్ఆర్డర్
- రాణించిన బౌలర్లు
- సెంచరీ దిశగా కోహ్లి..

రెండో టెస్టులో భారత్ ఎదురీదుతోంది. మరోసారి టాప్ఆర్డర్ విఫలమవడంతో కెప్టెన్ విరాట్ కోహ్లి బాధ్యతను తన భుజాలపై మోస్తూ ఒంటరి పోరాటం చేస్తున్నాడు. మరోసారి రోహిత్ శర్మ విఫలమయ్యాడు. ఛెతేశ్వర్ పుజారా కూడా సత్తా చాటలేకపోయాడు. ఇప్పటికే అన్ని వైపుల నుంచి వస్తున్న విమర్శలకు తోడు, వీరి వైఫల్యాలు కోహ్లికి కొత్త తలనొప్పులు తెచ్చే అవకాశం ఉంది. అయితే భువనేశ్వర్‌ను కాదని ఇషాంత్‌ను తీసుకోవడంతో అతడు మూడు వికెట్లు తీసుకుని రాణించాడు. మరి మూడో రోజు వీరిద్దరూ ఏ మాత్రం రాణిస్తారో చూడాలి.



సెంచూరియన్: భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 335 పరుగుల వద్ద ఆలౌటైంది. 269/6 ఓవర్ నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సఫారీలు.. మరో 66 పరుగులు జోడించి మిగతా నాలుగు వికెట్లు చేజార్చుకున్నారు. ఆదివారం ఆటలో ఓవర్‌నైట్ ఆటగాడు మహరాజ్(18) ఆదిలోనే పెవిలియన్‌కు చేరాడు. మొహ్మద్ షమీ బౌలింగ్‌లో అతడు అవుటయ్యాడు. ఆపై రబదా-డు ప్లెసిస్ జోడీ కాసేపు భారత బౌలింగ్‌ను ప్రతిఘటించింది. ఈ జోడి 42 పరుగులు జత చేసిన తర్వాత రబదా(11) ఎనిమిదో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఇషాంత్ శర్మ బౌలింగ్‌లో రబదా ఇచ్చిన క్యాచ్‌ను హార్దిక్ పాండ్యా అద్భుతంగా పట్టుకున్నాడు. ఫార్వర్డ్ లెగ్ నుంచి డీప్ స్క్వేర్ లెగ్ వైపు పరుగెత్తుకుంటూ వచ్చిన పాండ్యా క్యాచ్‌ను డైవ్ కొట్టి పట్టుకున్నాడు. అటు తరువాత డు ప్లెసిస్(63)ను ఇషాంత్ శర్మ బౌల్డ్ చేశాడు. ఇక చివరి వికెట్‌గా మోర్కెల్(6) పెవిలియన్ చేరాడు. రవి చంద్రన్ అశ్విన్ బౌలింగ్‌లో మురళీ విజయ్‌కు క్యాచ్ ఇచ్చి మోర్కెల్ అవుటయ్యాడు. అశ్విన్ నాలుగు వికెట్లు సాధించగా, ఇషాంత్ శర్మ మూడు వికెట్లు తీశాడు. షమీకి వికెట్ దక్కింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియా 28 పరుగుల వద్ద లోకేష్ రాహుల్ (10) వికెట్‌ను కోల్పోయింది. వెంటనే ఛెతేశ్వర్ పుజారా పరుగులేమీ చేయకుండా డకౌట్ అయ్యాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన కోహ్లి, మురళీ విజయ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత స్వీకరించాడు. అడపా, దడపా షాట్లు కొడుతూ ఈ జోడీ స్కోరు బోర్డు వేగం పెంచింది. ఈ క్రమంలోనే కోహ్లి తన అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మంచి ఊపుమీద ఉన్న మురళీ విజయ్ (46)ను మహరాజ్ దెబ్బతీశాడు. తరువాత వచ్చిన రోహిత్ శర్మ(10) కూడా ఎక్కువ సేపు క్రీజ్‌లో నిలవలేదు. పార్థీవ్ పటేల్ కూడా ధాటిగా ఆడి 19 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ తరుణంలో క్రీజ్‌లోకి వచ్చిన హార్దిక్ పాండ్యా-కోహ్లితో పరుగులు రాబట్టే ప్రయత్నం చేస్తున్నాడు. దీంతో రెండో రోజు ఆటముగిసే సమయానికి భారత్ ఐదు వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేసింది. క్రీజ్‌లో కోహ్లి 85, పాండ్య 11 ఉన్నారు.



షమీ అరుదైన ఘనత

సెంచూరియన్: టీమిండియా పేసర్ మొహ్మద్ షమీ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. టెస్టుల్లో అత్యంత వేగవంతంగా వంద వికెట్లు సాధించిన మూడో భారత్ పేసర్‌గా షమీ గుర్తింపు సాధించాడు. దక్షిణాఫ్రికాతో ఇక్కడ జరుగుతున్న రెండో టెస్టులో మహరాజ్‌ను అవుట్ చేయడం ద్వారా వందో వికెట్‌ను షమీ ఖాతాలో వేసుకున్నాడు. ఇది షమీకి 29వ టెస్టు కాగా, కపిల్ దేవ్(25 టెస్టులు), ఇర్ఫాన్ పఠాన్(28 టెస్టులు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. ఇక్కడ జవగళ్ శ్రీనాథ్(30 టెస్టులు) నాలుగో స్థానంలో ఉండగా, ఇషాంత్ శర్మ(33 టెస్టులు) ఐదో స్థానంలో ఉన్నాడు.

ఇంగ్లండ్ ఘన విజయం



మెల్‌బోర్న్: సుదీర్ఘ ఆస్ట్రేలియా పర్యటనలో ఇంగ్లండ్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఆసీస్‌తో ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌లో ఒక్క విజయం కూడా సాధించలేకపోయిన ఇంగ్లండ్..అదే జట్టుతో జరిగిన తొలి వన్డేలో ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆసీస్ విసిరిన 305 పరుగుల భారీ లక్ష్యాన్ని ఇంగ్లండ్ 48.5 ఓవర్లలో ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఇంగ్లండ్ ఓపెనర్ జాసన్ రాయ్(180) వీరోచితంగా ఆడగా, జోరూట్(91 నాటౌట్) సమయోచితంగా ఆడాడు. ఈ జోడీ మూడో వికెట్‌కు 221 పరుగుల భాగస్వామ్యాన్ని సాధించడంతో ఇంగ్లండ్ అవలీలగా గెలుపును అందుకుంది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 50 ఓవర్లలో 304 పరుగులు చేసింది. అరోన్ ఫించ్(107), మిచెల్ మార్ష్(50), స్టోనిస్(60)లు సత్తాచాటడంతో ఆసీస్ మూడొందల పరుగుల మార్కును చేరింది.

జాసన్ రాయ్ కొత్త రికార్డు

ఇంగ్లండ్ ఓపెనర్ జాసన్ రాయ్ సరికొత్త రికార్డు సృష్టించాడు. ఇంగ్లండ్ తరపున వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన జాసన్ రాయ్(180,151 బంతుల్లో 16 ఫోర్లు, 5 సిక్సర్లు) రికార్డు నెలకొల్పాడు. ఫలితంగా 2016లో పాకిస్తాన్‌పై అలెక్స్ హేల్స్(171) నెలకొల్పిన అత్యధిక పరుగుల వన్డే రికార్డును రాయ్ బ్రేక్ చేశాడు.



అండర్-19 శుభారంభం

మౌంట్ మాంగనూ: అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత్ శుభారంభం చేసింది. గ్రూప్-బిలో భాగంగా ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఆస్ట్రేలియాపై వంద పరుగుల తేడాతో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. మూడుసార్లు ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత్.. పటిష్ట ఆసీస్‌పై గెలుపుతో ఈ టోర్నీలో తన ఆగమనాన్ని ఘనంగా చాటింది. భారత్ నిర్దేశించిన 329 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆసీస్ చతికిలబడింది. 42.5 ఓవర్లలోనే 228 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ ఎడ్వర్డ్ 73, హోల్ట్ 39, జొనాథన్ 38, మ్యాక్స్ బ్రాంట్ 29 పరుగులతో రాణించగా.. మిగతా బ్యాట్స్‌మన్ నామమాత్రపు స్కోరుకే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో శివమ్ మావి, నగర్‌కోటి చెరో మూడు వికెట్లు తీయగా.. అభిషేక్ శర్మ, సుధాకర్ రాయ్ తలో వికెట్ తీసుకున్నారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యువ భారత్.. సారథి పృథ్వీషా, మన్‌జోత్, శుభ్‌మన్ గిల్ చెలరేగి ఆడటంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరును సాధించింది. ఓపెనర్లుగా బరిలోకి దిగిన పృథ్వీ షా(94), మన్‌జోత్(86) చెలరేగి ఆడి ఆసీస్ బౌలర్లకు చుక్కలు చూపించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 180 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. శతకానికి చేరువైన షా 30వ ఓవర్‌లో సుదర్‌లాండ్ బౌలింగ్‌లో హోల్ట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన శుబ్‌మన్ గిల్(63) కూడా దూకుడుగా ఆడాడు. భారత బ్యాట్స్‌మెన్లలో అభిషేక్ శర్మ 23, రాణా 14, నగర్‌కోటి 11, శివసింగ్ 10, జుయల్ 8, రాయ్ 6 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో ఎడ్వర్డ్ 4 వికెట్లు తీయగా.. సుదర్‌లాండ్, ఉప్పల్, వా తలో వికెట్ తీశారు.

కోహ్లికి మళ్లీ పెళ్లి

ముంబై: టీమిండియా సారథి విరాట్ కోహ్లి-బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మలు గత నెలల్లో ఇటలీలో ఘనంగా పెళ్లి చేసుకున్నారు. హనీమూన్ అనంతరం భారత్‌కు తిరిగొచ్చి ఢిల్లీలో కుటుంబ సభ్యులు, వీవీఐపీలకు విందు ఇచ్చారు. తర్వాత ముంబైలో క్రికెటర్లకు రిసెప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం సౌతాఫ్రికా టూర్‌లో కోహ్లి బిజీగా ఉండగా, వెంట కొత్త పెళ్లికూతురు అనుష్క కూడా వెళ్లింది. అయితే వీరద్దరూ మరోమారు పెళ్లి చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. కోహ్లి-అనుష్కలు పెళ్లి చేసుకుని నెల రోజులైనా కాకముందే మళ్లీ వారు పెళ్లి చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు హోరెత్తుతున్నాయి. దీనికి కారణం కూడా ఉంది. వీరిద్దరూ ఇటలీలో పెళ్లి చేసుకోవడంతో వారికి మ్యారేజ్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు అధికారులు నిరాకరించారట. దీంతో ఇక్కడ మళ్లీ పెళ్లి చేసుకోవడం ద్వారా మ్యారేజ్ సర్టిఫికెట్‌కు అప్లై చేయాలని భావిస్తున్నారట.

రిషబ్ పంత్ కొత్త రికార్డు



న్యూఢిల్లీ: టీమిండియా ఆటగాడు, ఢిల్లీ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ సరికొత్త రికార్డు సృష్టించాడు. ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో జరుగుతున్న నార్త్ జోన్ టీ20 లీగ్ (సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ)లో రిషబ్ పంత్ చెలరేగిపోయాడు. హిమాచల్‌ప్రదేశ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో పంత్ కేవలం 32 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి టీ20 చరిత్రలో రెండో అత్యంత వేగవంతమైన సెంచరీ నమోదు చేశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన హిమాచల్‌ప్రదేశ్ 144 పరుగులు విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బరిలోకి దిగిన ఢిల్లీ జట్టు కేవలం 11.4 ఓవర్లలోనే విజయం సాధించింది. క్రీజులోకి వచ్చిన రిషబ్ పంత్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. బంతిని ఎడాపెడా బౌండరీలకు పంపిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మొత్తం 38 బంతులు ఎదుర్కొన్న పంత్ 12 సిక్సర్లు, 8 ఫోర్లతో అజేయంగా 116 పరుగులు చేశాడు. మరో ఎండ్‌లో ఉన్న గంభీర్ 33 బంతుల్లో 30 పరుగులు చేసి నౌటౌట్‌గా నిలిచాడు. టీ20ల్లో వేగవంతమైన సెంచరీ రికార్డు క్రిస్‌గేల్ పేరుపై ఉంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భాగంగా 2013లో పుణె వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గేల్ 30 బంతుల్లోనే 100 పరుగులు చేశాడు.



క్రీడలకు ప్రత్యేక నిధులు

- కేటాయించాలన్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు
- ముప్పాళ్ల గ్రామస్తులు అభినందనీయులు

విశాలాంధ్ర-ఈపూరు: ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తూ ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రైతు మిత్ర ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఆదివారం ముప్పాళ్ల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక క్రీడల్లో రాణిస్తూ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను కనబరచాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలలో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. కిదాంబి శ్రీకాంత్, పీవీ సింధు, సానియా మీర్జా, సైనా నెహ్వాల్, అభినవ బింద్రా, పుల్లెల గోపీచంద్ లాంటి జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అనేక పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, క్రీడా పరికరాలు లేకపోవడం వల్ల వారు ఆటలకు దూరమౌతున్నారని ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించి వారి కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తే, క్రీడల్లో రాణించగలుగుతారన్నారు. ముప్పాళ్లలో నిర్విరామంగా 26 ఏళ్లుగా గ్రామస్తులందరూ ఐక్యమత్యంగా కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినంద నీయమన్నారు. అనంతరం కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, గ్రామ స్తులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలుగుదనానికి, సంప్రదా యాలకు ప్రతీకలుగా పండుగలు నిలుస్తాయని, తెలుగు సంస్కృతి, సంప్రదా యాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ముప్పాళ్ల సెంటర్ నుంచి పోటీలు జరిగే ప్రదేశం వరకు ముప్పాళ్లను తప్పెట తాళాలతో ఊరేగిస్తూ గ్రామస్తులు తీసుకువెళ్లారు. ఈ నెల 13 నుంచి 16 వరకు జరిగే ఈ పోటీల్లో ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి మొత్తం 64 జట్లు పాల్గొన్నాయి. సీపీఐ ఏరియా కార్యదర్శి ఏ.మారుతివరప్రసాద్, నాయకులు బూదాల శ్రీను, శిలార్, సాగర్‌బాబు, మండల కార్యదర్శి పూట్ల రామారావు, సూరె బ్రహ్మయ్య, సూరె అప్పారావు, సూరె కోటయ్య, సూరె శ్రీను, కట్టా కోటయ్య పాల్గొన్నారు.

పీసాపోలో భారతజట్టు కోచ్‌గా శ్రీనివాసరావు



విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: నేపాల్ జరిగే సౌత్ ఏషియన్ పీసాపోలో పాల్గొనే భారత జట్టుకు చీఫ్ కోచ్‌గా విజయవాడకు చెందిన సరళా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈయన పీసాపోలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 18 నుంచి 22 వరకు అండర్-14, 17 సీనియర్ విభాగాల్లో పాల్గొనే జట్లకు శ్రీనివాస్ కోచ్‌గా వ్యవహ రిస్తారు. ఈ సందర్భంగా శాప్ ఓఎస్‌డి పి.రామకృష్ణ, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి యూవీ రాఘవులు, కృష్ణాజిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ చైతన్యకుమార్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కృష్ణాజిల్లా కార్యదర్శి కాకార్ల శ్రీనివాసరావు, పలవురు పీసాపోలో అసోసియేషన్ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

విభజన హామీలు తుంగలో తొక్కారు

- అవినీతి ఊబిలో బీజేపీ
- బీజేపీ-టీడీపీ ఆధిపత్యపోరుతో కుంటుపడిన రాష్ట్రాభివృద్ధి
- పోలవరం, రాజధాని నిర్మాణ వ్యయం కేంద్రానిదే
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ



విశాలాంధ్ర - కందుకూరు: విభజన సమయంలో ఏపీకిచ్చిన హామీలను అమలు పరచడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా కందుకూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో కందుకూరు ఏరియా కార్యదర్శి పోకూరు మాలకొండయ్య అధ్యక్షతన జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లు దాటినా విభజన చట్టంలోని హామీలను నేరవేర్చటంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించడంతో పుణ్యకాలమంతా గడిచిపోయిందని నారాయణ తెలిపారు. నాలుగేళ్లు టీడీపీ అధికారంలో ఉండీ ఏమీ సాధించలేదన్నారు. బీజేపీ-టీడీపీకి చెందిన నలుగురు మంత్రులు ఉన్నా ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాష్ట్రంపై చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. పోలవరం నిర్మాణ బాధ్యతను పూర్తిగా కేంద్రం భరించాలన్నారు. ప్రధానమంత్రి ముఖ్యమంత్రికి అపాయిమెంట్ ఇవ్వక పోవడం అవమానపర్చినట్లేనని, రాష్ట్ర టీడీపీ ఎంపీలు ప్రధానమంత్రిని ఇటీవల కలిసారే తప్ప సమస్యలపై అడగక పోవడం సిగ్గు చేటని ఆయన ఆరోపించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఇద్దరు కలిసి పత్రికా ప్రకటన ఇవ్వాలి గానీ అలా జరగలేదనీ, రాజకీయ బలంతో కేంద్రంతో పోరాటం చేయడంలో చంద్రబాబు మోడీని చూసి భయపడుతున్నారని ఆరోపించారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ఎదుర్కొంటూ పోరాటం చేస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన విభజన సమస్యలను పరిష్కారానికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు మోడీపై ఒత్తిడి తీసుకు రాలేకపోతున్నాయన్నారు. మమతా బెనర్జీని చూసి అయినా చంద్రబాబు నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంపై పోరాటం చేస్తున్న నాయకులపై సీబీఐ చేత కేసులు నమోదు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు. అవినీతి రహిత ప్రభుత్వంగా బీజేపీ ప్రకటించుకుందని అయితే పెద్దనోట్ల రద్దు సమయంలో భారీగా అవినీతి జరిగిందన్నారు. ప్రజల సొమ్మును దోచుకోవడం, ఏగవేత కార్పొరేట్ సంస్థలకు పంచే విధంగా కొత్త చట్టం ఎఫ్ఆర్‌డీఐని అమలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఈ చట్టం అమలైతే పేదలు తమ శ్రమతో కొద్ది కొద్దిగా దాచుకున్న సొమ్మును తిరిగి అవసరాలకు పొందేందుకు అవకాశం ఉందడని ఆయన చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి ఎందుకు చనిపోయాడే కేంద్రం తెలపాలని డిమాండు చేశారు. పలు సమస్యలపై కేంద్ర ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు వాగ్మూలంలో ఉన్నప్పటికి సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తి సహకారంతో కేసును భూస్థాపితం చేసేందుకు కుట్ర జరిగిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో దేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా సుప్రీం కోర్టు ప్రధాన జడ్జిపైనే ఇతర జడ్జిలు ఆరోపణలు చేయడం చూస్తుంటే, బిజేపీ ప్రభుత్వం చేస్తున్న చర్యలు దేశ భవిష్యత్‌కు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సీపీఐ కందుకూరు సహాయ కార్యదర్శి బి.సురేష్, సీపీఐ సీనియర్ నాయకులు వలేటి రాఘవులు, కార్యవర్గ సభ్యులు నాయకులు పీ బాలకోటయ్య, డీ రత్నం, బండి రమణమ్మ, మహిళా జిల్లా సమాఖ్య కార్యదర్శి ఎస్ రావమ్మ, ఎం.లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, ఆనంద్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.